


అనంత
# జనశక్తి
జనం కోసమే మా అక్షరం

25.08.2026
మంగళవారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 104
పేజీలు : 08 | వెల: రూ.5

AJS
అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## దేశాభివృద్ధి ఎలా సాధ్యం?

- పాఠశాలల్లో ప్రాథమిక సౌకర్యాల్లేవు
- సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే
- ప్రజా విద్యను ప్రాధాన్యతగా తీసుకోవాలి
- కేంద్ర విద్యా శాఖ మంత్రికి లేఖ

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 24, అనంత జనశక్తి న్యూస్**

ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా ఉందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కన్వీనర్ అభిజీత్ దీప్కే ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రాథమిక సౌకర్యాలు లేవన్నారు. ఈ నేపథ్యంలో దేశాభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. ప్రజా విద్యను ప్రాధాన్యతగా తీసుకొని పాఠశాలలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సోమవారం కేంద్ర విద్యా శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి సీజేపీ కన్వీనర్ అభిజీత్ దీప్కే లేఖ రాశారు.



2లో..

## మిస్ యూనివర్స్ ఇండియా 2026 విజేతగా కేరళ కుట్టి కాజియా లిజ్ మెజో

### జైపూర్‌లో జరిగిన గ్రాండ్ ఫినాలే
### 52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి..

**జైపూర్, ఆగస్ట్ 24, అనంతజనశక్తి న్యూస్**

కేరళకు చెందిన 19 ఏళ్ల లా విద్యార్థిని, మోడల్ కాజియా లిజ్ మెజో 'మిస్ యూనివర్స్ ఇండియా 2026' కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. జైపూర్‌లో జరిగిన గ్రాండ్ ఫినాలేలో 52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి ఆమె విజేతగా నిలిచారు. దీంతో నవంబర్‌లో పోర్టో రికోలో జరగనున్న 75వ మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్ తరపున ఆమె బరిలోకి దిగనున్నారు.

2లో..



## బంగ్లాదేశ్‌లో హిందూ కుటుంబం హత్య



2లో..

# వ్యవసాయాన్ని ఆర్థిక శక్తిగా మార్చాలి!

- రైతులు ఫుడ్ ప్రాసెసింగ్‌లోకి రావాలి
- సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి
- వినూత్న ఆలోచనలతోనే వ్యవసాయం
- మరింత అభివృద్ధి సాధ్యమని కామెంట్
- రైతులపై ఉపరాష్ట్రపతికి ఎంతో ప్రేమ ఉంది
- రైతులను ప్రోత్సహించేందుకు వచ్చారు
- పాప్‌కార్న్ ఉత్పత్తి సామర్థ్యం పెరిగింది
- వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేస్తే..
- రైతులకు మరింత ఆదాయం

2లో..

**ఏలూరు, ఆగస్ట్ 24, అనంతజనశక్తి న్యూస్**

రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా ఫుడ్ ప్రాసెసింగ్, ప్రత్యామ్నాయ పంటల వైపు అడుగులు వేయాలని ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు సూచించారు. వ్యవసాయాన్ని కేవలం పంటల ఉత్పత్తిగా కాకుండా.. ఆర్థిక శక్తిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఏలూరు జిల్లా నూజివీడులో పాప్‌కార్న్ ఉత్పత్తి, ప్రాసెసింగ్ పరిశ్రమను ప్రస్తావిస్తూ.. వినూత్న ఆలోచనలతోనే వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.



## కాస్త ఆలస్యమైనా నదుల అనుసంధానం చేస్తాం

- ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ వెల్లడి
- నేను తెలుగు అర్థం చేసుకోగలను, కానీ మాట్లాడలేను
- పాప్ కార్న్ మొక్కజొన్నను దిగుమతి మానేస్తున్నాం
- మనమే అమెరికాకు ఎక్స్‌పోర్ట్ చేయాలి

2లో..



రైతులపై ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు ఎంతో ప్రేమ ఉందని చంద్రబాబు అన్నారు. పాప్‌కార్న్ పరిశ్రమ గురించి పత్రికలో చదివి రైతులను ప్రోత్సహించేందుకు ఆయన వచ్చినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. 'నూజివీడులో ఇలాంటి వినూత్న ఆవిష్కరణ జరగడం రాష్ట్రానికి గర్వకారణం. దేశవ్యాప్తంగా సుమారు 3,400 సినిమా థియేటర్లకు పాప్‌కార్న్ సరఫరా చేసే స్థాయికి ఈ పరిశ్రమ ఎదిగింది. పాప్‌కార్న్ ఉత్పత్తి సామర్థ్యం కూడా గణనీయంగా పెరిగింది. వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి విలువను పెంచితే రైతులకు మరింత ఆదాయం లభిస్తుంది. అరకు కాఫీ, పామాయిల్, మిరప, మామిడి, పసుపు, మొక్కజొన్న వంటి వాణిజ్య పంటలు రాష్ట్రానికి గర్వకారణం. వీటికి ప్రత్యేక బ్రాండ్లు రూపొందించి అంతర్జాతీయ మార్కెట్లకు పంపితే మంచి డిమాండ్ ఉంటుంది' అని సీఎం పేర్కొన్నారు.

## ఢిల్లీని ముంచెత్తిన వాన జనజీవనం అస్తవ్యస్తం

- విమానాలు దారి మళ్లింపు
- 262 విమాన సర్వీసులపై ప్రభావం
- ప్రధాన రహదారులన్నీ జలమయం

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 24, అనంతజనశక్తి న్యూస్**

ఉత్తర భారత్‌లో రుతుపవనాలు తీవ్ర రూపం దాల్చడంతో ఢిల్లీఎన్‌సీఆర్ సహా పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, ఈదురు గాలులు విరుచుకుపడ్డాయి. నోయిడా, ఘాజియాబాద్, గుర్గావ్, ఫరీదాబాద్ ప్రాంతాలను ముంచెత్తిన వానల వల్ల జనజీవనం స్తంభించడమే కాకుండా రవాణా వ్యవస్థకు తీవ్ర విఘాతం కలుగుతోంది. ప్రతికూల వాతావరణం కారణంగా ఢిల్లీ ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి రావాల్సిన 15 విమానాల రూట్లను అధికారులు దారి మళ్లించారు.

2లో..

## మతం మారాలని సాధిక్ ఒత్తిడి చేశాడు

- సౌజన్య తీవ్రంగా వ్యతిరేకించింది
- కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్



2లో..

## యువతకు హామీ నెరవేరుస్తున్నాం

- జాబ్ క్యాలెండర్‌పై పవన్ కళ్యాణ్!
- ప్రతిభే కొలమానంగా పోస్టులు భర్తీ చేస్తాం
- జాబ్‌ల భర్తీ అవినీతికి ఆస్కారం లేదు
- అర్హులైన వారికే ఉద్యోగాలు వస్తాయి



**అమరావతి, ఆగస్ట్ 24, అనంతజనశక్తి న్యూస్**

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ప్రతిభే ప్రధాన కొలమానంగా ఉంటుందని స్పష్టం చేశారు.

2లో..

## 'ఫీజు బకాయిబీజేపీ లడాయి'

- బీజేపీ పోరాటం కొనసాగుతోంది
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశం
- రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు
- 5 లక్షల మంది విద్యార్థుల సంతకాలు సేకరించాం

2లో..

**హైదరాబాద్, ఆగస్ట్ 24, అనంతజనశక్తి న్యూస్**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బీజేపీ పోరాటం కొనసాగుతోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేవైఎం ఆధ్వర్యంలో కాలేజీలకు వెళ్లి 5 లక్షల మంది విద్యార్థుల నుంచి సంతకాలు సేకరించామని తెలిపారు. "మా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మాకివ్వండి" అంటూ విద్యార్థులు స్వయంగా సంతకాలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారని తెలిపారు. 'ఫీజు బకాయిబీజేపీ లడాయి' పేరుతో బీజేపీ దీక్ష చేపట్టిన సందర్భంగా సోమవారం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు.

## షేర్ చేస్తే చర్యలు తప్పవు ఆ ఎన్నికల షెడ్యూల్ అబద్ధం

- ఎన్నికల కమిషనర్ వార్నింగ్
- ఇది పూర్తిగా దుష్ప్రచారమని వెల్లడి
- అనిల్ చంద్ర పునేఠా క్లారిటీ

2లో..

**అమరావతి, ఆగస్ట్ 24, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఇదేనంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై ఏపీ ఎన్నికల సంఘం స్పందించింది. స్థానిక ఎన్నికల షెడ్యూల్ పేరుతో దుష్ప్రచారం జరుగుతోందని కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా స్పష్టం చేశారు.

## జాబ్ నోటిఫికేషన్లు ఏవి?

- లిక్కర్ నోటిఫికేషన్లు ఇస్తున్నారు
- మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం
- 121 మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్‌పై ఫైర్
- యువత ఉద్యోగాల కోసం చూస్తున్నారు



**హైదరాబాద్, ఆగస్ట్ 24, అనంతజనశక్తి న్యూస్**

**తెలంగాణ ప్రభుత్వం కొత్తగా 121 రకాల మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్ ఇవ్వడంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వకుండా.. మద్యం బ్రాండ్లకు మాత్రం నోటిఫికేషన్లు జారీ చేస్తున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు మాత్రం ఫుల్' అంటూ హరీశ్ రావు ఎద్దేవా చేశారు. యువత భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై దృష్టి పెట్టకుండా మద్యం వ్యాపారంపై ఎందుకు అంత ఆసక్తి చూపుతోందని ప్రశ్నించారు.**

రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హరీశ్ రావు పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం లిక్కర్ అమ్మకాలపైనే ఎక్కువ శ్రద్ధ చూపుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రభుత్వ తీరుపై విమర్శలు చేశారు.

**121 కొత్త మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్**

తెలంగాణలో కొత్తగా 121 రకాల మద్యం బ్రాండ్లు అందుబాటులోకి రానున్నట్లు ఆదివారం ప్రకటన వెలువడింది. సుమారు 18 కంపెనీలకు చెందిన మద్యం సరఫరాదారులు ఈ బ్రాండ్లను రాష్ట్రంలో ప్రవేశపెట్టనున్నట్లు ఎక్సైజ్ శాఖ తెలిపింది.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
మంగళవారం | అనంతపురం
25.08.2026



# దేశాభివృద్ధి ఎలా సాధ్యం?

(మొదటి పేజీ తరువాయి)



ఈ సమస్యను పరిష్కరించే ముందు ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై సమాచారం అందుబాటులో ఉంచాలని కేంద్రాన్ని ఆయన కోరారు. అందుకు సంబంధించిన వివరాలను విద్య శాఖ బహిరంగ పర్చాలని విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్లలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలు పునరుద్ధరించబడ్డాయని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం ఎన్నింటికి మరమ్మతులు లేదా పూర్తి పునర్నిర్మాణం అవసరం ఉందో వివరించాలని ఆ లేఖలో స్పష్టం చేశారు.
అలాగే ప్రస్తుతం ఎన్ని ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేశారు. వాటిలో ఎన్ని భర్తీ అయ్యాయి? ఇంకా ఎన్ని ఖాళీగా ఉన్నాయో వెల్లడించాలని కోరారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలలకు ఎన్ని నిధులు కేటాయించారు? అందులో ఎంత ఖర్చు చేశారు? కూడా తెలపాలని అన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించేందుకు ఇంకా ఎన్ని అదనపు ప్రభుత్వ పాఠశాలలు అవసరం? అవుతాయో కూడా చెప్పాలని కేంద్ర విద్యా శాఖ మంత్రిని కోరారు. బోధనతో పాటు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు ఇంకా ఇతర ఏఏ విధులు, బాధ్యతలు అప్పగించారో కూడా చెప్పాలని కేంద్రాన్ని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్ని ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు, డిజిటల్ లెర్నింగ్ సౌకర్యాలు, శుభ్రంగా పని చేసే టాయిలెట్లు, సరైన క్రీడా సౌకర్యాలతోపాటు పరికరాలు ఉన్నాయో కూడా వివరించాలని కేంద్ర మంత్రికి రాసిన లేఖలో స్పష్టం చేశారు. అయితే ఈ లేఖ తాను రాజకీయం కోసం కాదని.. ఇది విద్యార్థుల భవిష్యత్తు గురించి రాసిన లేఖ అంటూ కేంద్ర విద్యా మంత్రి ప్రహ్లాద్ జోషికి అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు.

# మిస్ యూనివర్స్ ఇండియా 2026 విజేతగా కేరళ కుట్టి కాజియా లిజ్ మెజో



(మొదటి పేజీ తరువాయి)

కాజియా స్వస్థలం కేరళ అయినప్పటికీ ఆమె బాల్యం ఎక్కువగా యూఏఈలోని అబుదాబిలో గడిచింది. ఎమిరేట్స్ నేషనల్ స్కూల్, సెయింట్ జోసెఫ్ స్కూల్, అబుదాబి ఇండియన్ స్కూల్‌లో ఆమె విద్యాభ్యాసం సాగింది. పేజెంట్రీతో పాటు కాజియాకు కళలపై కూడా ఆసక్తి ఉంది. 12 ఏళ్ల పాటు శాస్త్రీయ నృత్యంలో శిక్షణ పొందారు. గాయని, సంగీత కళాకారిణిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. డ్రమ్స్, వయోలిన్ వాయించగలరు. పబ్లిక్ స్పీకింగ్, నటనలోనూ అనుభవం ఉంది. మలయాళ చిత్రం 'షైలాక్' ద్వారా నటిగా కూడా అరంగేట్రం చేశారు. కేరళకు చెందిన కాజియా ప్రస్తుతం లా చదువుతూనే మోడలింగ్‌లో రాణిస్తున్నారు. చిన్న వయసులోనే అందాల పోటీల్లో తన సత్తా చాటుతున్నారు. 17 ఏళ్ల వయసులో మిస్ టీన్ దివా 2024 టైటిల్‌ను గెలుచుకున్నారు. అనంతరం 2025 మిస్ టీన్ ఇంటర్నేషనల్ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి ఫస్ట్ రన్నరప్‌గా నిలిచారు. ఈ ఏడాది జరిగిన మిస్ యూనివర్స్ కేరళ 2026 పోటీల్లో విజేతగా నిలిచి.. ఆ టైటిల్‌ను గెలిచిన అత్యంత పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించారు. ఇప్పుడు ఏకంగా మిస్ యూనివర్స్ ఇండియా కిరీటాన్ని దక్కించుకోవడం విశేషం.

**జైపూర్‌లో హోరాహోరీ పోటీ..**

మిస్ యూనివర్స్ ఇండియా 2026 గ్రాండ్ ఫినాలేలో 52 మంది ఫైనలిస్టులు పోటీ పడగా.. కజియా లిజ్ మేజో విజేతగా నిలిచారు. తమిళనాడుకు చెందిన వైష్ణవి గణేష్ ఫస్ట్ రన్నరప్‌గా నిలవగా, గుజరాత్‌కు చెందిన అనుశ్రీ సాతవ్లేకర్ సెకండ్ రన్నరప్‌గా ఎంపికయ్యారు. అంతేకాకుండా అనుశ్రీకి మిస్ ఇంటర్నేషనల్ ఇండియా 2026 టైటిల్ కూడా దక్కింది. ఈ ఫినాలేకు మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్‌తో పాటు మాజీ మిస్ యూనివర్స్ ఇండియా విజేతలు ఊర్వశి రౌతేలా, సెలీనా జైట్లీ తదితరులు జడ్జీలుగా వ్యవహరించారు.

# 'ఫీజు బకాయి–బీజేపీ లడాయి'

(మొదటి పేజీ తరువాయి)

ఫీజు బకాయిల కోసం విద్యార్థులు కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేస్తే.. వారిపై పోలీసులు దురుసుగా వ్యవహరించడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీజు రీయింబర్స్‌మెంట్ ఒక్కటే కాదు.. తెలంగాణలో యావత్ విద్యా వ్యవస్థ భ్రష్టుపట్టిపోయిందని విమర్శించారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే విద్యాశాఖను నిర్వహిస్తున్నారు.. అయినా విద్యా వ్యవస్థను గాలికొదిలేశారని ఆరోపించారు. ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లి రూ.1,000 కోట్లు ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు.. కానీ ఇప్పటివరకు రూ.1,000 కూడా ఇవ్వలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలు పెడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం మరో రూ.4 వేల కోట్లు పెంచి మొత్తం బకాయిలను రూ.12 వేల కోట్లకు చేర్చిందని తెలిపారు. దాదాపు 20 లక్షల మంది విద్యార్థులకు రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని.. దీనికి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వమే వహించాలని డిమాండ్ చేశారు.
ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కాలేజీలు అధ్యాపకులకు జీతాలు ఇవ్వలేకపోతున్నాయని.. విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ తెలిపారు. "యూత్ డిక్లరేషన్ పేరుతో అనేక హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. హైకోర్టు మొట్టికాయలు వేయడంతో వచ్చే సంవత్సరానికి అడ్వాన్స్‌గా రూ.2 వేల కోట్లు విడుదల చేస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కారు.. ఆ హామీని కూడా నిలబెట్టుకోలేదు. పాలిటెక్నిక్ విద్యార్థులు తమ సమస్యల కోసం పోరాడితే వారిపై లాఠీచార్జ్ చేయించి, పోలీసులతో దురుసుగా వ్యవహరింపజేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఆయుష్, హోమియోపతి విద్యార్థులు స్టైఫండ్ల కోసం ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వారి నిరసనలో నేను స్వయంగా పాల్గొన్నాను. రాహుల్ గాంధీ దేశమంతా తిరుగుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో విద్యార్థులను రెచ్చగొడుతున్నారు. దమ్ముంటే తెలంగాణకు వచ్చి.. ఇక్కడి విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సమాధానం చెప్పాలి. తెలంగాణ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎందుకు ఇవ్వడం లేదు? స్కాలర్‌షిప్‌లు ఎందుకు అందడం లేదు? రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై మా పోరాటం ఆగదు. ఫీజుల బకాయి.. బీజేపీ లడాయి!" అంటూ వ్యాఖ్యానించారు.

# కాస్త ఆలస్యమైనా నదుల అనుసంధానం చేస్తాం

నూజివీడు, ఆగస్ట్ 24, అనంత జనశక్తి న్యూస్

**నూజివీడు నియోజకవర్గంలోని ముసునూరులో నాన్-జీఎంఓ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాన్ని ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించారు. 'నేను తెలుగు అర్థం చేసుకోగలను, కానీ మాట్లాడలేను. రెండు నెలల క్రితం తమిళ పత్రికలో గౌర్మెట్ సంస్థ ఎండీ పట్టాభి సక్సెస్ స్టోరీని చదివాను. ఒకే ఒక ఉత్పత్తిని ప్రపంచంలోనే గుర్తింపు తీసుకురావడంపై ఆయనను అభినందిస్తున్నాను. జనవరి 14న దేశమంతా కలిసి పంటల పండుగను జరుపుకుంటాం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో సంక్రాంతిగా, తమిళనాడులో పొంగల్, పంజాబ్‌లో లోహిరి, అసోంలో బిహుగా జరుపుకుంటారు' అని చెప్పుకొచ్చారు.**
**రైతులకు వివిధ పథకాలను అమలుచేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఉపరాష్ట్రపతి అభినందించారు. డ్రోన్లను రైతులకు అద్దెకు ఇచ్చే పథకానికి కేంద్రం రూ.1200 కోట్లను మహిళా సంఘాలకు కేటాయించిందన్నారు. పాప్ కార్న్ మొక్కజొన్నను అమెరికా నుంచి దిగుమతి చేసుకోవడం మానేసి, మనమే ఆ దేశానికి ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎనిమిది రాష్ట్రాల్లో 17,500 మంది రైతులు 40 వేల ఎకరాల్లో పాప్ కార్న్ మొక్కజొన్నను పండించడం మామూలు విషయం కాదన్నారు. ఈ ఏడాది దేవుని కృపతో అవసరమైన వర్షా లు కురుస్తాయని.. దాని గురించి ఆందోళన వద్దని చెప్పారు. మహానది నుంచి కావేరి నది వరకు నదుల అనుసంధానం కలగా మిగలదని.. కొంత ఆలస్యం కావచ్చుగానీ, వాస్తవ రూపం దాల్చుతుందని ఉపరాష్ట్రపతి స్పష్టం చేశారు. మన ఆహార అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సిన అవసరం లేదన్నారు. ఆహార అవసరాలను తీర్చడానికి రైతులకు అవసరమైన సహాయ సహకారాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నాయని ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ పేర్కొన్నారు.**

# యువతకు హామీ నెరవేరుస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)



యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, ప్రభుత్వ వ్యవస్థలను మరింత బలోపేతం చేయడమే జాబ్ క్యాలెండర్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్ ఒక నమ్మకాన్ని కల్పిస్తుందని పవన్ కల్యాణ్ అన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను గుర్తించి, వాటి భర్తీ ప్రక్రియను ముందస్తు ప్రణాళికతో కొనసాగించడం ద్వారా ఉద్యోగార్థులకు స్పష్టత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.
గతంలో ఉద్యోగ నియామకాల కోసం ఎదురుచూసే అభ్యర్థులకు పరీక్షలు, నోటిఫికేషన్లపై స్పష్టత లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురయ్యేవని అన్నారు. ఇకపై ఉద్యోగ నియామకాల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. జాబ్ క్యాలెండర్ ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల్లో అవసరమైన పోస్టుల భర్తీకి సంబంధించి ముందుగానే సమాచారం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.
ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సంవత్సరాలుగా కష్టపడుతున్న యువతకు ఈ జాబ్ క్యాలెండర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పవన్ కల్యాణ్ అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు ముందస్తు ప్రణాళికతో తమ సన్నద్ధతను కొనసాగించేందుకు ఇది దోహదపడుతుందని చెప్పారు.
యువతలో నైపుణ్యాలను పెంచడంతో పాటు, వారికి ఉపాధి అవకాశాలను విస్తరించడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో సిబ్బంది కొరతను
అధిగమించడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. జాబ్ క్యాలెండర్‌లోని పోస్టులను ప్రతిభ ఆధారంగా, పారదర్శక విధానంలో భర్తీ చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగార్థులందరికీ ముందస్తుగానే హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కష్టపడి చదివి, పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని యువతకు పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

**అంతర్జాతీయ వేదికపై ఏపీ సత్తా.. పవన్ కల్యాణ్ హర్షం**

విశాఖపట్నం అంతర్జాతీయ వేదికపై తన ప్రత్యేకతను చాటుకుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. విశాఖలో బ్రిక్స్ యువజన, క్రీడా మంత్రుల సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించడం ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశానికే గర్వకారణమన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ దేశాలతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటూ, యువతకు నైపుణ్యాలు, ఆవిష్కరణలు,
ఔత్సాహికత, క్రీడల రంగాల్లో కొత్త అవకాశాలను కల్పిస్తోందని పవన్ కల్యాణ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రధాన అంతర్జాతీయ కార్యక్రమాలకు వేదికగా ఎదుగుతోందన్నారు. విశాఖలో జరిగిన బ్రిక్స్ సమావేశం ద్వారా యువజన అభివృద్ధి, క్రీడా సాంకేతికత, మౌలిక వసతులు, స్పోర్ట్స్ టూరిజం రంగాల్లో అంతర్జాతీయ సహకారం మరింత బలోపేతం కానుందని పేర్కొన్నారు.

**ప్రపంచస్థాయి యువతకు దిశానిర్దేశం.....**

నైపుణ్యం, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకతతో ప్రపంచ స్థాయిలో పోటీపడే యువతను తీర్చిదిద్దాలన్న భారత దేశ లక్ష్యానికి ఆంధ్రప్రదేశ్ బలమైన భాగస్వామిగా నిలుస్తోందని పవన్ కల్యాణ్ అన్నారు. విశాఖపట్నం నుంచి ప్రపంచ వేదిక వరకు ఆంధ్రప్రదేశ్ తన సామర్థ్యాన్ని చాటుకుంటోందని పేర్కొన్నారు.

**యువకుల గల్లంతుపై పవన్ కల్యాణ్ ఆందోళన**

కాకినాడలోని గుర్రాల బీచ్ వద్ద అలల ఉధృతి కారణంగా ఇద్దరు యువకుల గల్లంతుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. యువకుల గల్లంతుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పవన్ స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి జిల్లా ఎస్పీ నుంచి వివరాలు తెలుసుకున్నారు. గల్లంతైన యువకుల ఆచూకీ కోసం చేపడుతున్న గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. గజ ఈతగాళ్లు, ప్రత్యేక రెస్క్యూ బృందాలు, మెరైన్ పోలీసు, కోస్టు గార్డుతో పాటు స్థానిక మత్స్యకార సమూహాల సహకారాన్ని కూడా తీసుకోవాలని సూచించారు. వారి కుటుంబాలకు అందుబాటులో ఉంటూ, ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని స్థానిక శాసనసభ్యులు పంతం నానాజీకి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.
ఆదివారం) నలుగురు స్నేహితులు వీరబాబు, శ్రీగణేష్‌సాయిరాం, యువ కిశోర్, ఆదిత్య వెంకట సందీప్‌కుమార్ కలిసి కాకినాడాలోని గుర్రాల బీచ్‌కు వెళ్లారు. ఎవరూ లేని ప్రదేశంలో నలుగురు కలిసి సముద్రంలో స్నానానికి వెళ్లగా అలల ఉధృతికి యువ కిశోర్, వీరబాబు గల్లంతయ్యారు.
మరో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రస్తుతం వీరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గల్లంతైన ఇద్దరికి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# బంగ్లాదేశ్‌లో హిందూ కుటుంబం హత్య

- **ఆ రాత్రి వారి ఇంట్లోనే స్నానం**
- **భోజనం చేసి వెళ్లిపోయిన నిందితులు**
- **మృతుడు రిటైర్డ్ టీచర్ గణపతి చక్రవర్తి**
- **నలుగురిని దారుణంగా హత్య చేసిన ఉదంతం**

ఢాకా, ఆగస్ట్ 24, అనంతజనశక్తి న్యూస్
బంగ్లాదేశ్‌లో ఇటీవల చోటుచేసుకున్న హిందూ కుటుంబం దారుణ హత్య ఉదంతంలో విచారణ జరుపుతున్న పోలీసులు.. విస్తుపోయే విషయాలను వెల్లడించారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు గణపతి చక్రవర్తితో పాటు ఆయన కుటుంబ సభ్యులను అత్యంత కఠినంగా మట్టుబెట్టిన హంతకులు.. ఆ రాక్షస కృత్యం ముగిసిన అనంతరం ఏమాత్రం భయం లేకుండా ఆ రాత్రంతా మృతుల ఇంట్లోనే గడిపినట్లు దర్యాప్తులో తేలింది. ముఖ్యంగా అక్కడే స్నానం చేసి.. భోజనం కూడా చేసినట్లు పోలీసులు చెప్పారు.

**డ్రగ్స్ వద్దని చెప్పడం వల్లే దారుణం..!**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గణపతి చక్రవర్తి ఇంటికి ఆనుకుని నివాసముంటున్న 19 ఏళ్ల సిద్ధార్థ దాస్, 23 ఏళ్ల ముగ్ధ దాస్ అనే ఇద్దరు యువకులు గురువారం రాత్రి తమ ఇంటి మేడపై నుంచి చక్రవర్తి ఇంటి పైఅంతస్తు మీదికి చేరుకున్నారు. అక్కడే వారు డ్రగ్స్ సేవిస్తుండగా.. మేడపై నుంచి వస్తున్న శబ్దాలను విని గణపతి చక్రవర్తి పైకి వెళ్లారు. వారి ఆగడాలను గమనించి, డ్రగ్స్ సేవించడాన్ని తీవ్రంగా మందలించారు. తమ వ్యసనం, అక్రమ వ్యవహారం ఎక్కడ బయటపడుతుందోనన్న తీవ్ర భయాందోళనకు గురైన ఆ యువకులు.. చక్రవర్తిపై దాడికి దిగారు. ఆయన మెడకు తువ్వాలు గట్టిగా బిగించి ఊపిరాడకుండా చేసి ప్రాణాలు తీశారు.

అదే ఇంట్లో స్నానం.. ఫ్రిజ్‌లోని తిండి కూడా తిని!
చక్రవర్తి అరుస్తున్న కేకలు విని ఆయన భార్య వెంటనే మేడపైకి పరుగులు తీసింది. అక్కడ ఆమెను చూసిన నిందితులు.. ఎవరికైనా విషయం చెప్పేస్తుందేమోనని భావించి చంపేశారు. అనంతరం ఎలాంటి ఆధారాలు దొరకకుండా ఉండేందుకు.. విషయాన్ని ఎవరికీ చెప్పకుండా ఉండేందుకు ఇంట్లోనే ఉన్న ఇద్దరు అమాయక పిల్లలను కూడా చంపేశారు. ఈ నలుగురి దారుణ హత్యల అనంతరం నిందితులు ప్రదర్శించిన ప్రవర్తన తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. నలుగురిని దారుణంగా చంపిన తర్వాత కూడా వారు అక్కడి నుంచి వెంటనే పారిపోకుండా.. ఆ రాత్రంతా అదే ఇంట్లో ఉండిపోయారు. రక్తపు మరకలను కడుక్కునేందుకు అక్కడే ప్రశాంతంగా స్నానం చేశారు. అంతేకాకుండా మృతుల ఇంట్లోని ఫ్రిజ్‌లో ఉన్న ఆహారాన్ని బయటకు తీసి కడుపునిండా తిన్నారు.

**సీసీటీవీ ద్వారా వెల్లడైన నిజాలు..!**

తెల్లవారేలోపు అక్కడి నుంచి వెళ్లిపోవాలనుకున్న నిందితులు.. ఇది దొంగలు చేసిన పనిగా మలచాలనుకున్నారు. అందుకోసం ఇంట్లోని బీరువాల తలుపులు తెరిచి, దుస్తులను, ఇతర సామగ్రిని గది అంతటా చిందరవందరగా పడేశారు. ఆపై ఇంట్లోని విలువైన బంగారు ఆభరణాలను దోచుకున్నారు. పోలీసుల విచారణకు ఆటంకం కలిగించేందుకు మృతులకు చెందిన
రెండు మొబైల్ ఫోన్లను సమీపంలోని నీటిలో పడేశారు. అయితే సమీపంలో అమర్చిన సీసీటీవీ కెమెరా దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు నిందితులను కచ్చితంగా గుర్తించారు. త్వరితగతిన రెస్క్యూ ప్రక్రియ చేపట్టి సిద్ధార్థ దాస్, ముగ్ధ దాస్‌లను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి దోచుకెళ్లిన బంగారు నగలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి తదుపరి విచారణ జరుపుతున్నారు.

# ఢిల్లీని ముంచెత్తిన వాన జనజీవనం అస్తవ్యస్తం

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో 12 విమానాలను జైపూర్, రెండింటిని ఛండీగఢ్, మరో విమానాన్ని లక్నోకు తరలించారు. ఏవియేషన్ డేటా ప్రకారం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో విమానాల రాకపోకల్లో సగటున 32 నిమిషాల జాప్యం జరుగుతుండగా, సుమారు 262 విమాన సర్వీసులపై ఈ ప్రభావం పడింది. వర్షాల ధాటికి దేశ రాజధాని పరిధిలో ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి.
గుర్గావ్‌లోని సోహ్నా రోడ్ ఇస్లాంపూర్ వద్ద సర్వీస్ లేన్‌లో దాదాపు రెండు అడుగుల మేర నీరు చేరడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఢిల్లీలోని సంగమ్ విహార్, ఎంబీ రోడ్ పరిసరాల్లో వాహనాలు గంటల తరబడి చిక్కుకుపోవడంతో ఆఫీసులకు, ఎయిర్‌పోర్ట్‌కు అలాగే సాకేత్ కోర్టుకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఘాజియాబాద్‌లోని NH9 ఇండస్ట్రియల్ ఏరియా అండర్‌పాస్ వద్ద నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ప్రయాణాలను ఆపి రోడ్డు పక్కనే వేచి చూడాల్సి వచ్చింది. అయితే, ఉక్కపోతతో అల్లాడుతున్న ఢిల్లీ ప్రజలకు ఈ వర్షాలు కాస్త ఉపశమనాన్ని ఇచ్చాయి. ఇండియా గేట్, నోయిడా సెక్షన్లలో కురిసిన వర్షాలకు సంబంధించిన దృశ్యాలు ఆహ్లాదకరంగా మారాయి. రాబోయే రోజుల్లో ఢిల్లీఎన్‌సీఆర్ వ్యాప్తంగా మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) హెచ్చరించింది. ముఖ్యంగా ఫరీదాబాద్, గుర్గావ్‌లకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేస్తూ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఉత్త



రాఖండ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

# వ్యవసాయాన్ని ఆర్థిక శక్తిగా మార్చాలి!

(మొదటి పేజీ తరువాయి)

'ప్రస్తుతం ఉత్పత్తి అవుతున్న ఆహార ఉత్పత్తుల్లో కేవలం 10 శాతం మాత్రమే ప్రాసెసింగ్ లేదా ఎగుమతి స్థాయికి వెళ్తున్నాయి. ఈ వాటాను 50 శాతానికి పెంచగలిగితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మరింత బలం చేకూరుతుంది. రైతులు ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోకి వచ్చి వ్యవసాయాన్ని పరిశ్రమలతో అనుసంధానం చేసుకోవాలి. మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల నమూనాలోనూ మార్పులు రావాల్సిన అవసరం ఉంది. బియ్యం వినియోగం తగ్గుతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. రైతులు సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకుని కొత్త పంటలను ఎంచుకోవాలని ప్రభుత్వం మార్గనిర్దేశం చేస్తోంది' అని సీఎం తెలిపారు.
నీటి వనరుల అభివృద్ధిపై కూడా సీఎం చంద్రబాబు పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తయితే నూజివీడు ప్రాంతానికి మరింత ప్రయోజనం కలుగుతుంది. ఈ ప్రాజెక్టును రెండు, మూడు ఏళ్లలో పూర్తి చేసే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది. వెలిగొండ ప్రాజెక్టు తొలి దశను ఈ నెల 31న ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పోలవరం ఎడమ కాల్వ నుంచి సుజల స్రవంతి ద్వారా ఈ నెలలోనే అనకాపల్లికి నీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నాము. ఈసారి ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం 50 శాతానికి పైగా తగ్గింది. ఇది రైతులకు పెద్ద సవాలుగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది' అని సీఎం చంద్రబాబు సూచించారు.
సెప్టెంబర్‌లో రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేసే ప్రణాళికను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని సీఎం చంద్రబాబు తెలిపారు. అలాగే ఐదు నదులను అనుసంధానం చేసే అవకాశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ నదుల అనుసంధానం సాకారం అయితే నాలుగు రాష్ట్రాల్లో నీటి సమస్యలకు పరిష్కారం చూపే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని
ఆధునిక సాంకేతికత, ఫుడ్ ప్రాసెసింగ్, నీటి వనరులు, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం చేసి రైతుల ఆదాయాన్ని పెంచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు తెలిపారు. రైతులు కొత్త ఆలోచనలతో ముందుకు వస్తే.. రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి మరింత ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు.

# మతం మారాలని సాధిక్ ఒత్తిడి చేశాడు

- **ఏఈ నూకరాజు కుటుంబం సూసైడ్ కేసు**
- **సాధిక్ ఖాన్ వేధింపులతోనే ఆత్మహత్యలు**

కాకినాడ, ఆగస్ట్ 24, అనంతజనశక్తి న్యూస్

కాకినాడ జిల్లాలో తీవ్ర సంచలనం సృష్టించిన ఏఈ నూకరాజు కుటుంబం సామూహిక ఆత్మహత్య కేసు విచారణలో కీలక పురోగతి లభించింది. ఈ దారుణ ఘటనకు కారణమైన ప్రధాన నిందితుడు, రైఫిల్ షూటింగ్ కోచ్ సాధిక్ ఖాన్‌ను పోలీసులు ఉత్తరప్రదేశ్‌లో అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ బిందుమాధవ్ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ విషాద ఘటనలో ఏఈ నూకరాజు, ఆయన భార్య మీనా, కుమార్తె సౌజన్య, మనవడు రియాన్స్ రెడ్డి గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్యకు యత్నించారు. ఈ ఘటనలో చిన్నారి రియాన్స్ రెడ్డి ప్రాణాలతో సురక్షితంగా బయటపడగా, నూకరాజు, మీనా, సౌజన్య నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. మొదట ఈ ఘటనపై రాజమహేంద్రవరంలో కేసు నమోదవ్వగా, ఘటన వెనక ఉన్న అసలు కారణాలు విచారణలో బయటపడ్డాయి. పోలీసులు జరిపిన తనిఖీల్లో రెండు వేర్వేరు సూసైడ్ నోట్‌లు లభించాయి. ఒక లేఖ నూకరాజు వద్ద లభించగా, మరొకటి ఆయన కుమార్తె సౌజన్యకు చెందిన స్కూటీలో దొరికింది. సాధిక్ ఖాన్ తమను తీవ్రంగా మానసిక, శారీరక వేధింపులకు గురిచేశాడని, ఆస్తిపై కన్నువేసి బ్లాక్‌మెయిల్ చేశాడని లేఖల్లో పేర్కొన్నారు. అంతేకాకుండా, సౌజన్యపై బలవంతంగా మతం మారాలని సాధిక్ తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు లేఖల ద్వారా స్పష్టమైంది. బాధితురాలు సౌజన్య మామ భాస్కర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సర్పవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని ఎస్పీ తెలిపారు. సామూహిక ఆత్మహత్యల అనంతరం నిందితుడు సాధిక్ ఖాన్ పరారయ్యాడు. అతడి కోసం కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల పోలీసులతో కూడిన 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఐదు రాష్ట్రాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. చివరికి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మేరఠ్‌లో సాధిక్ ఆచూకీ కనుగొన్నారు. అక్కడ తన స్నేహితులకు తన ఫోన్, డబ్బు పోయాయని మాయమాటలు చెప్పి తలదాచుకున్నట్లు ఎస్పీ తెలిపారు. మేరఠ్ స్థానిక కోర్టులో హాజరుపరిచి, ట్రాన్సిట్ వారెంట్‌పై అతడిని కాకినాడకు తీసుకువచ్చారు. సాధిక్ ఖాన్‌పై హత్య, బలవంతపు మతమార్పిడి, ఆత్మహత్యకు ప్రేరేపించిన తీవ్రమైన చట్టపరమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని ఎస్పీ వెల్లడించారు. నిందితుడిని స్థానిక న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి, తదుపరి విచారణ నిమిత్తం పోలీస్ కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరనున్నారు.
కస్టడీలో విచారిస్తే వేధింపులకు సంబంధించిన మరిన్ని నిజాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. ఇలాంటి ఇబ్బందికర పరిస్థితులు, బెదిరింపులు ఎదురైనప్పుడు క్షణికావేశంలో తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దని, ధైర్యంగా పోలీసులను ఆశ్రయిస్తే తగిన రక్షణ కల్పిస్తామని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# షేర్ చేస్తే చర్యలు తప్పవు ఆ ఎన్నికల షెడ్యూల్ అబద్ధం

(మొదటి పేజీ తరువాయి)

**మరోవైపు సోషల్ మీడియాలో కొంతమంది షేర్ చేస్తున్నది ఫేక్ ఎన్నికల షెడ్యూల్‌గా పేర్కొన్న ఏపీ ఎన్నికల కమిషనర్.. అందులో ఎలాంటి వాస్తవం లేదని క్లారిటీ ఇచ్చారు. వాట్సప్ వంటి సోషల్ మీడియాలో వచ్చే ఎన్నికల తేదీలను నమ్మొద్దని.. అలాంటి వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేయొద్దని సూచించారు. అలా కాకుండా ఎవరైనా ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఏపీ ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా హెచ్చరించారు. ఫేక్ ఎన్నికల షెడ్యూల్‌ను షేర్ చేస్తే.. అలాంటి వారిపై సైబర్ చట్టాల కింద కేసులు నమోదు చేస్తామని వార్నింగ్ ఇచ్చారు.**



**ఇక స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి.. ఎలాంటి సమాచారం అయినా పత్రికా ప్రకటన రూపంలో లేదా.. మీడియా సమావేశం ద్వారానే వెల్లడిస్తామని అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక ప్రకటన కాకుండా.. అనధికారిక సమాచారాన్ని నమ్మవద్దని కోరారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం కసరత్తు ప్రారంభించిన సంగతి తెలిసిందే. బీసీ రిజర్వేషన్ల అమలు కోసం కమిషన్ నుంచి అందిన నివేదికను పరిశీలించి..స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఏపీ అసెంబ్లీ చట్టం కూడా చేసింది. ఈ క్రమంలోనే ఏపీలో స్థానిక ఎన్నికల షెడ్యూల్ అంటూ నెట్టింట వార్తలు వైరల్ అవుతున్నాయి. దీనిపై ఏపీ ఎన్నికల సంఘం క్లారిటీ ఇచ్చింది.**

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం


# పార్లమెంటు శాసనం కంటే కాంగ్రెస్ తీర్మానం గొప్పదా?



వందేమాతరం విషయంలో కాంగ్రెస్ వైఖరి.. సింహం తోలు కప్పుకొన్న నక్కలా ఉందని భాజపా ధ్వజమెత్తింది. ఇలా చేసినా నక్క ఎప్పటికీ సింహం కాలేదని ఎద్దేవాచేసింది. బుజ్జగింపు రాజకీయాలను ఎల్లకాలం దాయలేరని, ఏదో ఒకనాడు ముసుగు తొలగిపోయి స్వార్థం బట్టబయలవుతుందని కాంగ్రెస్‌ను ఉద్దేశించి ఘాటుగా వ్యాఖ్యానించింది. వందేమాతరంలో రెండు చరణాలు మాత్రమే పాడాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) తీర్మానించడాన్ని ఖండించింది. 1930వ దశకంనాటి బుజ్జగింపు రాజకీయ విధానాన్నే కాంగ్రెస్ ఎంచుకుందని విమర్శించింది. భాజపా నూతన పదాధికారుల తొలి సమావేశాన్ని శనివారం దిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. అధ్యక్షుడు నితిన్ నబీన్ దీనికి అధ్యక్షత వహించారు. 10 అంశాలతో ఈ సమావేశం ఒక తీర్మానం చేసింది. యువతకు ప్రాధాన్యమిచ్చి, వారితో నిరంతరం మాట్లాడుతుండాలని అధ్యక్షుడు నొక్కి చెప్పారు.

**..అప్పటి నుంచీ సమాన హోదా**

''స్వాతంత్య్ర సంగ్రామంలో చారిత్రక పాత్ర పోషించిన వందేమాతరానికి జనగణమనతో సమాన గౌరవం, హోదా కల్పిస్తున్నట్లు తొలి రాష్ట్రపతి, రాజ్యాంగ సభ అధ్యక్షుడు డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ 1950లోనే వెల్లడించారు. అధికారిక రాజకీయ ప్రొటోకాల్‌లో జాతీయ గీతంగా జనగణమన స్థిరపడగా, దాంతో సమానమైన గౌరవంతో జాతి చైతన్య గేయంగా వందేమాతరం ప్రతిష్ఠితమైంది. స్వాతంత్ర్యానంతరం వందేమాతరంలోని మొదటి రెండు చరణాలే బహిరంగ గానానికి పరిమితం కావడంతో అదే సంప్రదాయంగా మారింది. మిగిలిన నాలుగు చరణాలు కొత్త తరాలకు అపరిచితంగా మిగిలిపోయాయి. మోదీ ప్రభుత్వ కృషితో జనగణమనతో సమానమైన చట్టరక్షణ వందేమాతరానికీ ఇప్పుడు లభించింది. సంపూర్ణ వందేమాతరం దేశ గౌరవప్రతిష్ఠలు, వారసత్వానికి సంబంధించిన విషయం. దాని పూర్ణ స్వరూపాన్ని భాజపా కాపాడుతుంది. 1950నాటి రాజ్యాంగ సభ ప్రకటన, పార్లమెంటులో ప్రస్తుతం చేసిన చట్టం కంటే 1937లో కాంగ్రెస్ చేసిన రాజకీయ తీర్మానం గొప్పదేమీ కాదు. వందేమాతరం గీతాన్ని రెండు చరణాలకు పరిమితం చేయడం వెనక చారిత్రక, రాజకీయ నేపథ్యాన్ని ప్రజల ముందుంచుతాం. వందేమాతర గీతం సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదమని, స్వచ్ఛమైన జాతీయ భావన అని మహాత్మాగాంధీ అభివర్ణించారు. ఆ విషయాన్ని ప్రజలందరికీ చెబుతాం. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన వందేమాతర గీతాన్ని అణచివేయడానికి తీవ్రంగా జరిగిన ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టారు. వారసత్వ వైభవాన్ని ఓటుబ్యాంకు రాజకీయ గణాంకాల స్థాయికి దిగజార్చకూడదు'' అని తీర్మానంలో భాజపా పేర్కొంది. రాష్ట్ర శాఖల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో నబీన్ విడిగా సమావేశమై సమాలోచనలు జరిపారు.

**కొత్త జట్టుతో మోదీ...**

నూతన కార్యవర్గంతో ప్రధాని మోదీ శనివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో భేటీ అయ్యారు. పార్టీని బలోపేతం చేసే ఆలోచనలు పంచుకోవడం, ప్రజలతో మరింతగా సంబంధాల విషయంలో ఇలాంటివి ఉపయోగపడతాయని 'ఎక్స్'లో ఆయన పేర్కొన్నారు. కొత్త జట్టును కలవడం మంచి అనుభూతి అని అన్నారు.

**ప్రభుత్వాధినేతగా పాతికేళ్లు.. నెలరోజుల సేవా కార్యక్రమాలు**

ప్రభుత్వాధినేతగా అక్టోబరు 17కి మోదీ 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నెలరోజులపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని భాజపా నిర్ణయించింది. సెప్టెంబరు 17న (ఆయన పుట్టినరోజునాడు) ఇవి మొదలవుతాయి. యువత, రైతులు, మహిళలు సహా సమాజంలో అన్నివర్గాలవారిని కలిసేందుకు పార్టీ వివిధ కార్యక్రమాలు చేపట్టనుంది. దీనిపై పార్టీ కార్యాలయంలో విడిగా జాతీయస్థాయి వర్క్‌షాపు నిర్వహించింది. త్వరలో రాష్ట్రస్థాయిలోనూ ఇలాంటివి జరగనున్నాయి.

# ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగిలించడానికి కారులో వెళ్తే..



పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలించడానికి ముగ్గురు దొంగలు వేసిన ప్లాన్ బెడిసికొట్టింది. చోరీకి వెళ్తుండగా.. వారి కారు బురదలో చిక్కుకుపోవడంతో ఎరక్కపోయి ఇరుక్కుపోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ ఘటన పంజాబ్ లోని మోగా జిల్లాలో చోటుచేసుకుంది. తఖ్తుపుర గ్రామంలోని ఓ పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలించడానికి శనివారం రాత్రి ముగ్గురు దొంగలు కారులో వెళ్లారు. పొలాల మధ్యలో నుంచి ప్రయాణిస్తుండగా వారి కారు అదుపుతప్పి.. పొలంలో దిగబడింది. దానిని బయటకు తీయడానికి ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాకపోవడంతో కారును అక్కడే వదిలేసి వెళ్లిపోయారు.

మర్నాడు ఉదయం కారును బయటకు తీయడానికి దొంగలు ఓ ట్రక్కును తీసుకొచ్చారు. అదికూడా బురదలో కూరుకుపోవడంతో ఏం చేయాలో తెలియక దొంగలు తెల్లమొహం వేశారు. ఈ తతంగమంతా అనుమానాస్పదంగా ఉండడంతో స్థానికులు ప్రశ్నించారు. దానికి వారు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో.. గట్టిగా నిలదీయగా చోరీ ప్లాన్ బయటపడింది. దీంతో దొంగలు పారిపోయేందుకు ప్రయత్నించగా.. వారిలో ఒకరిని గ్రామస్థులు పట్టుకున్నారు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని నిందితుడిని అరెస్ట్ చేసి, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మిగతా ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల జిల్లాలోని పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పరికరాలు చోరీకి గురయ్యాయి. వాటి వెనుక ఈ గ్యాంగ్ హస్తం ఉందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# 10 రోజులైనా లోక్‌సభను ఎందుకు ప్రోరోగ్ చేయలేదు: కాంగ్రెస్



లోక్‌సభ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడి 10 రోజులు గడిచినప్పటికీ.. ఇప్పటికీ సభను ప్రోరోగ్ చేయకపోవడాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పుబట్టింది. డీలిమిటేషన్ బిల్లును తీసుకొచ్చేందుకు కేంద్రం ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలన్న ఆలోచనలో ఉందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. అందుకోసం కేంద్రమంత్రి అమిత్‌షా 2/3 మెజారిటీ కోసం వెతుకులాటలో ఉన్నారంటూ ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు. 2029 నుంచే మహిళా రిజర్వేషన్లను అమలు చేయడంతో పాటు, లోక్‌సభ స్థానాలను 50 శాతం మేర పెంచే ఉద్దేశంతో తీసుకొచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లులు గత సమావేశాల్లో వీగిపోయిన సంగతి తెలిసిందే. దీంతో పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లులు ప్రవేశపెడతారని భావించారు. కానీ, ప్రభుత్వం ఏ కారణం చేతనో వెనక్కి తగ్గింది. ఇందుకోసం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారన్న అంశం తెరపైకి వచ్చింది.

ఈ నేపథ్యంలో జైరాం రమేశ్ స్పందించారు. ''లోక్‌సభ సమావేశాలు ముగిసిన తర్వాత ప్రోరోగ్ చేయడానికి సాధారణంగా 24 రోజుల వ్యవధి ఉంటుంది. కొన్నిసార్లు రెండూ ఒకేరోజు నిర్వహించిన సందర్భాలూ ఉన్నాయి. కానీ, లోక్‌సభ వాయిదాపడి 10 రోజులు గడుస్తున్నా.. ప్రోరోగ్‌కు సంబంధించిన సమాచారం లేదు. 2015, 2021లో నిరవధిక వాయిదాకు, ప్రోరోగ్‌కు మధ్య కాస్త గ్యాప్ ఉన్నప్పటికీ.. ఆ సమయంలో ఎలాంటి దుష్ట పన్నాగాలూ జరగలేదు. బహుశా ప్రత్యేక సమావేశాలు పెట్టి రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదింపజేసుకోవడానికి హోంమంత్రి అమిత్‌షా 2/3 మెజారిటీ కోసం వెతుకులాడుతున్నట్లు ఉన్నారు'' అంటూ జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

# విద్యార్థినులతో జలకాలాటలు.. ప్రిన్సిపల్ సస్పెన్షన్

రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లాలో 11, 12 తరగతుల విద్యార్థినులను జలాశయంవద్దకు విహార యాత్రకు తీసుకెళ్లి.. వారితో కలిసి జలకాలాడిన ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. సామాజిక మాధ్యమాల్లో ఈ వీడియో వైరల్ కావడంతో ప్రభుత్వ సీనియర్ సెకండరీ స్కూలు ప్రిన్సిపల్ లాల్‌చంద్ మీనాను సస్పెండు చేస్తూ బీకానేర్ డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థినుల ఎదుట దుస్తులు లేకుండా ఈతకు దిగిన ఆయన తీరు ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా ఉన్నట్లు పేర్కొంది. మీనాపై శాఖాపరమైన దర్యాప్తు మొదలైంది. పాఠశాల సమీపంలోని డ్యాం వద్దకు మొత్తం 200 మందికిపైగా విద్యార్థులను ఆగస్టు 15న ప్రిన్సిపల్ తీసుకెళ్లారు.



# ఐవీఎఫ్‌తో 'లఖిమి' దూడ అస్సాంలో జననం



దేశీయ పశు జాతుల పరిరక్షణలో అస్సాం మరో కీలక ముందడుగు వేసింది. పశు సంవర్ధక, బయోటెక్నాలజీ రంగంలో ఒక చరిత్రాత్మక మైలురాయిని నమోదు చేసింది. అస్సాంకు చెందిన ప్రసిద్ధ స్వదేశీ 'లఖిమి' జాతి పెయ్యి దూడ ఐవీఎఫ్ (ఇన్ విట్రో ఫలదీకరణ) పద్ధతిద్వారా జన్మించింది. రాష్ట్రంలో పశు సంపద సంరక్షణ, పాడి పరిశ్రమ అభివృద్ధి దిశగా పరిశోధనలు చేస్తున్న అస్సాం వెటర్నరీ అండ్ ఫిషరీ యూనివర్సిటీ ఈ ఘనత సాధించింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'రాష్ట్రీయ గోకుల మిషన్' ఆర్థిక సహాయంతో యూనివర్సిటీ ప్రయోగశాలలో దీనికి సంబంధించిన ప్రత్యేక ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. స్వచ్ఛమైన లఖిమి జాతి ఆవు పిండం ద్వారా ఈ దూడను ఉత్పత్తి చేశారు.

# అసెంబ్లీల ఎన్నికలపై భాజపా సమాలోచన



వచ్చే ఏడాది ఉత్తర్ ప్రదేశ్, గుజరాత్ సహా ఏడు రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ ఆదివారం కీలక సమావేశం నిర్వహించారు. ఆయా రాష్ట్రాల కార్యవర్గ సభ్యులతో సంస్థాగత విషయాలపై చర్చించారు. జాతీయ కార్యవర్గంలో ఉన్న నేతలు, ఆయా రాష్ట్రశాఖల అధ్యక్షులు, పార్టీ వ్యవహారాల బాధ్యులు, ఇతర ముఖ్య నేతలు దీనిలో పాల్గొన్నారు. ప్రజలతో సత్సంబంధాలు, ముఖ్యంగా యువతతో అనుసంధానం కావడంపై చర్చించారు. సమావేశ వివరాలను పార్టీ అధికారికంగా వెల్లడించలేదు. 2027లో యూపీ, గుజరాత్‌తోపాటు పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, మణిపుర్, గోవాల్లో ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో విజయం సాధించేందుకు ఎలాంటి వ్యూహం అనుసరించాలనేది నబీన్ చర్చించారు.

# ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి.. ఒకరోజు ముందే యూట్యూబ్‌లో వీడియో పెట్టిన తల్లి





మహారాష్ట్ర లోని ఛత్రపతి సంభాజీనగర్ జిల్లాలో ఇటీవల ఐ ఫోన్ వివాదమై ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు ఒకరోజు ముందు యువకుడి తల్లి సంగీత తన యూట్యూబ్ ఛానల్‌లో పెట్టిన వీడియో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మానవ సంబంధాలు, ప్రేమ విలువలను వీడియోలో వివరించారు. మన ప్రేమను విలువైనదిగా భావించే వ్యక్తికే మనస్ఫూర్తిగా ఏదైనా చేయాలని సూచించారు. విలువ ఇవ్వని వ్యక్తి కోసం ఎంత చేసినా ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. రెండు వైపులా కాలితేనే చపాతీ రుచిగా ఉంటుందంటూ కుటుంబ బంధాల ప్రాధాన్యాన్ని వివరించారు. తన యూట్యూబ్ ఛానల్‌లో తరచూ మోటివేషనల్ వీడియోలను పంచుకుంటూ ఉంటారు. ప్రస్తుతం ఆమె ఛానల్‌కు 29వేల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. తన కుమారుడితో కలిసి షార్ట్ వీడియోలను చేస్తుంటారు. ఆరేళ్ల కిందట పెద్ద కుమారుడు అనారోగ్యంతో మరణించిన సమయం నుంచి ఆమె తన భర్తకు దూరంగా ఉంటున్నారు. భర్తకు దూరం కావడానికి, కుటుంబంలో తలెత్తిన మనస్పర్థలకు ఆడపడుచుల ప్రవర్తనే కారణమని తీవ్ర ఆరోపణలు చేశారు.

కునాల్ అనే యువకుడు ఐఫోన్ ఈఎంఐ డబ్బుల కోసం గొడవపడి కొండపై నుంచి దూకగా.. అతన్ని కాపాడే ప్రయత్నంలో తండ్రి మురళీధర్ లోయలో పడిపోయాడు. కళ్లెదుటే భర్త, కుమారుడు మృతి చెందడం తట్టుకోలేక.. సంగీత కూడా అదే కొండపై నుంచి దూకి ప్రాణాలు విడిచిన హృదయ విదారక ఘటన ఇటీవల తీవ్ర కలకలం రేపింది.

# అత్తింటి వారి వేధింపులు.. రక్షణశాఖ అధికారిణి ఆత్మహత్య..



కేంద్ర రక్షణశాఖ కు చెందిన అధికారిణి దిల్లీలోని తమ నివాసంలో ఆత్మహత్య చేసుకున్నారు. రక్షణ శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న నాజియా ఖానమ్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. అత్తింటి వారి వేధింపులు తట్టుకోలేకే తన కుమార్తె మృతిచెందిదని మృతురాలి తండ్రి తవాబ్ ఖాన్ ఆరోపించారు. ఏప్రిల్ 11, 2026న ఆజమ్ అలీ ఖాన్‌తో తమ కుమార్తె నాజియాకు వివాహం జరిపించామని.. పెళ్లి అయిన వారం నుంచే వారు వేధిస్తున్నారని తమకు చెప్పిందని పేర్కొన్నారు. ఆమె భర్తే తమ కుమార్తెను హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. భర్త తనను శారీరకంగా.. మానసికంగా వేధిస్తున్నాడని తమ కుమార్తె పలుమార్లు చెప్పిందని తవాబ్ ఖాన్ పేర్కొన్నారు. అత్తమామలు తరచూ తిడుతున్నారని.. అదనపు కట్నం తేవాలని బలవంతం చేస్తున్నారని చెప్పి బాధ పడిందన్నారు. కొద్ది రోజుల తర్వాత వెళ్లి మాట్లాడదామనుకున్నామని.. ఇంతలోనే ఆమె ప్రాణాలు కోల్పోయిందని తెలిపారు. తమ కుమార్తె మూడు నెలల గర్భవతి అని పేర్కొన్నారు. తమ అల్లుడి తండ్రి మాజీ పోలీసు అధికారి కావడంతో.. దిల్లీ పోలీసులు కూడా ఈ కేసును బయటకు రాకుండా చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. అయితే నాజియానే ఆత్మహత్య చేసుకుందని ఆమె భర్త పోలీసులకు తెలిపాడు. శుక్రవారం తమ మధ్య వాగ్వాదం జరిగిందని.. దీంతో నాజియా మరో గదిలోకి వెళ్లి తలుపేసుకుందని పేర్కొన్నారు. కొద్ది సేపటి తర్వాత వెళ్లి చూడగా.. ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించిందన్నారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# అభయారణ్యంలో.. అరుదైన నీటిబాతు

అస్సాంలోని లావోఖోవా వన్యప్రాణుల అభయారణ్యంలో అరుదైన వలస పక్షి స్మ్యూ డక్ (ఎగిరే నీటిబాతు) తొలిసారిగా కనిపించింది. వన్యప్రాణుల సంరక్షణలో సురక్షితమైన ఈ ప్రాంత చరిత్రలో ఇదో మైలురాయిగా రాష్ట్ర అటవీ, పర్యావరణ మార్పుశాఖల మంత్రి జయంత్ మల్లా బారువా ఆదివారం వెల్లడించారు. కాజీరంగా నీటిపక్షుల ఏడో గణన2026లో భాగంగా ఈ పక్షిని గుర్తించారు. నాగావ్ జిల్లా పరిధిలో బ్రహ్మపుత్ర నది ఒడ్డున ఈ అభయారణ్యం 70.13 చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉంది.





# రైతాంగం భవితకు కొత్త భరోసా

దేశీయ సేద్య రంగం సాంప్రదాయ పంట విధానాల నుంచి ఒక మౌలికమైన మార్పును సంతరించుకుంటోంది. వ్యవసాయ అటవీ విధానం (ఆగ్రోఫారెస్ట్రీ) అనే పదాన్ని వృక్షాధార వ్యవసాయం (ట్రీ బేస్డ్ ఫార్మింగ్)గా మార్చే వ్యూహాత్మక నిర్ణయం దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ఇది కేవలం పేరు మార్పునకే పరిమితం కాదు; పర్యావరణ స్థిరత్వానికీ, గ్రామీణ ఆర్థిక భద్రతకూ మధ్య ఒక బలమైన వారధిని నిర్మించగలదు.

భారత్ 'ఆగ్రోఫారెస్ట్రీ' పేరును ఎందుకు మార్చాల్సి వస్తుందన్నది అర్థం చేసుకోవాలంటే- ముందుగా 2014 నాటి ఈ విధానం తాలూకా ప్రాతిపదికను పరిశీలించాలి. పర్యావరణ లక్ష్యాలను చేరుకోవడానికి చెట్ల విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచడంతోపాటు కలప, ఇంధన కలప, పశుగ్రాసాలకు ఉన్న గిరాకీ-సరఫరా మధ్య అంతరాన్ని పూడ్చడం ఆగ్రోఫారెస్ట్రీ ప్రధాన లక్ష్యం. అందుకని వేర్వేరు శాఖల పరిధిలో చెల్లాచెదురుగా ఉన్న కార్యక్రమాలను ఒక్క తాటిపైకి తీసుకురావడానికి ఈ విధానం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. ముఖ్యంగా వ్యవసాయం, పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల శాఖలను అనుసంధానించింది. పొలాల్లో పెరిగే చెట్ల నరికివేత, రవాణా నిబంధనలను సరళతరం చేయడం 2014 నాటి విధానంలో కీలకాంశం. చెట్ల పెంపకం రైతులకు నమ్మకమైన అదనపు ఆదాయ వనరుగా మారుతుందనీ; నాణ్యమైన విత్తనాలు, సాగు పరికరాలు, వ్యవస్థాగత రుణాలు, బీమా సదుపాయం సమకూర్చడం ద్వారా వారికి రక్షణ కల్పించవచ్చని ఆగ్రోఫారెస్ట్రీ విధానం ఆశించింది. కానీ వ్యవసాయ, అటవీ రంగాల మేళవింపు సుదీర్ఘకాలంపాటు సంక్లిష్టమైన నియంత్రణ చట్రాల కిందే ఉండిపోయింది. అటవీ శాఖ చెట్ల నరికివేత, రవాణాపై కఠినమైన నిబంధనలను అమలుచేస్తూ వచ్చింది. ప్రభుత్వ అటవీ భూములను రక్షించడానికీ, కలప అక్రమ రవాణాను నిరోధించడానికీ, మొత్తంగా పర్యావరణ ఆరోగ్యాన్ని పెంపొందించడానికీ ఈ నిబంధనలు అవసరమే. కానీ, ఒక సామాన్య రైతు తన పొలంలోని చెట్లను నరికి, కలపను మార్కెట్‌కు రవాణా చేయడానికి వీటి వల్ల చాలా ఇబ్బందులు ఎదురయ్యేవి. దీంతో ఈ నిబంధనలను రైతులు అభివృద్ధి నిరోధకాలుగా భావించారు.

**పేరు మార్పుతో ఏమవుతుంది?**

ఆగ్రోఫారెస్ట్రీ అనే పదంలో 'అటవీ' అనే పదముంది. ఇది తెలియకుండానే అటవీ సరిహద్దులు, అధికారిక తనిఖీలు, సంక్లిష్టమైన చట్టాలతో ముడిపెడుతుంది. తమ సొంత భూమిలో వాణిజ్యపరమైన చెట్లను పెంచితే, అటవీ అధికారుల నుంచి ఇబ్బందులు ఉంటాయనే ఆందోళన చాలామంది చిన్న రైతుల్లో బలంగా పాతుకుపోయింది. ఈ భయాన్ని తొలగించడానికే ఇప్పుడు 'వృక్షాధార వ్యవసాయం'గా పేరు మార్చాలని ప్రభుత్వం తలపోసింది. ఇందులో వ్యవసాయం అనే పదాన్ని స్పష్టంగా ఉపయోగించడం ద్వారా చెట్లను గోధుమలు, వరి, చెరకు వంటి సాధారణ వ్యవసాయ పంటలతో సమానంగానే గుర్తిస్తుంది. దీనివల్ల, తాము పెంచే కలప పూర్తిగా వ్యవసాయం పరిధిలోకే వస్తుందన్న భరోసా రైతులకు కలుగుతుంది.

చాలా రాష్ట్రాలు ఇప్పటికే యూకలిప్టస్, పాప్లర్, సరుగుడు, వేప, సుబాబుల్ వంటి చెట్లను నరికివేత, రవాణా అనుమతుల నుంచి పూర్తిగా మినహాయించాయి. కానీ, అడవులలో లభించే టేకు వంటి విలువైన వృక్ష జాతులను రక్షించడానికి రైతులు కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. మునుపు వెదురును నరకడం, రవాణా చేయడంపై భారీ జరిమానాలు ఉండేవి. అయితే, కేంద్రం అటవీయేతర భూముల్లో పెంచే వెదురును 'చెట్టు' నిర్వచనం నుంచి పూర్తిగా తొలగించింది. ఈ చారిత్రక నిర్ణయంతో రైతులు, ముఖ్యంగా ఆదివాసులు తమ పొలాల్లో వెదురును నాటడం, పెంచడం, నరకడం, రాష్ట్ర సరిహద్దులు దాటించి రవాణా చేయడం వీలవుతుంది. ఈ చట్టసవరణ వ్యవసాయ ఆధారిత జీవనోపాధులను, అగర్‌బత్తి, కాగితం తయారీ, నిర్మాణ రంగ పరిశ్రమలకు భారీ అవకాశాలను తెరుస్తుంది. అయితే, అడవులలో పెరిగే వెదురు జాతుల విషయంలో ఇప్పటికీ కొన్ని సహేతుకమైన అభ్యంతరాలు ఉన్నాయి. ఈ విషయంలో వివిధ శాఖల సమన్వయంతో ముందుకు వెళ్లాల్సిన అవసరముంది. ఇటువంటి సంస్కరణల విషయంలో ఏపీ, తెలంగాణలు ఇప్పటికే ముందంజలో ఉన్నాయి. రైతులు ప్రభుత్వ జోక్యంతో కలపను పండించి పేపర్ మిల్లులు, ప్లైవుడ్ పరిశ్రమలకు రవాణా చేసేందుకు వీలుగా పరిశ్రమ అనుసంధాన వ్యవస్థలను అమలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం తనిఖీ కేంద్రాల స్థానంలో 'నేషనల్ ట్రాన్సిట్ పాస్ సిస్టమ్' కింద డిజిటల్ పాస్‌లను తీసుకొచ్చింది. ఈ విధానాన్ని మరింత క్రమబద్ధీకరించాల్సిన అవసరముందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**లాభదాయకమైన జీవనోపాధి...**

చాలామంది రైతులు ఒకే తరహా పంటలను వేస్తుంటారు. దీంతో మద్దతు ధరలు లభించక నష్టపోతున్నారు. మొక్కల పెంపకం కొన్నేళ్ల తరవాత మంచి ఆదాయాన్ని ఇస్తుంది. కాబట్టి, ప్రధాన పంటను నష్టపోయినా రైతులను చెట్లు ఆదుకుంటాయి. పొలాల్లో మొక్కల పెంపకం వల్ల వాటి నీడ, రాలిన ఆకులు నేలను సారవంతం చేస్తాయి. దాంతో ప్రధాన పంట ఉత్పత్తి పెరుగుతుంది. మరోవైపు పాడిపరిశ్రమ, తేనెటీగలు, చేపల పెంపకానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. వృక్షాధార వ్యవసాయం కింద రైతులకు మరింత ఆర్థిక తోడ్పాటు అందించాలని ప్రభుత్వం లక్షిస్తోంది. ఇందులో భాగంగా మొక్కల పెంపకాన్ని గ్రామీణ పథకాలతో అనుసంధానించడం, అధిక దిగుబడినిచ్చే జాతుల (క్లోన్‌ల) కోసం సబ్సిడీలను అందించడం, తక్కువ వడ్డీకి రుణాలివ్వడం వంటి చర్యలు తీసుకుంటారు. చెట్లకూ బీమా సౌకర్యం పొందే అవకాశముంటుంది. భారత్ ఆగ్రోఫారెస్ట్రీ నుంచి వృక్షాధార వ్యవసాయానికి మారడం సేద్యరంగంలో వస్తున్న ఒక ముఖ్యమైన పరిణామం. ఇది అటవీ చట్టాలను గౌరవిస్తూనే, రైతుల ఆర్థిక ప్రయోజనాలనూ కాపాడుతుంది. చెట్ల పెంపకాన్ని సురక్షితమైన, లాభదాయకమైన జీవనోపాధి వ్యూహంగా మారుస్తుంది.



# రాజకీయాల్లో 'సోషలిస్ట్' హవా!

**ఒకటిన్నర దశాబ్దం తర్వాత అమెరికా భారీ రాజకీయ కుదుపునకు లోను కాబోతున్నదా? చాపకింద నీరులాగా డెమోక్రాట్లలో తమ ప్రాబల్యం పెంచుకుంటున్న డెమోక్రటిక్ సోషలిస్టులు అమెరికా రాజకీయ విధాన స్వరూపాలను పునర్నిర్వచించే బలమైన రాజకీయ శక్తిగా ఆవిర్భవించనున్నారా? డెమోక్రాట్ల ప్రైమరీస్ ఎన్నికలలో నమోదవుతున్న కొన్ని విజయాలు ఈ ప్రశ్నలు రేపుతున్నాయి. ఈ ఎన్నికల్లో డెమోక్రటిక్ సోషలిస్టులు గెలుస్తున్నారు. వారి గళం కొత్త నినాదాలను లేవనెత్తుతున్నది. ఆ స్వరాల సంఖ్య ప్రస్తుతానికి పరిమితమే కానీ, తమ వాదనల ద్వారా వారు సంప్రదాయ డెమోక్రాట్లలో కూడా మద్దతును కూడగట్టుకుంటున్నారు.మిషిగన్‌లో ప్రైమరీస్ ఎన్నికలలో అబ్దుల్ ఎల్ సయీద్ విజయం ఇందుకు తాజా ఉదాహరణ. డెమోక్రాట్ సోషలిస్ట్ అయిన సయీద్ అయిదుసార్లు కాంగ్రెస్ ఉమన్‌గా ఉన్న హేలీ స్టీవెన్స్‌ను స్వల్ప మెజారిటీతో ఓడించారు. డిస్ట్రిక్ట్ ప్రైమరీస్‌లో ఠాణేదార్‌ను డెమోక్రాట్ సోషలిస్టు డొనావన్ మెకిన్నీ ఓడించారు. అలాగే తాజా విజయాలు నమోదు చేసిన రషిదా త్లయిబ్, క్రిస్ గ్లిమర్ హిల్‌లు కూడా డెమోక్రటిక్ సోషలిస్టులే. ఈ విజయాలన్నీ డెమోక్రాట్లలో సోషలిస్టుల ఆధిపత్యం పెరుగుతోందన్న వాదనకు కొనసాగింపు మాత్రమే. న్యూయార్క్ సిటీ మేయర్ జొహ్రాన్ మందానీ వీరిలో ప్రముఖుడు. డెమోక్రాట్ సోషలిస్టుల భావజాలంతో కూడిన ప్రకటనలతో తరచూ వార్తల్లో నిలుస్తున్న వ్యక్తి కూడా.**




అమెరికాను మరింత సోషలిజం వైపు తీసుకెళ్లాలనే వాదన డెమోక్రాట్లలో పెరుగుతోంది. ప్రైవేట్ హెల్త్ కేర్ రంగాన్ని సమూలంగా తొలగించడం, పోలీసులకు నిధులను తగ్గించడం వంటివి వీరు ప్రధానంగా తెరమీదకు తెస్తున్నారు. సొంత ఇంటి కల కోసం తాకట్టులు పెట్టాల్సిన పరిస్థితి ఉండదనే ప్రజాకర్షక ప్రకటనలతో వీరు ముందుకు వస్తున్నారు. అంతేకాదు, సెనేట్, ప్రెసిడెన్సీ, సుప్రీంకోర్టు వ్యవస్థలలో కూడా భారీ మార్పులు రావాలని వీరు డిమాండ్ చేస్తున్నారు.

సాధారణంగా అమెరికాలో రాజకీయ నాయకుల మాటలు, ప్రకటనలు, వాగ్దానాలు రెండు రకాలు. ప్రజల్లోంచి ఎన్నికవడానికి పార్టీ అభ్యర్థిగా వచ్చినప్పుడు ఒకరకమైన వాగ్దానాలు ఉంటాయి. పార్టీ అభ్యర్థిగా ఎంపికవడానికి ప్రైమరీస్ ఎన్నికల్లో పోటీచేసినప్పుడు ఆ మాటలు మరో రకంగా ఉంటాయి. సాధారణ ఎన్నికలంటే అన్ని వర్గాల, భిన్న ఆలోచనా ధోరణులకు చెందిన ప్రజల ఓట్లను రాబట్టేలా మాటలు ఉండాలి. కానీ ప్రైమరీస్ అలా కాదు. ప్రైమరీస్ ఎన్నికల్లో తమ పార్టీ కార్యకర్తలను ఆకట్టుకోవడమే ప్రధానం. పార్టీలో ఇంచుమించుగా తమ భావజాలానికి చెందినవారే కార్యకర్తలుగా ఉంటారు. కాబట్టి సారూప్యత ఉన్న తమ భావజాలంలోనే, కొన్ని అతివాద ధోరణులను ప్రదర్శించడం ద్వారా వారిని ఆకట్టుకోవాలి. డెమోక్రాట్ సోషలిస్టులు చేస్తున్నది అదే. 'మరింత సోషలిజం- మరింత సమానత్వం' దిశగా తమ ఎజెండాను ప్రొజెక్ట్ చేస్తూ డెమోక్రాట్ పార్టీ ప్రైమరీస్‌లో వీరు నెగ్గుతున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో సమూల మార్పులు తేవడం, పని అవసరం తక్కువ చేయడం, జరిమానాలు, అప్పులు, తాకట్టులు లేని సమాజం, అందరికీ సమానమైన- ప్రభుత్వపరమైన ఆరోగ్యభద్రత లాంటివి వీరి ఎజెండా అంశాలు. డెమోక్రాటిక్ సోషలిస్టులు వ్యాప్తిచేస్తున్న భావజాలంలో, యుద్ధాలు లేని సమాజం, జాతి లింగ వివక్షలను రూపుమాపడం వంటివీ ఉన్నాయి. ఇరాన్, క్యూబా, వెనెజువెలా వంటి దేశాలతో ఆంక్షలు లేని, నియంత్రణలు లేని సంబంధ బాంధవ్యాలు కావాలనే డిమాండ్ కూడా ఉంది.

ఈ పరిణామాలను విశ్లేషకులు బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్న రోజుల్లో రిపబ్లికన్ పార్టీలో మొదలైన టీపార్టీ ఉద్యమంతో పోలుస్తున్నారు. అప్పట్లో ఒబామా పాలన నాటి హెల్త్ కేర్ సంస్కరణలు, ప్రభుత్వ వ్యయాలు, పన్నుల విధానాలను కొందరు కన్జర్వేటివ్ నాయకులు వ్యతిరేకించారు. వారు నిరసనలతో ఆగలేదు. తమ బలమైన వ్యతిరేకతతో ఏకీభవించే వారినే రిపబ్లికన్ ప్రైమరీస్‌లో పోటీచేయించారు. ఆ పార్టీలో అప్పటికే గుర్తింపు పొందిన అభ్యర్థి కంటే, మరింత కన్జర్వేటివ్ ఆలోచనలున్న అభ్యర్థులకే ఈ టీపార్టీ ఉద్యమకారుల అండ లభించింది. 'డెమోక్రాట్లను ఓడించడం మాత్రమే కాదు, రిపబ్లికన్ పార్టీ గమనాన్ని కూడా మరింత కన్జర్వేటివ్‌గా పునర్నిర్దేశిస్తాం' అన్నట్టుగా వారి ధోరణి సాగింది. వీరు 63 సీట్లు గెలిచి రిపబ్లికన్ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ నియంత్రణ మొత్తాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారు. సెనేట్‌లో 6 సీట్లు గెలిచినా మెజారిటీ దక్కలేదు. అప్పటివరకు ఉదారవాద- కన్జర్వేటివ్ భావజాలాల మిశ్రమంగా ఉన్న రిపబ్లికన్ పార్టీ ఎక్కువ కన్జర్వేటివ్‌గా మారింది. టీపార్టీ ఉద్యమం ద్వారా బలపడిన కన్జర్వేటివ్ వాదులు రిపబ్లికన్ పార్టీలో క్రమంగా ఆధిపత్యం సాధించిన తీరు, ఇప్పటి డెమోక్రటిక్ పార్టీలో సోషలిస్టుల ప్రాబల్యం పెరుగుతుండడానికి దగ్గరగా ఉంది. ఈ క్రమంలో డెమోక్రటిక్ పార్టీ అతివాద సోషలిస్టుల చేతిలోకి పూర్తిగా వెళ్లిపోతే గనుక, అమెరికా భవిష్యత్ రాజకీయ విధానాల్లోనే భారీ కుదుపు వచ్చినా ఆశ్చర్యం లేదు. ఈ సోషలిస్టు ఎజెండాను అమెరికా పౌరసమాజం ఎలా స్వీకరిస్తుందో చూడాలి.

# సంస్కృతికి సిరిగంధపు పూత చేనేత!

**చీరలెన్నో పేర్లు అన్ని! వాసం అంటే చీర. దానికే కోక, వరాసి, కార్పాసము... ఇలా ఎన్నో మారుపేర్లు. కౌశేయం అంటే- ప్రధానంగా పట్టుచీర. క్షౌమమంటే- నారచీర. వనవాసానికి పోతున్న రాముడికి- 'మంధర జాగ్రత్త పెట్టినట్టి నారచీర'లను తెచ్చి చేతికిచ్చింది కైక. రాముడెలాగో చుట్టబెట్టుకున్నాడు కానీ, కంకంటి పాపరాజు మాటల్లో 'రంగారు బంగారు చెంగావులు ధరించే' జనక మహీపతి కూతురు కదా! సీతకు కట్టుకోవడం చేతకాలేదు. రాముడే 'తానుగా కదియుచు పట్టుచీరపయి కట్టెను సీతకు నారచీరలన్' అన్నారు కల్పవృక్షంలో విశ్వనాథ. ఆ ముతకచీరలను చూస్తూనే, అరుంధతికి కోపం వచ్చింది. 'తూకము అయిదుమళ్లు, తొమ్మిది మూరల నారచీర కట్టినావె సీతకు! ఆమె మోయలేదు, అందు మున్గియపోవు, కాళ్లకు అడ్డము పడి కదలలేదు' అని కన్నీళ్లు పెట్టుకుందట! ఆ బరువెంతో తెలిస్తే తప్ప, 'పదహారు మడతల సింధూర వర్ణపు చీరెను అగ్గిపెట్టెలో ఎగుమతి చేసిన ఖ్యాతి తనది' అంటూ సిరిసిల్ల ఘన చరిత్రను వర్ణించిన కవి వంశీకృష్ణ ఆవేదన అర్థం కాదు. ఆత్రేయ చెప్పిన- గాలిలోన తేలిపోయే జిలుగువెలుగుల 'చీరశిల్పం' గొప్పదనం తెలియదు.**



తయారీ సంగతి సరే, చీర కట్టుకోవడం చాలా సొగసైన కళ. పట్టుచీర కట్టుబడి మరీను. బుటా అందం, కొంగు జరీ కళ్లకు కట్టేలా పట్టుచీరను కట్టుకోవడం అందరికీ పట్టుబడే విద్యకాదు. 'పట్టుచీర కట్టుకున్న పుత్తడిబొమ్మ! నీ కట్టుబడికి తరించింది పట్టుపురుగు జన్మ' అని ఊరికే అనలేదు మరి వేటూరి! ఆ ఒడుపు తెలిసిన అతివ నేవళీకంగా చీరకట్టి, వెడల్పు అంచును కాలిబొటనవేళ్లతో విలాసంగా ఎగరేస్తూ ఎదురొస్తే నడిచొస్తున్న శ్రావణ లక్ష్మిలా తోస్తుంది. అందుకే చీరలంటే స్త్రీలందరూ అంతగా ఇష్టపడతారు. బీరువా తెరవగానే కాళ్లమీద పడిపోయేటన్ని తెచ్చి, మధ్యలో కలరా ఉండలు ఉంచి దాచిపెడతారు. చీర భారతదేశ సాంస్కృతిక విశేషం. చరిత్రకు ప్రతీక. సంప్రదాయ సూచిక. 'నేనొక ప్రత్యేకమైనదాన్ని' అనే గర్వ వీచికను స్త్రీలో రేకెత్తించే అద్భుత మంత్రదండమది! చీర స్త్రీలకు సౌభాగ్య సౌందర్య చిహ్నం! దాని కొంగుమాటున దాగే వారందరూ "తల్లి చాటు బిడ్డలే!" పుట్టిననాటినుంచీ అడవుల్లోనూ, మునులతోనూ గడిపిన రుష్యశృంగుణ్ని తమదేశానికి తీసుకెళ్దామని వచ్చారు విలాసినులు. 'ఇవి అపూర్వంబులైన వల్కలములు (చీరలు) అనుచు వారి పట్టు పుట్టంబులను' పదేపదే తాకుతూ ఆనందపడిన ఆయన అమాయకత్వాన్ని రామాభ్యుదయంలో అయ్యలరాజు రామభద్రుడు వర్ణించాడు. అంటే, ఆ స్త్రీల ఆకర్షణ సైతం ఆ చీరల అందం ముందు వెలవెలబోయిందని! కొనే ముందు స్త్రీలంతా గమనించాల్సిందేమంటే చీరవల్ల తమలో ఆత్మవిశ్వాసం పెరగాలి. కట్టిన తీరువల్ల చీరకు అందం రావాలి. ప్రతిచీర స్త్రీ మనోభావాన్ని, అభిరుచిని ప్రతిబింబించాలి. ఆమె హృదయాన్ని అలా లోకానికి ఆవిష్కరించే చేనేత కార్మికుల జీవితాలు మటుకు శిథిలమైపోతూండటం విషాదకరం. '22 అంగుళాల జీవితాకాశం మీద నేసిన నూతన వస్త్రాన్ని వెన్నెల చాపంలా ఆరెయ్యడం' తెలియని బడుగు బతుకులే అయినా, కళాకౌశలం మాత్రం ఎన్నటికీ వన్నె తగ్గదని సిరిసిల్లకు చెందిన వెల్ది హరిప్రసాద్ నిరూపించారు. 5.5 మీటర్ల చీరను కేవలం రెండున్నర గంటల్లో నేసి ఒక అగ్గిపెట్టెలో ఇమిడ్చారాయన. 'మానవుడే మహనీయుడు' అని ఊరికే అన్నారా ఆరుద్ర!

# స్వతంత్ర విధానమే ప్రగతి మార్గం

**మన దేశంలో సమస్యలు సృష్టించడానికి పాకిస్థాన్ ఒకవైపు నిరంతరం కుట్రలు పన్నుతోంది. భారతదేశం ఒక ప్రధాన శక్తిగా ఎదగకుండా, తనను దక్షిణాసియాకే పరిమితం చేయాలని చైనా మరోవైపు ప్రయత్నిస్తోంది. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, మయన్మార్ వంటి దేశాల్లో రాజకీయ మార్పుల వల్ల మన పొరుగున అస్థిరత కొనసాగుతోంది. ఇన్ని అనిశ్చితుల మధ్య కూడా ఇండియా ఎనిమిది దశాబ్దాలుగా అంతర్జాతీయ వేదికపై తన కార్యనిర్వహణ స్వేచ్ఛను కాపాడుకుంటూ వస్తోంది. ఏ ప్రధాన శక్తిపై ఆధారపడకుండా స్వతంత్ర విధానాన్ని అనుసరిస్తోంది.**



భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చేనాటికి అమెరికా నేతృత్వంలోని పెట్టుబడిదారీ కూటమి ఒకవైపు, సోవియట్ యూనియన్ సారథ్యంలోని కమ్యూనిస్ట్ కూటమి మరొకవైపు మోహరించి ఉన్నాయి. భారతదేశం ఈ రెండింటిలో ఏదో ఒక కూటమిని ఎన్నుకుని, ప్రచ్ఛన్న యుద్ధ రాజకీయాల్లో పాల్గొంటుందనే అంచనా ఉండేది. కానీ, పెద్ద దేశాల ఒత్తిళ్లకు తలవంచకుండా, భారత్ అలీన విధానాన్ని అనుసరించింది. మన భౌగోళిక, రాజకీయ, ఆర్థిక అవసరాలకు అలీన విధానమే అత్యుత్తమమైనది. శతాబ్దాలపాటు వలస పాలనలో మగ్గిన భారతదేశం, స్వతంత్రమయ్యే సమయానికి ఆర్థికంగా నిరుపేదగా, సాంకేతికంగా వెనకబడిన దేశంగా ఉండేది. ఈ పరిస్థితిలో ఇతరుల గొడవల్లో తలదూర్చకుండా తన ఆర్థికాభివృద్ధికే ప్రాధాన్యమివ్వాలని భారత్ భావించింది. అందుకే సైద్ధాంతిక భేదాలతో నిమిత్తం లేకుండా ఇతర దేశాలతో ఆర్థిక, సాంకేతిక బంధాలను బలోపేతం చేసుకుంది. ఉదాహరణకు, భిలాయ్ ఉక్కు కర్మాగారాన్ని సోవియట్ సహకారంతో నిర్మించారు. రూర్కెలా, దుర్గాపూర్ ఉక్కు కర్మాగారాలను పశ్చిమ జర్మనీ, బ్రిటన్‌ల సాయంతో ఏర్పాటుచేశారు. మద్రాస్, కాన్పూర్ ఐఐటీలకు పశ్చిమ జర్మనీ, అమెరికాలు మద్దతు ఇవ్వగా బొంబాయి ఐఐటీ ఏర్పాటుకు సోవియట్ సహకరించింది. భారతదేశ అలీన విధానం ఇలాంటి విభిన్న ఆర్థిక, సాంకేతిక భాగస్వామ్యాలను సుసాధ్యం చేసింది. రక్షణకు ఆయుధాలను సోవియట్ నుంచే కాకుండా ఫ్రాన్స్, బ్రిటన్ తదితర ఐరోపా దేశాల నుంచి కూడా భారత్ కొనుగోలు చేసింది.

**అందరి బంధువయా...**

అమెరికా నేతృత్వంలోని సైనిక కూటమిలో పాకిస్థాన్ చేరిన తర్వాత, అలీన విధానాన్ని అనుసరించడం భారత్‌కు ముళ్లబాటగా మారింది. మరోవైపు, చైనాతో సరిహద్దు వివాదం ఏర్పడి 1962లో యుద్ధం జరిగింది. ఆ తర్వాత భారత్‌కు వ్యతిరేకంగా చైనా పాక్ సహకారం ఊపందుకుంది. ఇది చాలదన్నట్లు సోవియట్ పట్ల ఉమ్మడి ఆందోళన వల్ల అమెరికా, చైనాలు దగ్గరయ్యాయి. మారుతున్న పరిణామాల మధ్య పాకిస్థాన్‌తో 1971 యుద్ధానికి ముందు భారతదేశం సోవియట్‌తో శాంతి, స్నేహ, సహకార ఒప్పందంపై సంతకం చేసింది. ఇది భారత అలీన విధానాన్ని దెబ్బతీసిందని విమర్శలు వచ్చాయి. అయితే, ఇండోసోవియట్ ఒప్పంద పరిధి చాలా పరిమితమైనది. భారత భూభాగంలో సోవియట్ సైనిక స్థావరాన్ని నెలకొల్పడానికి కానీ, ఆ దేశ సైనిక సిబ్బంది ఇక్కడి నుంచి పనిచేయడానికి కానీ ఎన్నడూ అనుమతించలేదు.

బెర్లిన్ గోడ కూలిపోవడం, సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావడంతో ప్రచ్ఛన్న యుద్ధం ముగిసింది. సైద్ధాంతిక సంఘర్షణ ముగియడంతో, భారతదేశం అలీన విధానం నుంచి వ్యూహపరంగా స్వయంప్రతిపత్తికి మళ్లింది. మునుపటి అలీన విధానానికి, ప్రస్తుత వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి విధానానికి మధ్య కొన్ని పోలికలు, తేడాలు ఉన్నాయి. భారతదేశం ఏ కూటమిలోనూ చేరడానికి నిరాకరిస్తూనే, ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రముఖ దేశాలతో సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకుంటోంది. భారతదేశం అమెరికాతోనే కాకుండా ఆగ్నేయ, తూర్పు ఆసియాలతోనూ ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసుకుంది. చైనా ఆర్థిక విజృంభణ, ప్రాదేశిక దూకుడు వల్ల అమెరికాతో చేతులు కలపాలని సూచనలు వచ్చినా, భారతదేశం కూటమి రాజకీయాలకు దూరంగానే ఉంది. ఆస్ట్రేలియా, జపాన్, అమెరికాలతో కలిసి 'క్వాడ్'లో చేరినప్పటికీ, దానికి సమాంతరంగా 'బ్రిక్స్' (బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా) సంఘంలోనూ చేరింది. భారతదేశానికి నేడు జపాన్, రష్యా, అమెరికాలతోపాటు యూరప్, ఆసియాల్లోని అనేక ఇతర దేశాలతో బలమైన ఆర్థిక, వాణిజ్య భాగస్వామ్య బంధాలు ఉన్నాయి.

తాజాగా భారతదేశ పశ్చిమ సరిహద్దుల వెంబడి కొత్త కూటమి రూపుదిద్దుకుంటోంది. పాకిస్థాన్, సౌదీ అరేబియా, తుర్కియేలు కొన్ని రోజుల క్రితం సంయుక్త రక్షణ ఒప్పందంపై సంతకం చేశాయి. తమ మూడు దేశాలలో ఎవరిపై దాడి జరిగినా, అది మిగిలినవారిపైనా దాడిగా భావిస్తామని ఈ ఒప్పందం పేర్కొంటోంది. పాకిస్థాన్, భారత్‌ల మధ్య సంఘర్షణ వాతావరణం ఉన్నందున, ఈ ఒప్పందం భారత ప్రయోజనాలను దెబ్బతీస్తుందనే ఆందోళన పెరుగుతోంది. ఇప్పటికే భారత్‌పై పలు ఉగ్రదాడులను ప్రేరేపించిన పాకిస్థాన్ రేపోమాపో మళ్లీ దాడికి తెగబడి, భారత్ దానికి సైనికంగా స్పందిస్తే తుర్కియే కానీ, సౌదీ కానీ పాక్‌కు అండగా పోరులో దిగుతాయా అన్నది కీలక ప్రశ్న. అయితే ఆ మూడు దేశాల అవసరాలు, ఆందోళనలు పరస్పరం భిన్నమైనవి. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌కు పెరుగుతున్న బలం గురించి తుర్కియే కలవరపడుతోంది. సౌదీ ఏమో ఇరాన్ గురించి ఆందోళన చెందుతోంది. ఇక పాకిస్థాన్.. భారతదేశ సైనిక, ఆర్థిక పటిమను చూసి భయపడుతోంది. ఇలా ఎవరి భయాలు వారికి ఉన్నప్పుడు ఉమ్మడి సైనిక చర్య చేపట్టడం తేలిక కాదు. ఏదిఏమైనా, ఈ సైనిక కూటమి రాజకీయాలపై భారత్ అప్రమత్తంగా ఉండకతప్పదు. పాకిస్థాన్ కన్నా భారతదేశం ఆర్థికంగా, రాజకీయంగా చాలా బలమైనది. ఒమన్, యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, బహ్రెయిన్, కువైట్, ఈజిప్ట్ తదితర దేశాలతో బలమైన ఆర్థిక సంబంధాలను కలిగి ఉంది. ఇజ్రాయెల్‌తోనైతే పటిష్ఠ రక్షణ, సాంకేతిక భాగస్వామ్యాలను నెరపుతోంది. పశ్చిమాసియా దేశాల్లో పెద్ద సంఖ్యలో భారత సంతతి ప్రజలు నివసిస్తున్నారు. వీటన్నిటి దృష్ట్యా భారత్ అన్ని దేశాలతో సన్నిహిత సంబంధాలను నెరపడం ద్వారా తన వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని కొనసాగించగలదు. తద్వారా పెరుగుతున్న కూటమి రాజకీయాల ప్రతికూల ప్రభావాన్ని తగ్గించగలదు.

అనంత
జనశక్తి
జనం కోసమే మా అక్షరం
మంగళవారం | అనంతపురం | 25.08.2026 | 01

## చదువు మధ్యలో ఆగిపోయిందా..? మళ్లీ చదువుకునే సువర్ణావకాశం!

**- అనంతగిరిలో OSSC 10వ తరగతి దూర విద్యా ప్రవేశాలు.**
**- 15 ఏళ్లు పైబడిన వారికి అవకాశం:హెచ్‌ఎం. బి.మంగమ్మ.**

**అనంతగిరి,ఆగస్టు24:అనంత జనశక్తి న్యూస్**

చదువు మధ్యలో నిలిచిపో యిన వారికి మరోసారి విద్యను కొనసాగించే అవకాశం లభిస్తోందని బాలికల పాఠశాల 2 హెచ్.ఎం. బి మంగమ్మ అన్నారు. అనంత గిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల-2లో ఏర్పాటు చేసిన సార్వత్రిక విద్యాపీఠం దూర విద్యా కేంద్రంలో OSSC 10వ తరగతి ప్రవేశాలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు.ఈ సందర్భంగా హెచ్‌ఎం. బి. మంగమ్మ మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో 15 సంవత్సరాలు పైబడిన వారు అనివార్య కారణాలతో 10వ తరగతి చదవలేకపోయిన వారు అర్హులని తెలిపారు. దూర విద్యా విధానంలో 10వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసుకునే అవకాశం ఉందని ఆమె తెలిపారు.అనంతగిరి మండలంలోని ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రవేశాల కోసం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలి కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె సూచించారు.మరిన్ని వివరాలకు: 6305971317 ఫోన్ ద్వారా సంప్రదించాలని సూచించారు.




# శిథిలావస్థలో దాసరి తోట జీపీఎస్,ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల





**పగుళ్లు ఏర్పడిన స్లాబ్‌తో విద్యార్థులకు ముప్పు.. ఆందోళనలో తల్లిదండ్రులు**

**అనంతగిరి, ఆగస్టు 24: అనంత జనశక్తి న్యూస్**

అల్లూరి జిల్లా అనంతగిరి మండలం చిలకలగెడ్డ పంచాయతీ పరిధిలోని దాసరి తోట జీపీఎస్(TW) పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలాకాలంగా భవనం సరైన నిర్వహణ లేకపోవడంతో పాఠశాల భవనం పరిస్థితి రోజు రోజుకూ అధ్వానంగా మారుతోందని గ్రామస్తులు చెబుతున్నారు.పాఠశాల భవనంలోని స్లాబ్‌కు పలు చోట్ల పగుళ్లు ఏర్పడటంతో పాటు భవనం బలహీనంగా కనిపిస్తోందని వారు తెలిపారు.వర్షాకాలంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోందని, భారీ వర్షాలు కురిసే సమయంలో స్లాబ్ నుంచి నీరు కారే అవకాశం ఉండటంతో విద్యార్థులను పాఠశాలకు పంపించాలంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారని పేర్కొన్నారు.ప్రతిరోజూ విద్యార్థులు ఇదే భవనంలో తరగతులకు హాజరవుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళన నెలకొంది. చిన్నపాటి ప్రమాదం జరిగినా విద్యార్థుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల భవనం పరిస్థితిపై గతంలో పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని గ్రామస్తులు వాపోయారు. విద్యార్థులకు సురక్షితమైన వాతావరణంలో విద్య అందించాల్సిన పాఠశాల భవనం ప్రమాదకరంగా మారడం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న భవనాన్ని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, భవనం విద్యార్థులకు సురక్షితమా కాదా అనే విషయాన్ని నిర్ధారించాలని కోరుతున్నారు. భవనం ప్రమాదకరంగా ఉన్నట్లయితే విద్యార్థుల భద్రతకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, నూతన పాఠశాల భవనం నిర్మాణానికి వెంటనే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రభుత్వం విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో మారుమూల గిరిజన ప్రాంతంలోని విద్యార్థులు చదువుకునే పాఠశాల భవనం ఇలాంటి దుస్థితిలో ఉండటం బాధాకరమని గ్రామస్తులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి పాఠశాల భవనానికి అవసరమైన నిధులు మంజూరు చేసి నూతన భవనం నిర్మించాలని, అప్పటివరకు విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.విద్యార్థుల భవిష్యత్తుతో పాటు వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈ సమస్యను అత్యవసరంగా పరిగణించి తక్షణమే చర్యలు చేపట్టాలని దాసరి తోట గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# టీడీపీ బీసీ, మహిళా పక్షపాతి.. ఎమ్మెల్యే పరిటాల సునీత

**- ఎమ్మెల్యే సునీతను కలిసిన నూతన ఎమ్మెల్సీ దలవాయి రమాదేవి**
**- ఎమ్మెల్సీకి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే సునీత**

**అనంతపురం ఆగస్ట్ 24,అనంత జనశక్తి న్యూస్**

తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీ, మహిళా పక్షపాతి అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. గవర్నర్ కోటాలో నూతనంగా ఎమ్మెల్సీగా ఎంపికైన దలవాయి రమాదేవి తన భర్త కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే పరిటాల సునీతను, ధర్మవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ ను కలిశారు. అనంతపురం నివాసంలో ఈ మర్యాదపూర్వక భేటి జరిగింది. ఈ సందర్భంగా సునీత, శ్రీరామ్ ఎమ్మెల్సీ రమాదేవికి శుభాకాంక్షలు తెలిపి.. ఘనంగా సత్కరించారు. ఈసంద్భంగా ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి మహిళలను రాజకీయంగా ప్రోత్సహిస్తోందన్నారు. వారికి అన్నింటా సమ ప్రధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా సీఎం చంద్రబాబు మహిళల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉండేలా చూస్తున్నారన్నారు. అలాగే బీసీలకు అత్యధిక అవకాశాలు కల్పించింది కూడా చంద్రబాబేనన్నారు. ఈ రోజు సామాన్య క్లస్టర్ ఇన్ ఛార్జిగా ఉన్న మహిళకు, అట్టడుగు వర్గానికి చెందిన వడ్డెర కులానికి ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వడం పట్ల ప్రతి ఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు...





# పులివెందుల తాగునీటి పథకానికి పునరుజ్జీవం






**- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో తీరుతున్న పులివెందుల నియోజక వర్గం, పరిసర ప్రాంత ప్రజల దాహార్తి**
**- గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన మెగా వాటర్ గ్రిడ్ పథకంపై ఉప ముఖ్యమంత్రివర్యుల ప్రత్యేక దృష్టి**
**- జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధారల కింద సుమారు రూ. 280 కోట్ల కేటాయింపులు**
**- 96 శాతం ఓవరాల్ ప్రాజెక్టు పనులు.. 99 శాతం పైప్‌లైన్ నిర్మాణం పూర్తి**
**- తుది అంకానికి నీటి శుద్ధి ప్లాంట్ పనులు**
**- పులివెందుల పట్టణం, గ్రామీణం, సింహాద్రిపురం మండలాల్లో 100 శాతం పూర్తయిన పనులు**
**- లింగాల మండల పరిధిలో 24 ఆవాసాలకు తాగునీటి సరఫరా**

**పులివెందుల ఆగస్టు 24, అనంత జనశక్తి న్యూస్**

జల్ జీవన్ మిషన్‌అమరజీవి జలధార కింద రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన తాగునీటి ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకువెళ్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభించి నిర్లక్ష్యం చేసిన పథకాలకు సైతం ప్రత్యేక ప్రాధాన్యమిచ్చి ముందుకు తీసుకువెళ్తున్నారు. వైఎస్సార్ కడప జిల్లా, పులివెందుల నియోజకవర్గంతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేసేందుకు పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో చర్యలు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులను తిరిగి గాడిలో పెట్టి వేగవంతంగా పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దాదాపు రూ. 426 కోట్ల విలువైన 96 శాతం పనులు పూర్తి చేసి నిబద్ధత చాటుకున్నారు.గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

ఏడు మండలాల పరిధిలో ఐదున్నర లక్షల మంది ప్రజల దాహార్తి తీర్చే లక్ష్యంతో రూ. 480 కోట్ల అంచనా వ్యయంతో జల్ జీవన్ మిషన్ కింద ప్రారంభమైన పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పథకం పనులు గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి.కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమృద్ధిగా ఉన్నప్పటికీ పనులను ముందుకు తీసుకువెళ్లే అంశంలో శ్రద్ధ చూపలేదు.చేపట్టిన పనుల్లో కూడా నాణ్యత లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జల్ జీవన్ మిషన్ పనుల మీద జరిగిన తొలి సమీక్షలోనే పవన్ కళ్యాణ్ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పథకాలను సైతం ప్రాధాన్య క్రమంలో ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు సూచించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి జల్ జీవన్ మిషన్ గడువు కూడా పూర్తి కావడంతో, కేంద్రం వద్ద ఉన్న మిగులు నిధులు ఖర్చు చేసేందుకు వీలు లేకుండా పోయింది. ఉప ముఖ్యమంత్రివర్యులు, కూటమి నాయకులు చేసిన ప్రయత్నాల ఫలంగా జల్ జీవన్ మిషన్‌ను మరో 4 ఏళ్ల పాటు పొడిగించేందుకు కేంద్రం అంగీకారం తెలపడంతో పులివెందుల మెగా తాగునీటి సరఫరా పథకం తిరిగి ఊపిరి పోసుకుంది.అప్పటి నుంచి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో దాదాపు రూ. 280 కోట్లు ఒక్క పులివెందుల పథకానికే కేటాయించి వేగంగా పనులు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో అరకొర పైప్‌లైన్లు వేయడం మినహా పెద్దగా పనులేమీ పూర్తి కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 96 శాతం పనులు పూర్తి చేశారు. అందులో పులివెందుల, సింహాద్రిపురం మండలాలకు ఇప్పటికే ఈ పథకం ద్వారా తాగునీరు అందుతోంది. పులివెందుల పట్టణానికి సంబంధించిన పనులు కూడా 100 శాతం పూర్తయ్యాయి. లింగాల మండలం పరిధిలో 27 ఆవాసాలకు గాను 24 ఆవాసాలకు త్వరలో తాగునీరు అందుతోంది. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో కీలకమైన ఇంటేక్ వెల్ పునరుద్ధరణ పనులు పూర్తి కాగా, 65 మిలియన్ లీటర్ల నీటి శుద్ధి ప్లాంట్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. 1,111 కిలోమీటర్ల పైప్‌లైన్‌కు గాను 1,106 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయ్యింది. ఓవర్‌హెడ్ ట్యాంకులు, గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్ల నిర్మాణం కూడా దాదాపు తుది దశకు చేరింది. కూటమి ప్రభుత్వం తాగు నీరు వంటి ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చేందుకు రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్లాలని శ్రీ పవన్ కళ్యాణ్ చేసిన నిర్దేశం మేరకు పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పనులను గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు వేగంగా ముందుకు తీసుకువెళ్తున్నారు.

## రాత్రి హామీ ఇచ్చారు ఉదయం పరిహారం చెక్కు అందించిన ఎమ్మెల్యే అమిలినేని




**- గోడ కూలి మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం నుంచి 5,00,000 రూపాయల పరిహారం అందించిన ఎమ్మెల్యే అమిలినేని**
**- విద్యార్థి కుటుంబానికి అండగా ఉంటాం**
**- మరే విద్యార్థికి ఇలా జరగకుండా చర్యలు తీసుకుంటాం**

**కళ్యాణదుర్గం ఆగస్టు 24, అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం జిల్లా శెట్టూరు మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి హర్షవర్ధన్ సమీపంలో ఉన్న పాత భవన వద్ద గోడ కూలీ మృతి చెందగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రభుత్వం నుంచి పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు..అక్కడితో ఆగకుండా రాత్రికి రాత్రే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్‌గారి దృష్టికి తీసుకెళ్లారు దీంతో ఉదయం కలెక్టర్ కార్యాలయం నుంచి విద్యార్థి కుటుంబానికి 5,00,000 రూపాయల పరిహారంగా చెక్కును పంపగా ఆర్డీఓ వసంత్ బాబుతో కలసి ఆసుపత్రికి వెళ్లి చెప్పిన మాట ప్రకారం కుటుంబ సభ్యులకు చెక్కును అందజేసిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు..అంతే కాకుండా కుటుంబానికి అండగా ఉంటానని, ఇలాంటి సంఘటనలు మరెక్కడా జరగకుండా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు...

## నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరైన కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు



**- తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ కలెక్టర్ కు వినతిపత్రం**

**అనంతపురం ఆగస్ట్ 24,అనంత జనశక్తి న్యూస్**

తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ గత నాలుగు రోజులుగా ఉద్యమ బాట పట్టిన కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు సోమవారం రోజు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ నర్సులు ఇప్పటికే సమ్మె నోటీసు కూడా ఇచ్చారు. తాజాగా సోమవారం నుంచి ఈనెల 27వ తేదీ వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని నిర్ణయించారు. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, సూపర్ స్పెషాలిటీ, డిసిహెచ్,డిపిహెచ్ సిబ్బంది ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతేకాకుండా వారు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ని కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అలాగే సమ్మె నోటీసులు కూడా జిల్లా కలెక్టర్ కు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎన్నోసార్లు తమ సమస్యలపై మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. గత జూన్ 17న విజయవాడలో పెద్ద ఎత్తున నిరసన తెలిపినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో ఉద్యమ బాట పట్టామన్నారు. ఈనెల 27వ తేదీ తర్వాత తమ కార్యాచరణ మరింత బలంగా ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ ఉద్యోగాలని రెగ్యులరైజ్ చేయడంతో పాటు సమాన పనికి సమాన వేతనం, ఈపీఎఫ్ వంటి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజీసీఎన్ఏ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రశాంతి, వైస్ ప్రెసిడెంట్ సుజిత, ఎర్రి స్వామి,డిస్టిక్ జెఎసి కో చైర్మన్ వెంకట నారాయణ, ట్రెజరర్ అరుణ జ్యోతి, కన్వీనర్ లావణ్య, శిరీష, శ్యామల, శోభారాణి ధనలక్ష్మి ,కుసుమ , హర్షియా, అంజలి, శాంతి ఇతర స్టాఫ్ నర్స్ లు పాల్గొన్నారు....

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 17 దరఖాస్తులు..

**- ఆర్డీవో రామ భూపాల్ రెడ్డి.**

**ధర్మవరం ఆగస్టు 24, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 17 దరఖాస్తులు రావడం జరిగిందని ఆర్డీవో రామ భూపాల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.....



విభాగాల వారీగా పరిశీలిస్తే రెవెన్యూ శాఖకు సంబంధించి 9 దరఖాస్తులు, సర్వే, సెటిల్‌మెంట్ & ల్యాండ్ రికార్డ్స్ శాఖకు 4 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించి 4 దరఖాస్తులు రావడం జరిగిందన్నారు.మండలాల వారీగా ధర్మవరం మండలం నుంచి 6 దరఖాస్తులు, కనగానపల్లి నుంచి 5, తాడిమర్రి నుంచి 3, బత్తలపల్లి నుంచి 1, చెన్నేకొత్తపల్లి నుంచి 1, ముదిగుబ్బ నుంచి 1 దరఖాస్తు అందాయి అని తెలిపారు. రామగిరి మండలం నుంచి ఎటువంటి దరఖాస్తులు అందలేదు అని తెలిపారు.ప్రజల నుంచి అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో టీడీపీ నేత కన్నుమూత



**- టీడీపీకి తీరని లోటు.. భౌతికకాయానికి నివాళులర్పించిన పరిటాల శ్రీరామ్.....**

**ధర్మవరం ఆగష్టు 24 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం వెంకట తిమ్మాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ బాల మధుబాబు (48) సం, సోమవారం ఉదయం గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పట్టణంలోని మధుబాబు నివాసానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ.. బాల మధుబాబు మృతి టీడీపీకి, ఆయన కుటుంబానికి, వెంకట తిమ్మాపురం గ్రామానికి తీరని లోటని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధి కోసం, తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం బాల మధుబాబు నిరంతరం కృషి చేశారని, సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో గ్రామ ప్రజలకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందించిన నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మధుబాబు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాల మధుబాబు సేవలను, పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధతను ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు స్మరించుకున్నారు. బాల మధుబాబు మృతి విషయం తెలుసుకున్న మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. మధుబాబు మృతి పట్ల పలువురు నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మహేష్ చౌదరి, గొట్లూరు శ్రీనివాసులు, మేకల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లు, స్తంభాలు మార్చండి



**- విద్యుత్ శాఖ అధికారులకు ఎమ్మెల్యే దగ్గుపాటి సమావేశం**
**- క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖపై సమీక్ష**
**- సోలార్ యూనిట్లు వీలైనంతగా ఎక్కువగా ఏర్పాటు చేయాలన్న ఎమ్మెల్యే**

**అనంతపురం ఆగస్ట్ 24, అనంత జనశక్తి న్యూస్**

నగరంలోని కొన్ని కాలనీల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లు, స్తంభాలను వెంటనే మార్చాలని విద్యుత్ శాఖ అధికారులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశించారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన విద్యుత్ శాఖ అధికారులు రమేష్, శ్రీనివాసరావు, ఏఈ లతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో విద్యుత్ శాఖకు సంబంధించిన పెండింగ్ పనులు, కొత్తగా మంజూరైన పనుల గురించి చర్చించారు. పెండింగ్ పనులకు నిర్దిష్ట గడువు నిర్ణయించి పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేయాలని, రోడ్డు విస్తరణలు, కొత్త లేఅవుట్లు, అభివృద్ధి పనులకు అనుగుణంగా స్తంభాల మార్పులు చేయాలని సూచించారు. తక్కువ ఎత్తులో, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను సరిచేయాలన్నారు. అధిక లోడ్ ఉన్న ప్రాంతాలను గుర్తించి సామర్థ్యం పెంపు, అంతరాయాలు లేకుండా చూడాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన రహదారులు, కాలనీలు, ముఖ్య కూడళ్లలో పనిచేయని స్ట్రీట్ లైట్ల మార్చాలన్నారు. నియోజకవర్గంలో విద్యుత్ శాఖకు అందుతున్న ప్రజా ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించే వ్యవస్థ ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల ఇళ్లపై సోలార్ ఏర్పాటు ఎంత వరకు వచ్చిందని ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు కారణాలు తెలుసుకుని త్వరగా పరిష్కరించాలని.. వీలైనంత ఎక్కువ మంది సబ్సిడీపై వచ్చే సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా చూడాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశించారు.

# మధుబాబు మృతి నియోజకవర్గంలో తీవ్ర విషాదం

**- భౌతికకాయానికి నివాళులర్పించిన హరీష్ బాబు....**

**ధర్మవరం ఆగష్టు 24 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం నియోజకవర్గం రూరల్ మండలం వెంకటతిమ్మాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ మధుబాబు అకాల మరణం ఆ గ్రామంతో పాటు నియోజకవర్గవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. సోమవారం ఆయన గుండెపోటుతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు ఆయన నివాసానికి చేరుకుని ప్రగాఢ సంతాపం తెలిపారు. మధుబాబు మరణవార్త తెలుసుకున్న ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు ఆయన నివాసానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మధుబాబు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అదేవిధంగా రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ ఫోన్ ద్వారా మధుబాబు కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మధుబాబు మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఓదార్పు తెలిపారు. పార్టీ కోసం, గ్రామ అభివృద్ధి కోసం మధుబాబు అందించిన సేవలను మంత్రి స్మరించుకున్నారు. మధుబాబు గ్రామ సర్పంచ్‌గా పనిచేస్తూ గ్రామ అభివృద్ధికి తనవంతు కృషి చేయడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేశారని పలువురు నాయకులు గుర్తు చేసుకున్నారు. ఆయన అకాల మరణం పార్టీకి, గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మధుబాబు భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మధుబాబు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



# స్థానిక ఎన్నికల్లో కూటమిదే విజయం



**- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**
**- రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పరుగులు**
**- బీసీల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు ప్రాధాన్యం**
**- ఆలూరు అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి**
**- వచ్చే ఏడాది నుంచి ఆలూరులో బీసీ గురుకులం ప్రారంభం**
**- ప్రజల మెప్పు పొందుతున్న కూటమిపై జగన్ ది ఓర్వలేనితనం**
**- మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు**
**- గత ప్రభుత్వ ఇరిగేషన్ మంత్రులకు సాగునీటి రంగంపై అవగాహనే లేదు : మంత్రి సవిత**
**- ఆలూరులో మంత్రులు సవిత, రామానాయుడు పర్యటన**
**- టీడీపీ శ్రేణులతో భేటీ**

**ఆలూరు ఆగస్టు 24, అనంత జనశక్తి న్యూస్**

సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఆలూరు నియోజక వర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. నియోజక వర్గంలో పరిశ్రమలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాబోయే విద్యా సంవత్సరం నుంచి ఆలూరులో బీసీ గురుకుల పాఠశాలను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో పనిచేసిన ఇరిగేషన్ శాఖ మంత్రులకు పోలవరం సహా ఇతర సాగునీటి ప్రాజెక్టులకు పై కనీసం అవగాహన సైతం లేదన్నారు. ప్రజల మెప్పు పొందేలా పాలిస్తున్న కూటమి ప్రభుత్వంపై జగన్, ఆయన బ్యాచ్ ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. మెగా డీఎస్సీలో ఎటువంటి అక్రమాలు జరగకపోయినా బురదజల్లుతున్నారని మండిపడ్డారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆలూరు నియోజక వర్గంలో కూటమి అభ్యర్థుల విజయానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులకు, కార్యకర్తలకు మంత్రిసవిత దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి కర్నూలు జిల్లా ఆలూరు నియోజక వర్గంలో మంత్రి సవిత సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులతో స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీలకతీతంగా ఆలూరు నియోజక వర్గంలో అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఒకవైపు సూపర్ సిక్స్ పథకాలు, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే నియోజక వర్గంలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, కాలువల సహా ఇతర మౌలిక సదుపాయాలను విస్తృతంగా నిర్మిస్తున్నామన్నారు.

**ఆలూరులో బీసీ గురుకులం**

బీసీల అభ్యున్నతి కోసం సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో అత్యధిక శాతం లబ్ది పొందుతున్నది బీసీలేనన్నారు. నియోజక వర్గంలో అత్యధిక మంది బీసీలు ఉన్నారని, వారి బిడ్డలకు నాణ్యమైన విద్యనందించడానికి స్థానిక టీడీపీ నియోజక వర్గ ఇన్చార్జి వైకుంఠం జ్యోతి కోరారన్నారు. ఆమె వినతి మేరకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఆలూరులో బీసీ గురుకుల పాఠశాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రతి నియోజక వర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగా ఆలూరులో టెక్స్ టైల్స్ పార్క్ ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి సవిత హామీ ఇచ్చారు.

**ఆ మంత్రులకు ఇరిగేషన్ పై అవగాహనే లేదు..**

రాష్ట్రంలో ఒక వైపు సంక్షేమంతో పాటు అభివృద్దిని సీఎం చంద్రబాబునాయుడు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టుల పనులు విస్తృతంగా సాగుతున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే, రాయలసీమకు తాగు, సాగునీరు పుష్కలంగా లభిస్తుందన్నారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులను నిర్మించిన ఘనత సీఎం చంద్రబాబునాయుడిదేనన్నారు. గత ప్రభుత్వంలోని జలవనరుల శాఖ మంత్రులకు పోలవరం సహా ఇతర సాగునీటి ప్రాజెక్టులపై అవగాహన లేదన్నారు. అటువంటి వారు రాయలసీమ ఎత్తిపోతల పథకం, ఇతర సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడడం విడ్డూరంగా ఉందని మంత్రి సవిత విమర్శించారు.

**ఓర్వలేకే మెగా డీఎస్సీపై విమర్శలు**

రాష్ట్ర ప్రజల మెప్పు పొందేలా కూటమి ప్రభుత్వం పాలిస్తుండడంతో జగన్ ఓర్వలేకపోతున్నారని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. మాట్లాడడానికి ఏ అంశమూ లేకపోవడంతో, మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీ అంటే చంద్రబాబు అని, చంద్రబాబు అంటే డీఎస్సీ అని అన్నారు. త్వరలో మరో డీఎస్సీ కూడా నిర్వహించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు.

**ఆలూరులో కూటమిదే విజయం**

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆలూరు నియోజక వర్గంలో కూటమిదే విజయమని మంత్రి సవిత ధీమా వ్యక్తంచేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా, సమన్వయంతో పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు టీడీపీ నియోజక వర్గ ఇన్చార్జి వైకుంఠం జ్యోతి నాయకత్వంలో పసుపు శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. అంతకుముందు ఆలూరుకు వచ్చి మంత్రి సవిత... మంత్రి నిమ్మల రామానాయుడితో కలిసి శంకులమ్మ దేవస్థానంలో పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా స్థానిక టీడీపీ కార్యాలయానికి చేరుకుని పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలు కార్పొరేషన్ చైర్మన్లు బొజ్జమ్మ సావిత్రి, పార్థతమ్మ, దేవేంద్రప్ప పార్టీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు ఆదినారాయణ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# స్వర్ణాంధ్ర2047 లక్ష్యంగా పని చేయండి



**- అధికారుల శిక్షణా కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత**
**- రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులకు శిక్షణా తరగతులు**
**- ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దన్న ఎమ్మెల్యే సునీత**

**రాప్తాడు ఆగస్టు 24, అనంత జనశక్తి న్యూస్**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచన మేరకు స్వర్ణాంధ్ర2047 లక్ష్యంగా పని చేయాలని అధికారులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు, రెవెన్యూ, విద్యా, విద్యుత్, వ్యవసాయశాఖలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అందరికీ గృహాలు, ఇంటింటికి కొళాయి, పీఎంఏవైజె కింద వ్యక్తిగత గృహ మరుగుదొడ్లు, సూక్ష్మ సాగునీటి విస్తీర్ణం, ఉద్యాన పంటల విస్తీర్ణం, పాడి పరిశ్రమ అభివృద్ధి వంటి అంశాల గురించి చర్చించారు. ఇందులో ఆయా కార్యక్రమాల పురోగతి ఎలా ఉంది.. భవిష్యత్‌లో ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై శిక్షణ ఇచ్చారు. మరోవైపు పీజిఆర్ఎస్ కార్యక్రమంపై ఎమ్మెల్యే సునీత ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇప్పటి వరకు నమోదైన ఫిర్యాదులు, వాటిలో గడువులోపు పరిష్కరించినవి, ఇంకా పరిష్కరించాల్సిన, పెండింగ్‌లో ఉన్నఫిర్యాదుల గురించి చర్చించారు. అయితే మనకు వస్తున్న ఫిర్యాదులన్నీ ఆన్ లైన్ లో నమోదు చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. వాస్తవంగా ప్రతి సోమవారం, లేదా మేము శుక్రవారం నిర్వహించే గ్రీవెన్స్ లలో ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని.. ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. అత్యధిక ఫిర్యాదులు రెవెన్యూ, పంచాయతీరాజ్, ఫించన్ల కోసం వచ్చినట్టు సమాచారం ఉందన్నారు. ఇంకా ఎక్కువ స్థాయిలో ఫిర్యాదులు ఉంటున్నాయన్నారు. ఈ గణాంకాలను కేవలం ఫిర్యాదుల సంఖ్యగా చూడొద్దన్నారు. ఇవి కొందరి భవిష్యత్ కు సంబంధించినవి కూడా ఉంటాయన్నారు. పీజిఆర్ఎస్ డేటాను ఉపయోగించి, పదే పదే వస్తున్న ఒకే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా శాఖల మధ్య సమన్వయం ఉండాలన్నారు. పాఠశాలల్లో భవనాలు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం వంటి సమస్యలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అదేవిధంగా వైద్యం, వ్యవసాయం, సంక్షేమ పథకాలు తదితర శాఖల్లో ప్రజలకు అందాల్సిన సేవల గురించి పర్యవేక్షించాలన్నారు. మన లక్ష్యం ప్రజలకు మెరుగైన పాలన, వేగవంతమైన సేవలు, సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించడమేనని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు..

# శిథిలావస్థలో అంగన్‌వాడీ భవనం

**- చిన్నారుల భద్రతపై ఆందోళన...**
**- పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని దళిత వేదిక ఆవేదన...**

**ధర్మవరం / సీ కే పల్లి ఆగష్టు 24 అనంత జనశక్తి న్యూస్ :**

శ్రీ సత్యసాయి జిల్లా సీకే పల్లి మండలం ప్యాదిండి గ్రామంలోని ఎస్సీ కాలనీలో శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనాన్ని వెంటనే పరిశీలించి, చిన్నారుల భద్రతకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ దళిత వేదిక శ్రీ సత్యసాయి జిల్లా శాఖ నాయకులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ దళిత వేదిక రాష్ట్ర చైర్మన్, అధ్యక్షుడు వంగిపురం పెద్దన్న ఆదేశాల మేరకు నిర్వహించిన సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు.

ప్యాదిండి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ భవనం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, భవనం పరిస్థితిపై పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు స్పందన కార్యక్రమాల్లో కలెక్టర్‌కు కూడా వినతులు సమర్పించినా ఇప్పటివరకు అధికారులు భవనాన్ని పరిశీలించకపోవడం బాధాకరమని దళిత వేదిక నాయకులు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు ఉంటున్న నేపథ్యంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు.

"చిన్నారుల ప్రాణాలకు ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?" అని ప్రశ్నించిన నాయకులు.. ప్రమాదం సంభవించే వరకు అధికారులు వేచి చూడకుండా తక్షణమే అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని లేదా నూతన భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. చిన్నారుల భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో జరిగే పరిణామాలకు సంబంధిత అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని సభాముఖంగా హెచ్చరించారు.

**ఎస్సీల పై దాడుల కేసుల్లో జాప్యాన్ని నివారించాలి.....**

అదేవిధంగా జిల్లాలో ఎస్సీల పై జరుగుతున్న దాడులకు సంబంధించిన కేసుల విషయంలో కూడా తగిన చర్యలు తీసుకోవాలని దళిత వేదిక నాయకులు కోరారు. కొన్ని ఘటనల్లో ఆధారాలు లేకపోవడం వల్ల కేసుల నమోదు సాధ్యం కాకపోతున్నప్పటికీ, ఆధారాలు ఉన్న సందర్భాల్లో బాధితులు పోలీసులను ఆశ్రయించినా ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో జాప్యం జరుగుతోందని ఆరోపించారు.

ఎఫ్ఐఆర్ నమోదు ఆలస్యం కావడంతో కొన్ని కేసులను ప్రభావవంతమైన వ్యక్తుల ద్వారా నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఫలితంగా బాధితులకు న్యాయం ఆలస్యమవుతోందని పేర్కొన్నారు. ఈ అంశంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి, బాధితుల నుంచి ఫిర్యాదులు అందినప్పుడు చట్ట ప్రకారం వేగంగా స్పందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, గ్రామస్థాయిలో ఉన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని దళిత వేదిక నాయకులు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో దళిత వేదిక శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు ఆశాది కుల్లాయప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి దురదన్న గారి నరసింహులు, జిల్లా కార్యవర్గ సభ్యులు సాకే ఓబులేసు, జిల్లా కోకన్వీనర్ సాకే నరేష్, చెన్నైకొత్తపల్లి మండల ప్రధాన కార్యదర్శి ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.



# అమరావతి ఛాంపియన్‌షిప్‌కు రాప్తాడు విద్యార్థులు

**రాప్తాడు ఆగస్టు 24 అనంత జనశక్తి న్యూస్**

అండర్17 ఖోఖో అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీల్లో అనంతపురం జిల్లా జట్టు తరపున రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వెంకటదర్షణ్, పాండురంగ పాల్గొననున్నారు. జిల్లా స్థాయి జట్టుకు ఎంపికై చిత్తూరు లో జరిగే ఛాంపియన్షిప్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్న విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు అభినందించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



# అంగరంగ వైభవంగా ఇన్వెస్టిచర్ సెరెమోని వేడుకలు

**- విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ పెంపొందించడమే లక్ష్యం.....**

**ధర్మవరం ఆగష్టు 24 అనంత జనశక్తి న్యూస్ :**



ధర్మవరం పట్టణంలోని రిషి విద్యాలయంలో ఇన్వెస్టిచర్ సెరెమోని వేడుకలను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వన్‌టౌన్ సీఐ రెడ్డెప్ప హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థుల ఆకట్టుకునే మార్చ్‌పాస్ట్‌తో కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైంది. అనంతరం నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులతో ప్రమాణ స్వీకారం చేయించారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని, ఐక్యతా భావాన్ని పెంపొందించే ఉద్దేశంతో స్పోర్ట్స్ టార్చ్ ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథి సీఐ రెడ్డెప్ప జాతీయ పతాకంతో పాటు పాఠశాల పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నూతన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు, సాష్‌లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సీఐ రెడ్డెప్ప మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, బాధ్యత, సమయపాలనతో పాటు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. నాయకత్వం అంటే కేవలం ఒక పదవి కాదని, ఇతరులకు మార్గదర్శకంగా నిలుస్తూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సామాజిక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులు తమపై ఉంచిన బాధ్యతను అర్థం చేసుకుని, తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. పాఠశాల సీఏఓ రవీంద్ర మాట్లాడుతూ నాయకత్వం అనేది బాధ్యతతో కూడుకున్నదని, విద్యార్థులు క్రమశిక్షణతో తమ విధులను నిర్వహిస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

ఏజీఎం శ్రీమతి లిడియా మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం పెంపొందుతాయని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి కళ్యాణి మాట్లాడుతూ నూతన విద్యార్థి నాయకులు తమ బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఏ.ఓ. రంగారెడ్డి, ఉపాధ్యాయులు నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం చివర్లో వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి కృతజ్ఞతా ప్రసంగం చేస్తూ ముఖ్య అతిథులు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమాన్ని తిలకించిన తల్లిదండ్రులు విద్యార్థుల మార్చ్‌పాస్ట్, ప్రమాణ స్వీకారం, స్పోర్ట్స్ టార్చ్ ప్రదర్శనలను ఆసక్తిగా వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు. ఇన్వెస్టిచర్ సెరెమోని ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ స్ఫూర్తిని పెంపొందించేందుకు పాఠశాల యాజమాన్యం చేస్తున్న కృషిని తల్లిదండ్రులు అభినందించారు. వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి.

## అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుతో

# గోదావరి తీరానికి పర్యాటక వైభవం

**- మంత్రి కందుల దుర్గేష్**

**- శెట్టిపేటలో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు పనులను పరిశీలించిన మంత్రి కందుల దుర్గేష్..డిసెంబర్ నాటికి పనులు పూర్తి అవుతాయని వెల్లడి**

**- పుష్కరాలకు పర్యాటక కాంతులతో ముస్తాబవుతున్న గోదావరి పరివాహకం..భక్తుల సౌకర్యార్థం సకల సదుపాయాలు.. పర్యాటకులను కనువిందు చేయనున్న పుష్కర తీరాలు**

**నిడదవోలు ఆగస్టు 24,అనంత జనశక్తి న్యూస్**



గోదావరి పరివాహక ప్రాంతంలో పర్యాటక శోభ పరిమళించాలనే సంకల్పంతో చేపట్టిన అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల దిశానిర్దేశంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపడుతున్న 'అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు' పనులను మంత్రి కందుల దుర్గేష్ సోమవారం నిడదవోలు మండలం శెట్టిపేటలో స్వయంగా పరిశీలించారు. పర్యటనలో భాగంగా అధికారులతో కలిసి పనుల నాణ్యతను, డిజైన్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ప్రకారం పనులు జరుగుతున్న తీరును మంత్రి దుర్గేష్ పర్యవేక్షించి, నిర్ణీత సమయానికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టులో భాగంగా రాజమహేంద్రవరంలో చారిత్రాత్మక హేవలాక్ బ్రిడ్జ్ అభివృద్ధి, పుష్కర్ ఘాట్ పునర్నిర్మాణం, కడియం నర్సరీల వద్ద 'ఎక్స్‌పీరియన్స్ సెంటర్' ఏర్పాటు చేస్తున్నామని అదే విధంగా గోదావరికి ఇటుగా ఉన్న నిడదవోలు నియోజకవర్గంలోని శెట్టిపేట గోదావరి కెనాల్ తీరంలో పర్యాటకులు ఆహ్లాదకర వాతావరణంలో సేద తీరేలా బోటింగ్ పాయింట్, వేసైడ్ రెస్టారెంట్, చిన్నారుల కోసం అధునాతన 'ప్లే జోన్', చినకాశీరేవు ఘాట్ అభివృద్ధి , తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ ఆలయంలో భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన చేస్తున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. "ఇప్పటికే శెట్టిపేట పర్యాటక ప్రాజెక్టుకు సంబంధించిన ప్రాథమిక నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ ఏడాది డిసెంబర్ నాటికి పనులన్నీ పూర్తి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువస్తాం. 2027 గోదావరి పుష్కరాల నాటికి రాజమహేంద్రవరంతో పాటు నిడదవోలు, కొవ్వూరు తదితర ప్రాంతాలలోని ఘాట్లలో అత్యంత వైభవంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాం." అన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి, ప్రత్యేకించి ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కి, అలాగే ప్రాజెక్టుకు పూర్తి మద్దతు ఇస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి మంత్రి దుర్గేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## యువ క్రీడాకారుల ప్రతిభకు వేదికగా

# అటల్‌జీ స్మారక టోర్నమెంట్

**- ఆర్డీటీ మైదానంలో క్రికెట్ జోష్.. ఐదో రోజు హోరాహోరీ పోరులు....**

**- ఎస్ఎస్ నగర్, బసంపల్లి, పెనుకొండ జట్లకు ఘన విజయాలు.....**

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,**

**ఆగస్టు 24, అనంత జనశక్తి న్యూస్ :**



ధర్మవరం పట్టణంలోని ఆర్డీటీ మైదానంలో జరుగుతున్న అటల్ బిహారీ వాజ్‌పాయ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ సీజన్3 ఐదో రోజు ఉత్కంఠభరితంగా సాగింది. సోమవారం జరిగిన మూడు మ్యాచ్‌లలో ఆరు జట్లు గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగడంతో మైదానంలో క్రీడా సందడి నెలకొంది. బ్యాటర్ల దూకుడు, బౌలర్ల పదునైన బౌలింగ్‌తో మ్యాచ్‌లు ఆద్యంతం ఆసక్తికరంగా సాగాయి. టోర్నమెంట్ ముందుకు సాగుతున్న కొద్దీ జట్ల మధ్య పోటీ తీవ్రతరం అవుతుండగా, ప్రతి జట్టు తదుపరి దశకు చేరేందుకు తమ అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తోంది.

**తొలి మ్యాచ్‌లో ఎస్ఎస్ నగర్ సత్తా.....**

ఐదో రోజు తొలి మ్యాచ్‌లో ఎస్ఎస్ నగర్, మ్యాక్స్ ఎలెవన్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్ఎస్ నగర్ జట్టు దూకుడైన ఆటతీరుతో నిర్ణీత ఓవర్లలో 144/3 పరుగుల భారీ స్కోర్ సాధించింది. అనంతరం 145 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన మ్యాక్స్ ఎలెవన్ జట్టు పోరాడినప్పటికీ నిర్ణీత ఓవర్లలో 111/8 పరుగులకే పరిమితమైంది. దీంతో ఎస్ఎస్ నగర్ జట్టు 33 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. బ్యాట్‌తో పాటు సమర్థవంతమైన ఆటతీరుతో ఆకట్టుకున్న ఎస్ఎస్ నగర్ ఆటగాడు హరి కుమార్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

**బసంపల్లి బౌలర్ల ధాటికి బడన్నపల్లి కుదేలు....**

రెండో మ్యాచ్‌లో బసంపల్లి, బడన్నపల్లి జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన బసంపల్లి జట్టు నిర్ణీత ఓవర్లలో 102/9 పరుగులు చేసింది. అనంతరం 103 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన బడన్నపల్లి జట్టు బసంపల్లి బౌలర్ల ధాటిని తట్టుకోలేక వరుసగా వికెట్లు కోల్పోయింది. చివరకు 43 పరుగులకే ఆలౌట్ కావడంతో బసంపల్లి జట్టు 59 పరుగుల తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. బసంపల్లి విజయంలో కీలక పాత్ర పోషించిన యువరాజ్ తన ప్రతిభతో ఆకట్టుకుని ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నాడు.

**మేడాపురంపై పెనుకొండ ఘన విజయం.....**

మూడో మ్యాచ్‌లో మేడాపురం, పెనుకొండ జట్లు పోటీపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన మేడాపురం జట్టు పెనుకొండ బౌలర్లను ఎదుర్కోలేక 61 పరుగులకే ఆలౌట్ అయింది. స్వల్ప విజయలక్ష్యంతో బరిలోకి దిగిన పెనుకొండ జట్టు ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేస్తూ కేవలం ఒక వికెట్ కోల్పోయి 63 పరుగులు సాధించింది. దీంతో పెనుకొండ జట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. పెనుకొండ విజయంలో కీలకపాత్ర పోషించిన సచిన్ ముక్తియార్ అద్భుత ఆటతీరుతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సొంతం చేసుకున్నాడు.

**ప్రతిభ చూపిన ఆటగాళ్లకు అభినందనలు.....**

ఐదో రోజు జరిగిన మూడు మ్యాచ్‌ల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన హరి కుమార్, యువరాజ్, సచిన్ ముక్తియార్లకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను అందజేశారు. బీజేపీ నాయకులు, సీనియర్ క్రికెట్ క్రీడాకారుల చేతుల మీదుగా అవార్డులను అందజేసి విజేత ఆటగాళ్లను అభినందించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యువ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు అటల్‌జీ స్మారక క్రికెట్ టోర్నమెంట్ మంచి వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు. గెలుపు కోసం పోరాడే తత్వంతో పాటు క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, జట్టు సమన్వయాన్ని ప్రతి క్రీడాకారుడు కొనసాగించాలని ఆకాంక్షించారు. టోర్నమెంట్‌లో పాల్గొంటున్న అన్ని జట్లు ఇదే ఉత్సాహంతో ముందుకు సాగాలని కోరారు.

# ఆల్ ఇండియా ఓపెన్ క్యోకుషిన్ కరాటేలో సత్తా చాటిన విద్యార్థులు



**- సిరిపి వెంకటేష్ కరాటే అకాడమీ విద్యార్థుల సత్తా**

**ధర్మవరం ఆగస్టు 24, అనంత జనశక్తి న్యూస్:**

**బెంగళూరులో ఆగస్టు 22, 23 తేదీల్లో నిర్వహించిన 9వ ఆల్ ఇండియా ఓపెన్ క్యోకుషిన్ కరాటే ఛాంపియన్‌షిప్–2026లో సిరిపి వెంకటేష్ కరాటే అకాడమీకి చెందిన మొత్తం 9 మంది విద్యార్థులు పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచారు అని శిరిపి వెంకటేష్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ....**

**ఈ పోటీల్లో 6–8 సంవత్సరాల వయో విభాగంలో బుగ్గ హేమంత్ ద్వితీయ స్థానం సాధించి ట్రోఫీ అందుకోవడం జరిగిందన్నారు..9–10 సంవత్సరాల వయో విభాగంలో సాకే సుశాంత్ ద్వితీయ స్థానం సాధించి ట్రోఫీ అందుకోగా, అదే విభాగంలో సాకే లోకేశ్వర్ సెకండ్ రన్నర్ ప్పగా నిలిచి ట్రోఫీ సాధించారు అని తెలిపారు.**

**అలాగే పోటీల్లో పాల్గొన్న బుగ్గ వంశీకృష్ణ, సంగాల యశ్వంత్, సాకే లోకేష్, సరిగి చరణ్ సాయి, అగ్రహారం శ్రీచందన, బి. ప్రవీణ్ కుమార్లు ప్రశంసనీయమైన ప్రతిభ కనబరిచి మెడల్స్ సర్టిఫికెట్లు సాధించారు అని తెలిపారు.మొత్తం 9 మంది విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని, 3 ట్రోఫీలు, 6 మెడల్స్ సర్టిఫికెట్లు సాధించడం పట్ల సిరిపి వెంకటేష్ కరాటే అకాడమీ నిర్వాహకులు, తల్లిదండ్రులు, శిక్షకులు హర్షం వ్యక్తం చేశారు.విద్యార్థుల విజయానికి కృషి చేసిన కరాటే శిక్షకులు, తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించాలని**

# బడన్నపల్లి స్మశానవాటిక స్థలం గుర్తించి హద్దులు నిర్ణయించాలి.



**- బిల్వం పల్లికి ప్రత్యేక పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలి .**

**- ధర్మవరం ఆర్డీవో రాంభూపాల్ రెడ్డికి గ్రామస్తుల మనవి**

**- గ్రామ సమస్యల పరిష్కారానికి ఆర్డీవో కార్యాలయంలో టీడీపీ నాయకులు, ప్రజల వినతిపత్రాలు**

**ధర్మవరం ఆగస్ట్ 24, అనంత జనశక్తి న్యూస్:**

మండల పరిధిలోని మల్కాపురం పంచాయతీలోని బడన్నపల్లి బడన్నపల్లిగ్రామంలో ఉన్న స్మశాన వాటిక స్థలానికి సంబంధించి తక్షణమే పూర్తిస్థాయి సర్వే నిర్వహించి హద్దులు ని నిర్ణయించాలని మండల టీడీపీ నాయకులు ధర్మవరం టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాలతో ధర్మవరం ఆర్డీవో రాంభూపాల్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. బడన్నపల్లి గ్రామంలోని స్మశానవాటిక స్థలం ప్రస్తుతం 'గ్రామ కంఠం' పరిధిలో ఉందని, ఈ స్థలాన్ని రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే చేయించి, గ్రామ కంఠం నుంచి బదిలీ చేసి స్పష్టమైన హద్దులు చూపించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జ్ మహేష్ చౌదరి, నాయకులు గొట్లూరు శ్రీనివాసులు, మేకల రామాంజనేయులు, విజయ్ సారధిలతో పాటు బడన్నపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

**బిల్వంపల్లి గ్రామానికి ప్రత్యేక పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలి**

అదేవిధంగా, నేలకోట పంచాయతీకి సంబంధించిన సమస్యపై బిల్వంపల్లి గ్రామ ప్రజలు ఆర్డీవో రాంభూపాల్ రెడ్డికి మరొక వినతిపత్రం అందజేశారు. గతంలో నేలకోట, నేలకోట తండా మరియు బిల్వంపల్లి గ్రామాలు కలిపి ఒకే పంచాయతీగా ఉండేవి. అయితే ఇటీవల నేలకోట తండాను ప్రత్యేక పంచాయతీగా విభజించిన దృష్ట్యా, బిల్వంపల్లి గ్రామస్తుల సౌకర్యార్థం ఆ గ్రామానికి ప్రత్యేక పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని వారు ఆర్డీవోను కోరారు.

బడన్నపల్లి స్మశానవాటిక హద్దుల గుర్తింపు మరియు బిల్వంపల్లి పోలింగ్ బూత్ ఏర్పాటు విషయాలపై స్పందించిన ఆర్డీవో రాంభూపాల్ రెడ్డి, ఆయా శాఖ అధికారులు తో మాట్లాడి సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా నిరంతర ప్రక్రియగా ‘జలధార – జలహారతి 2.0’

**- ఎల్నినో ప్రభావం దృష్ట్యా ఇరిగేషన్, డిడబ్ల్యుఎంఏ అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి**

**- అన్ని చెరువులు, కుంటలు, కాలువలకు వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలి**

**- ఉపాధి హామీ కూలీలకు విరివిగా పనులు కల్పిస్తూ జల సంరక్షణ పనులు వేగవంతం చేయాలి**

**- జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్**

**పుట్టపర్తి,ఆగస్టు, 24:**

జిల్లాలో నీటి ఎద్దడి తలెత్తకుండా, భూగర్భ జలమట్టాలను నిరంతరం పెంచడమే లక్ష్యంగా ‘జలధార జలహారతి 2.0’ కార్యక్రమాన్ని ఒక నిరంతర ప్రక్రియగా నిర్వహించాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఇరిగేషన్ మరియు డ్వామా అధికారులను ఆదేశించారు.

కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్‌లో ఇరిగేషన్ శాఖ అధికారులు, డ్వామా అధికారులతో పాటు APD, APO, మరియు AEలతో కలెక్టర్ ‘జలధార జలహారతి 2.0’ అమలు మరియు ప్రగతిపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...

ప్రస్తుతం ఎల్నినో పరిస్థితులు ఉన్నందున, రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకుని ఇరిగేషన్ అధికారులు వెంటనే జిల్లాలోని అన్ని చెరువులు, కాలువలు, కుంటలలో O&M (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) కింద అవసరమైన రిపేర్లన్నీ త్వరితగతిన పూర్తి చేయాలి. వర్షపు నీరు వృథా కాకుండా ప్రతి బొట్టు చెరువులు, కుంటల్లోకి చేరి భూగర్భ జలాలు సమృద్ధిగా పెరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి. డ్వామా అధికారులు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పెద్ద ఎత్తున పనులు కల్పిస్తూ, జలధార జలహారతి 2.0 కింద కేటాయించిన జల సంరక్షణ పనులన్నింటినీ శరవేగంగా పూర్తి చేయాలి. పూడికతీత, చెక్ డ్యామ్‌ల నిర్మాణం, వానపాముల గుంతలు, చెరువుల పునరుద్ధరణ వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి.సమీక్షలో పాల్గొన్న ప్రతి అధికారినీ "వాటర్ ప్రొవైడింగ్ అధికారి"గా కలెక్టర్ అభివర్ణించారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి మరియు సాగునీటి ఎద్దడి రాకూడదని, నీటి అవసరం ఎక్కడ ఉన్నా గుర్తించి అక్కడ భూగర్భ జలాలు పెరిగేలా చర్యలు తీసుకోవడం అధికారుల ప్రాథమిక బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఇ రాజగోపాల్, డిడబ్ల్యుఎంఏ పిడి విజయ ప్రసాద్, ఇరిగేషన్ ఇఇ గురుమూర్తి,ఇరిగేషన్,డ్వామా శాఖల ఉన్నతాధికారులు, APDలు, లు, ఏ ఈ లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

**- అందిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలి**

**- జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్**

**పుట్టపర్తి,ఆగస్టు,24:అనంత జనశక్తి న్యూస్**

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు.సోమవారం పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (PGRS) కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను కలెక్టర్ స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిశీలించి అర్హత మేరకు పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటి ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో నేడు మొత్తం 310 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ,డిఆర్ఓ కొండయ్య,ఎస్‌డిసి విజయ కుమారి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
మంగళవారం | అనంతపురం
25.08.2026



## ఈనెల 30న 'చేయూత' ఉచిత కృత్రిమ చేతుల పంపిణీ



**- అర్హులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**అనంతపురం, ఆగస్టు 24 :అనంత జనశక్తి న్యూస్**

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అనంతపురము జిల్లా శాఖ, రోటరీ క్లబ్ అనంతపురం సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 30వ తేదీన నిర్వహించనున్న 'చేయూత' ఉచిత ఫంక్షనల్ ప్రోస్తెటిక్ హ్యాండ్స్ (పని చేయగలిగే కృత్రిమ చేతులు) పంపిణీ కార్యక్రమం కరపత్రాలను సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా అధికారులు, అర్జీదారులకు పంపిణీ చేసి కార్యక్రమ వివరాలను తెలియజేశారు.ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యుడు దాసరి భరత్, ట్రెజరర్ సుంకర రమేష్, బిసితి భరత్ మాట్లాడుతూ, రాయలసీమ ప్రాంతంలోని ఆరు జిల్లాలకు చెందిన, మోచేతి కింది భాగంలో చేయి కోల్పోయిన దివ్యాంగులకు రోటరీ క్లబ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా ఫంక్షనల్ ప్రోస్తెటిక్ హ్యాండ్స్ అందజేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ముందుగా తమ వివరాలను 'చేయూత' కాల్ సెంటర్ నంబర్ 8866306969 ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 30వ తేదీన అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో నిర్వహించే పంపిణీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కృత్రిమ చేతుల సహాయంతో దివ్యాంగులు రోజువారీ పనులను సులభంగా చేసుకోవడంతో పాటు వ్యవసాయ పనులు కూడా నిర్వహించగలుగుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో యూత్ రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.జయమారుతి, అంబరీష్, బాలాజీ, మంజునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ మల్లికార్జున కుటుంబాన్ని పరామర్శించిన పరిటాల సునీత



**- ఈనెల 19న రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్**

**రాప్తాడు ఆగస్టు 24 అనంత జనశక్తి న్యూస్**

రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ మల్లికార్జున కుటుంబాన్ని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పరామర్శించారు. మండలంలోని రామినేపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఈనెల 19న కానిస్టేబుల్ చిరుతల మల్లికార్జున (37) ద్విచక్రవాహనంలో వెళ్తుండగా.. ప్రమాదానికి గురై మరణించారు. రాప్తాడు పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే సునీత మల్లికార్జున ఇంటికి వెళ్లారు. అతని భార్య, కుమారుడు, కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. విధి నిర్వహణలో ఎంతో చిత్తశుద్ధిగా ఉండే మల్లికార్జున ఇలా చిన్న వయసులోనే మరణించడం చాలా బాధాకరమన్నారు. అధైర్యపడద్దని.. మీ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## రోడ్డు ప్రమాద కుటుంబానికి ఎమ్మెల్యే కందికుంట 50 వేలు ఆర్థిక సాయం




**నల్లచెరువు ఆగష్టు 24 అనంత జనశక్తి న్యూస్**

మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లికి చెందిన మేకల వెంకటరమణ కుటుంబం కూలీ పనుల నిమిత్తం బెంగుళూరుకు వెళ్తుండగా మార్గమధ్యలో రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డారు వైద్య చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని నల్లచెరువు మండల నాయకులు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50,000 ఆర్థిక సహాయం అందించాలని సూచించారు ఎమ్మెల్యే తరపున మండల కన్వీనర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో 50వేలు అందజేశారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు గుత్తా ప్రసాద్ తెలుగు యువత నాయకులు సతీష్ చౌదరి దేవలం వేణు తదితరులు పాల్గొన్నారు ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## చెవిటి మిషన్ వితరణ.

**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 24 అనంత జన శక్తి న్యూస్.**

పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో నివాసముంటున్న దివ్యాంగుడు షేక్ బాబా ఫక్రుద్దీన్ కు చెవిటి మిషన్ను అధికారులు సోమవారం అందజేశారు. డిజేబుల్ డిపార్ట్మెంట్ సహకారంతో పుట్టపర్తి ఆర్ఐ గణేష్ చేతుల మీదుగా బాబా ఫక్రుద్దీన్ కు 18 వేల రూపాయల విలువచేసే యంత్రాన్ని ఉచితంగా అందజేశారు. గత కొంతకాలం నుండి చెవులు వినపడకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారు. చెవిటి మిషన్ తెచ్చుకోవడానికి ఆర్థిక స్థోమత లేక పుట్టపర్తి ఆర్ఐ గణేష్ సహకారతో దరఖాస్తు చేసుకొగా సోమవారం డిజేబుల్ డిపార్ట్మెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ షమీవుల్లా ఆ యంత్రాన్ని వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ ఐ మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేని దివ్యాంగులకు వివిధ ఉప కరణాలతోపాటు, ట్రై సైకిల్, వివిధ రకాలైన పరికరాలను అందజేస్తామని, ఆర్థిక స్తోమత లేని వారు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోనీ సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రశాంతి నిలయం గ్రామానికి చెందిన షేక్ బాబా ఫక్రుద్దీన్ కుటుంబ సభ్యులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



## గార్లదిన్నెలో ఘనంగా ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ఠ



**- ముఖ్య అతిథిగా పాల్గొన్న అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పూల నాగరాజు**

**- ఎన్టీఆర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..పూల నాగరాజు**

**శింగనమల ఆగస్టు 24, అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం గార్లదిన్నెలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడుతూ.. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎన్టీఆర్ అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని గుర్తు చేశారు. ముఖ్యంగా బీసీలకు రాజకీయ, సామాజిక ప్రాధాన్యత కల్పించి, వారిని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంలో ఎన్టీఆర్ పాత్ర చారిత్రాత్మకమని అన్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహానేత ఎన్టీఆర్ అని, ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్త ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ద్వారా ఆయన సేవలను, సిద్ధాంతాలను మరోసారి స్మరించుకోవడం ఎంతో గర్వకారణమని పూల నాగరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ , జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి , ఎడిసిసి బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి , ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు , శింగనమల నియోజకవర్గ పార్టీ పరిశీలకులు మన్నెం సుబ్బారెడ్డి , మాజీ జడ్పీటీసీ రామలింగ రెడ్డి , మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాయల్ మురళి , టిడిపి నాయకులు పశువుల శ్రీరామరెడ్డి , శింగనమల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కన్వీనర్లు, క్లస్టర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల పోషణ, రక్షణపై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ



**రాప్తాడు ఆగస్టు 24 అనంత జనశక్తి న్యూస్**

మండలంలో నిర్వహిస్తున్న "జ్ఞాన జ్యోతి-120" శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఐదో రోజు అంగన్వాడీ కార్యకర్తలకు పిల్లల పోషణ, రక్షణ, సంరక్షణతో పాటు అంగన్వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రుల ఉమ్మడి బాధ్యతలపై శిక్షణ ఇచ్చారు.మండల ఎంఈఓ మల్లికార్జున, సీడీపీఓ ఉమాశంకరమ్మ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ శిక్షణలో పుట్టినప్పటి నుంచి ఆరు సంవత్సరాల వయస్సు వరకు పిల్లల ఎదుగుదలకు సంబంధించిన అంశాలను వివరించారు. ఈ వయస్సులోనే పిల్లల మెదడు అభివృద్ధి వేగంగా జరుగుతుందని, అందువల్ల శారీరక, మానసిక, మేధో సామర్థ్యాల అభివృద్ధికి తగిన పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ అందించడం ఎంతో ముఖ్యమని తెలిపారు.పిల్లలకు అందించే ఆహారంలో ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్, కార్బోహైడ్రేట్లు, ఖనిజ లవణాలు, తృణధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు, పాలు, పండ్లు తదితర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు ఉండేలా చూడాలని సూచించారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే టేక్ హోమ్ రేషన్ (THR), ప్రీస్కూల్ పిల్లలకు వండి పెట్టే హాట్ కుక్డ్ మీల్స్ (HCM) ప్రాముఖ్యతను వివరించారు.

పిల్లల ఎదుగుదలను పర్యవేక్షించేందుకు ప్రతి నెలా వారి బరువు, ఎత్తును నమోదు చేసి, వయస్సుకు అనుగుణంగా ఎదుగుదల ఎలా ఉందో పరిశీలించాలని శిక్షణలో సూచించారు. పిల్లల ఆరోగ్యం, పోషణ, రక్షణ విషయంలో అంగన్వాడీ కార్యకర్తలతో పాటు తల్లిదండ్రులు కూడా బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు.ఈ ఐదో రోజు శిక్షణ కార్యక్రమంలో విద్యా శాఖ నుంచి డీఆర్పీలుగా సూర్యనారాయణ, వెంకటనాయుడు, రామ్మూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లీలావతి, శ్రీవాణితో పాటు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి



**ఆలూరు: ఆగస్టు 24 అనంత జనశక్తి న్యూస్**

కూటమి ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి శ్రీమతి సవిత తెలిపారు. ఆలూరు క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న వసతి, భోజనం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన వసతి కల్పించే విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు. హాస్టళ్లలో ఇన్వర్టర్లు, ఆర్వో ప్లాంట్లు సక్రమంగా పనిచేసేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వార్డెన్లు హాస్టళ్లను నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యార్థుల సమస్యలను తెలుసుకుని, వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

**నేతన్నలకు అండగా ప్రభుత్వం**

**త్వరలో నేతన్న సేవ రెండో విడత నగదు జమ – మంత్రి సవిత**

చేనేత కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సవిత తెలిపారు. హ్యాండ్లూమ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నేతన్న సేవ పథకం అమలు తీరుపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.నేతన్న సేవ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న వారి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.చేనేత కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకం అమలు తీరుపై కూడా మంత్రి సమీక్షించారు. నేతన్న సేవ పథకం కింద త్వరలో రెండో విడత నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కానుందని మంత్రి సవిత తెలిపారు. చేనేత కార్మికుల ఆర్థికాభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

**చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ**

**ఆప్కో ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించాలి – మంత్రి సవిత**

ఆప్కో ద్వారా జరుగుతున్న చేనేత ఉత్పత్తుల విక్రయాలపై మంత్రి సవిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుత విక్రయాల పరిస్థితిని సమీక్షించి, అమ్మకాలను మరింత పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.చేనేత ఉత్పత్తుల నాణ్యత, ప్రత్యేకతను ప్రజలకు తెలియజేసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. మార్కెటింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, చేనేత కార్మికులకు అదనపు మార్కెట్ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**లేపాక్షి ఉత్పత్తుల అమ్మకాలు పెంచాలి**

**ప్రచారం, మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి .**

లేపాక్షి ద్వారా విక్రయిస్తున్న ఉత్పత్తుల అమ్మకాలపై మంత్రి సవిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. లేపాక్షి ఉత్పత్తులకు మరింత ఆదరణ తీసుకురావడంతో పాటు, విక్రయాలను గణనీయంగా పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు.లేపాక్షి ఉత్పత్తుల నాణ్యత, ప్రత్యేకతను ప్రజలకు తెలియజేసేలా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేసి, లేపాక్షి ఉత్పత్తులకు మరింత ప్రాచుర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

**బీసీ కార్పొరేషన్ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలి**

**భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి – మంత్రి సవిత**

బీసీ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి శ్రీమతి సవిత అధికారులను ఆదేశించారు. బీసీ కార్పొరేషన్ ఈడీ, సంబంధిత అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.పథకాలు అమలు తీరును సమీక్షిస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పథకాల అమలులో పారదర్శకత పాటించాలని ఆదేశించారు.బీసీ కార్పొరేషన్‌కు సంబంధించిన భవనాల నిర్మాణ పనులు, వాటి పురోగతిపై కూడా మంత్రి సమీక్షించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.బీసీల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి సవిత పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పలువు జిల్లా అధికారుల తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతిగారు పలువురు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు..

## పర్యావరణ పరిరక్షణతోనే భవిష్యత్తు

**- జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్**

**- పర్యావరణ పరిరక్షణ దిశగా మరో అడుగు**

**బుక్కపట్నం,ఆగస్టు 24:అనంత జనశక్తి న్యూస్**



పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ, భూగర్భ జల మట్టాలను పెంచేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం బుక్కపట్నం మండలం బుచ్చయ్య గారి పల్లిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రాంగణంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన UHD (NZFC) అనంత అరణ్య ప్లాంటేషన్ పనులను మరియు రైన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ (వర్షపు నీటి నిల్వ నిర్మాణం) ను కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులతో కలిసి జిల్లా కలెక్టర్ స్వయంగా మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో నాటిన ప్రతి మొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరిస్తూ, వాటిని దత్తత తీసుకుని సంరక్షించే బాధ్యతను స్వీకరించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ... పాఠశాలల ప్రాంగణాల్లో మొక్కలు నాటడం ద్వారా విద్యార్థులకు చిన్ననాటి నుంచే పర్యావరణ స్పృహ పెరుగుతుందన్నారు. 'అనంత అరణ్య' ప్రాజెక్ట్ కింద చేపడుతున్న నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను సిబ్బంది తీసుకోవాలని సూచించారు. వర్షపు నీటిని వృథా పోనివ్వకుండా ఇంకుడు గుంతలు, హార్వెస్టింగ్ స్ట్రక్చర్ల ద్వారా భూగర్భంలోకి మళ్లించడం వలన భవిష్యత్తులో నీటి ఎద్దడిని అరికట్టవచ్చని తెలిపారు.ఉపాధి హామీ పథకం మరియు సంబంధిత శాఖల సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా హరితహారం, ప్లాంటేషన్ పనులను విస్తృతంగా చేపడుతున్నామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఎంఏ పిడి విజయ ప్రసాద్,బుక్కపట్నం ఎంపీడీవో, ప్లాంటేషన్ మేనేజర్, ప్లాంటేషన్ సూపర్వైజర్లు, ధర్మవరం CDCLRC సిబ్బంది, కేజీబీవీ స్కూల్ ఉపాధ్యాయులు & సిబ్బంది, VB G RAM G సిబ్బంది, ఉపాధి హామీ శ్రామికులు తదితరులు పాల్గొన్నారు

## శ్రావణ సోమవారం పురస్కరించుకొని ఘనంగా శివాలయంలో పూజా కార్యక్రమాలు.

**శెట్టూరు ఆగస్టు 24 అనంత జనశక్తి న్యూస్.**

**శ్రావణమాసంలో భాగంగా సోమవారం మండల వ్యాప్తంగా ఉన్న శివాలయాలు ఘనంగా పూజా కార్యక్రమాలు భక్తులు నిర్వహించారు ఉదయాన్నే స్వామివారికి అభిషేకం మరియు పంచామృతాలతో స్వామివారిని పూజించారు మండలంలోని లక్ష్మంపల్లి గ్రామంలో బెస్త రంగస్వామి రోజా దంపతులు స్వామి వారికి వెండి నాగాభరణాన్ని విరాళంగా అందజేసి ఘనంగా పూజ కార్యక్రమాలు నిర్వహించి భక్తాదులకు అన్నదాన నిర్వహించారు. స్వామివారికి వెండి నాగభరణాన్ని అందించిన దంపతులకు ఆలయ కమిటీ వారు ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున భక్తతులూ పాల్గొన్నారు**



# ఒకే కుటుంబంలో ఇద్దరు వికలాంగులు పెన్షన్ కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూపులు

**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 24**

**అనంత జన శక్తి న్యూస్.**

ఒకే ఇంట్లో ఇద్దరికి అంగవైకల్యం కలిగిన వ్యక్తులకు పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. నల్లమడ మండలం పులగం పల్లి గ్రామానికి చెందిన గంగప్ప, అతని కుమారుడు అనిల్ కుమార్, ఇరువురు వికలాంగులు, వీరు సోమవారం శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఇరువురు దివ్యాంగులు దరఖాస్తు చేసుకున్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు వికలాంగులు ఉన్నారు. తండ్రి గంగప్పకు 85% వికలాంగత్వం ఉన్న పెన్షన్ మంజూరు చేయలేదనీ వీల్ చైర్ లో జీవితం గడుపుతున్న అధికారులు కరుణించకపోవడం పట్ల ఆయన తీవ్ర దిబ్బంతిని వ్యక్తం చేశారు. అతని కుమారుడైన అనిల్ కుమార్ గత ఆరు నెలల క్రితం కదిరి లక్ష్మీనరసింహస్వామి తేరు క్రింద ప్రమాదవశాత్తు పడడంతో కాలు విరిగింది అప్పటినుండి కర్రల సాయంతోనే జీవనం సాగిస్తున్నారు. ఇతనికి



వికలాంగత్వం అసలు లేదని వైద్యాధికారులు సర్టిఫికెట్ మంజూరు చేశారు. అందుచేత ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి వికలాంగ పెన్షన్ మంజూరు కాలేదు. బాధితులు తమకు ఉన్న అంగవైకల్య సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులు, ఇతర పత్రాలన్నీ తీసుకుని సచివాలయం నుండి కలెక్టరేట్ వరకు అన్ని కార్యాలయాల చుట్టూ తిరిగారు. అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబంలో సంపాదించే దిక్కు లేక, వికలాంగ పెన్షనే ఆధారమని ఆశతో ఎదురుచూస్తున్నారు. చేతిలో పత్రాలు పట్టుకుని కార్యాలయాల ముందు గంటల తరబడి వేచి ఉండటం తప్ప వారికి దిక్కు లేకుండా పోయింది.

ప్రభుత్వం వెంటనే స్పందించి ఇద్దరికీ వికలాంగ పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

# దళిత కాలనీల సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం

**- జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ హామీ.....**

**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 24**

**అనంత జన శక్తి న్యూస్.**



శ్రీ సత్య సాయి జిల్లాలో దళిత కాలనీలలోని సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ సిఐటియు, సిపిఎం, నాయకులకు హామీ ఇచ్చారు. సోమవారం శ్రీ సత్య సాయి జిల్లా ప్రజా సమస్యల పరిష్కార వేదిక, వద్ద సిఐటియు,కెవిపిఎస్, వ్యవసాయ, రైతు కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి, నిరసన కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్కు పలు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దళిత కాలనీలలో సమస్యలను వెంటనే పరిష్కారం చూపుతామని ఇదివరకే జిల్లా వ్యాప్తంగా 50 ఎకరాలు భూమి ని దళిత స్మశాన వాటిక లకు కేటాయించామని, కొన్నిచోట్ల స్మశాన వాటిక లకు రహదారులు ఏర్పాటు చేశామని, చూపిన దారులు చాలక ఇంకా ఎక్కువ కావాలంటే ఇవ్వడానికి వీలు ఉండదని, చిలమత్తూరు,హిందూపురం పట్టణాల్లో రహదారి ఏర్పాట్లు చేశామని, జిల్లా వ్యాప్తంగా స్మశాన వాటిక రహదారుల కొరకు వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తున్నామని, కొన్నిచోట్ల ఇచ్చిన స్థలాన్ని తిరస్కరిస్తున్నారని, అందుబాటులో ఉంటే ప్రైవేట్ స్థలాన్ని సైతం కొనుగోలు చేసి అందజేస్తామని తెలిపారు. ఇదివరకు శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఎస్సీ ఎస్టీ లకు 57, వేల ఇంటి పట్టాలను మంజూరు చేశామని, వాటిలో 18,వేల మంది ఇల్లు నిర్మించుకున్నారని చాలామంది ఇళ్లను నిర్మించుకోలేదని అలాంటివారు వెంటనే ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. అంతేకాక గ్రామాల్లో నిరుపేదలను గుర్తించి అర్హులైన వారికి ఇంటి పట్టాలను మంజూరు చేస్తామని తెలిపారు. సిఐటియు నాయకులు కోరిన విధంగా దళితవాడాలలో, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ద్వారా సమస్యలను గుర్తించి గ్రామాల్లో వివక్షతను రూపుమాపేందుకు అన్ని చర్యలు చేపడతామని తెలిపారు. దళితుల ఆలయ ప్రవేశం చేయకుండా నిల వరించే వారిపై చర్యలు తీసుకుంటామని, శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా దళితులకు అర్హత ఉండి ఇల్లు లేని నిరుపేదలు వెంటనే ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాలసముద్రం గ్రామంలో 100 కుటుంబాలకు మౌలిక వసతులు కల్పించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న సంగతిని ఒక దళిత మహిళ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చిలమత్తూరు గ్రామంలో దళితులకు చెరువులో పట్టాలను మంజూరు చేశారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వాటిని పరిశీలించి తిరిగి వెనక్కి తీసుకొని అనువైన చోట అందజేస్తామని హామీ ఇచ్చారు . హిందూపురంలో ప్రభుత్వ స్థలంలో వేసిన గుడిసెలను పలుమార్లు తొలగించాలని, ఆ స్థలాన్ని కేటాయించాలని కోరారు. వేమన ఆలయంలో దళితులకు ప్రవేశం నిషేధించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# అగాపే ఆశ్రమం లో అన్నదానం

**యాడికి, ఆగష్టు 24, అనంత జనశక్తి న్యూస్ :**

మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు పక్కన ఉన్న అగాపే ఆశ్రమం లో వృద్ధులకు సోమవారం అన్నదానం కార్యక్రమం ను నిర్వహించారని ఆశ్రమ ఫౌండర్ బత్తుల ప్రసాద్ తెలిపారు.రామాజి పెద్ద ఓబులమ్మ జ్ఞాపకార్థం ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు ఆమె కుమారులు రామాజి బాలస్వామి,ఇన్నయ్య (హోటల్),కోడళ్లు కూతుర్లు,అల్లుళ్లు అన్నదాన కార్యక్రమం ను నిర్వహించారు. రామాజి పెద్ద ఓబులమ్మ ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబం సభ్యులు ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్ళు సుఖశాంతులతో జీవించాలని వృద్ధులు, ఆశ్రమం ఫౌండేషర్ బత్తుల ప్రసాద్ లు దీవించారు. ఈ కార్యక్రమంలో కుటుంబం సభ్యులు పాల్గొన్నారు.



# రూ.7 కోట్లతో నిడదవోలుకు పుష్కర శోభ: పర్యాటక

**- శాఖ మంత్రి కందుల దుర్గేష్**
**- నిడదవోలులో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి కందుల దుర్గేష్**
**-చినకాశీరేవును ఆధ్యాత్మిక కేంద్రంగా, నిడదవోలును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని వెల్లడి**
**- నిడదవోలులో రూ.3.69 కోట్లతో 'అఖండ గోదావరి' ప్రాజెక్టు పనులు శరవేగం..డిసెంబర్ నాటికి పనుల పూర్తికి చర్యలు**

**-నిడదవోలు ఆగష్టు 24, అనంత జనశక్తి న్యూస్**



మునుపెన్నడూ లేని విధంగా నిడదవోలు పట్టణ రూపురేఖలను మారుస్తున్నామని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా కనెక్టివిటీ రోడ్లు నిర్మిస్తూ పుష్కరాల నాటికి నిడదవోలును సుందర నందనవనంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.సోమవారం నిడదవోలు పట్టణంలోని చినకాశీరేవు, బాసివిరెడ్డిపేట ప్రాంతాలలో గోదావరి పుష్కరాలు2027 పనుల కింద పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అదే విధంగా అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టులో భాగంగా పర్యాటక శాఖ ద్వారా జరుగుతున్న పనులను స్వయంగా పర్యవేక్షించారు. తొలుత గోదావరి పుష్కరాలు2027 ప్రత్యేక గ్రాంట్ రూ. 35 లక్షల వ్యయంతో 2వ మరియు 3వ వార్డులలో అన్నపూర్ణ నగర్ నుండి చినకాశీరేవు వరకు 730 మీటర్ల పొడవునా మెటల్ రోడ్డు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు.9 పోల్స్‌తో కూడిన సెంట్రల్ లైటింగ్ ప్రారంభోత్సవ ఫలకాన్ని మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు. ప్రస్తుతం మట్టిరోడ్డుగా ఉన్న దీనిని మెటల్ రోడ్డుగా మార్చడం ద్వారా చినకాశీరేవు, హిందూ శ్మశానవాటికకు రాకపోకలు సులువవుతాయని, అమృత్ 2.0 కింద పట్టణానికి తాగునీరు అందించే నీటిసేకరణ బావి నిర్మాణానికి మరియు పుష్కర భక్తులకు ఇది ప్రధాన అనుసంధాన రహదారిగా ఉపకరిస్తుంది అని పేర్కొన్నారు. అనంతరం 11వ వార్డులోని రైల్వే స్టేషన్ రోడ్డులో రూ. 1.34 కోట్ల వ్యయంతో నిర్మించిన 265 మీటర్ల సీసీ రోడ్డు, 500 మీటర్ల డ్రెయిన్ మరియు 9 పోల్స్‌తో కూడిన సెంట్రల్ లైటింగ్ ప్రారంభోత్సవ ఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు.రైలు మార్గం ద్వారా నిడదవోలు జంక్షన్‌కు చేరుకునే పుష్కర భక్తులకు, చినకాశీరేవు ఘాట్‌కు వెళ్లే యాత్రికులకు మరియు రాజమహేంద్రవరం వైపు నుండి వచ్చేవారికి ఈ డివైడర్ రోడ్డు మరియు లైటింగ్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని స్పష్టం చేశారు.ఆ తర్వాత వివిధ శాఖల అధికారులతో కలిసి అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చినకాశీరేవులోని శివాలయాన్ని సందర్శించారు. త్వరలోనే నిధులు సమకూర్చి సంబంధిత ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... 2027 గోదావరి పుష్కరాలకు వచ్చే లక్షలాదిమంది భక్తులకు అత్యుత్తమ మౌలిక వసతులు కల్పించేందుకు రూ. 7 కోట్లతో ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నామని వెల్లడించారు. అందులో భాగంగా రూ. 2.50 కోట్ల వ్యయంతో నిడదవోలులోని 11 ప్రధాన ఘాట్లను ఆధునీకీకరించి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు.రూ.1.45 కోట్ల అంచనాతో ప్రధాన రహదారులు, అప్రోచ్ రోడ్ల నిర్మాణ పనులు , రూ. 20 లక్షలతో భక్తుల వాహనాల నిలిపివేతకై 6 విశాలమైన పార్కింగ్ ఏరియాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ. 1 కోటి వ్యయంతో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పనుల్లో భాగంగా 34 టాయిలెట్ల నిర్మాణం, రూ. 90 లక్షలతో సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులు, రూ. 50 లక్షలతో నిడదవోలు పట్టణ వ్యాప్తంగా సెంట్రల్ విద్యుత్ దీపాలంకరణ, రూ. 45 లక్షలతో తాగునీటి సరఫరా కోసం 2 బోర్‌వెల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి దుర్గేష్ వివరించారు.రూ.30 లక్షలతో చినకాశీరేవు వద్ద భక్తులకు త్రాగునీటి సౌకర్యంతో పాటు స్నానాలకు షవర్స్, రూ.1.25 కోట్లతో పిండ ప్రదానం షెడ్లు, ఘాట్ల ఆధునికీకరణ, రూ.30 లక్షలతో ఫ్లోరింగ్, రివర్ ఫ్రంట్ పార్క్ అభివృద్ధి తదితర పనులు చేస్తున్నామన్నారు. చినకాశీరేవు వద్ద రూ.4.47 కోట్ల రైల్వే నిధులతో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

**అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టులో భాగంగా రూ. 3.69 కోట్లతో టూరిజం హబ్ గా నిడదవోలు**

**కేంద్ర ప్రభుత్వ నిధులు మరియు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రూ. 3.69 కోట్ల అంచనాతో నిడదవోలు ప్రాంతాన్ని అఖండ గోదావరి ప్రాజెక్టులో అంతర్భాగం చేసినట్లు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ముఖ్యంగా చినకాశీరేవులోని 3 ఘాట్లలో పర్యాటక శాఖ ద్వారా శాస్కి స్కీమ్ లో భాగంగా రూ. 24 లక్షలతో దివ్యమైన 'గోదావరి హారతి' నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శెట్టిపేట వద్ద గోదావరి కెనాల్‌లో బోటింగ్, వే-సైడ్ రెస్టారెంట్, చిన్నారులకు ప్లే జోన్, పచ్చదనంతో కూడిన గ్రీనరీ,లిఫ్ట్ సౌకర్యంతో కూడిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయన్నారు. అదే విధంగా శెట్టిపేట వద్ద 'టూరిజం హరిత రిసార్ట్స్ ' ఏర్పాటుతో పాటు చినకాశీరేవులోని పలు దేవాలయాల ఆధునికీకరణ, తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ ఆలయంలో భక్తులకు వసతి సౌకర్యాలతో పాటు అన్నదాన సత్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల దూరదృష్టి కలిగిన నాయకత్వంలో, కేంద్ర ప్రభుత్వ విశేష భాగస్వామ్యంతో నిడదవోలు నియోజకవర్గ పరిధిలోని 7 ప్రధాన ఘాట్లతో పాటు ఇరిగేషన్ శాఖతో చర్చించి ఖండవల్లి, మల్లేశ్వరం ఘాట్లను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు.. చినకాశీరేవును దివ్యమైన ఆధ్యాత్మిక కేంద్రంగా, నిడదవోలును సుందర పర్యాటక నిలయంగా మారుస్తామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.**

**అధునాతన సౌకర్యాలతో మోడల్ స్టేషన్‌గా నిడదవోలు రైల్వే జంక్షన్:మంత్రి దుర్గేష్**

**నిడదవోలు రైల్వే జంక్షన్‌ను ప్రయాణికులకు అత్యాధునిక మౌలిక వసతులతో అందుబాటులోకి తీసుకువస్తున్నందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిడదవోలు రైల్వే స్టేషన్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్కలేటర్లు, ప్లాట్‌ఫారమ్‌లు మరియు ఇతర ప్రజా సౌకర్యాలను మంత్రి దుర్గేష్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్కలేటర్‌పై ప్రయాణించి స్టేషన్ అంతటా కలియదిరిగి అధికారులతో మాట్లాడారు.నిడదవోలు పట్టణం పరిసర ప్రాంత ప్రజలకు రైల్వే జంక్షన్ అత్యంత కీలకమైన కేంద్రమని పేర్కొన్నారు. మున్సిపాలిటీ ప్రత్యేక చొరవతో రైల్వే స్టేషన్‌కు అనుసంధానంగా ఉన్న అప్రోచ్ రోడ్డు అభివృద్ధి, ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం, ఆకర్షణీయమైన సెంట్రల్ లైటింగ్ ఏర్పాట్లతో రైల్వే స్టేషన్ పరిసరాలు పట్టణానికే శోభ తెచ్చేలా మారుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు.చుట్టుపక్కల అనేక గ్రామాలు, మండలాల ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిడదవోలు జంక్షన్‌లో ప్రధాన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరితో కలిసి ఇప్పటికే రైల్వేశాఖ ఉన్నతాధికారులతో చర్చలు జరిపినట్లు వెల్లడించారు. లోక్‌మాన్య తిలక్ టెర్మినస్ ఎక్స్‌ప్రెస్ రైలు నిడదవోలు స్టేషన్‌లో ఆగేలా ఏర్పాట్లు పూర్తయ్యాయని సెప్టెంబర్ 6వ తేదీన ఈ రైలుకు స్వయంగా జెండా ఊపి ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.విజయవాడ – భువనేశ్వర్ మార్గంలో నడిచే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలును నిడదవోలులో నిలపడం ఇక్కడి ప్రయాణికులకు అత్యంత ఆవశ్యకమని, దీనిపై రైల్వే శాఖకు ఇప్పటికే అధికారికంగా విజ్ఞప్తి చేశామని, త్వరలోనే సానుకూల నిర్ణయం రానుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, మున్సిపల్ అధికారులు మరియు రైల్వే అధికారులు పాల్గొన్నారు.**

# సచివాలయాలకు సిబ్బందిని నియమించాలి.

**పుట్లూరు ఆగష్టు 24 , అనంత జనశక్తి న్యూస్ :**

పుట్లూరు మండలంలోని రెవెన్యూ శాఖలో అవసరమైన సిబ్బంది లేకపోవడంతో మండల పరిధిలోని అనేక గ్రామాల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వి.టి. రామాంజనేయులు తెలిపారు.

ముఖ్యంగా గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వోల) కొరత అధికంగా ఉండటంతో ప్రజల రెవెన్యూ సంబంధిత పనులు, రైతుల భూమి సమస్యల పరిష్కారం ఆలస్యమవుతోందన్నారు. ప్రస్తుతం మండలంలోని గ్రామాలలో రీసర్వే కార్యక్రమం కూడా జరుగుతుండటంతో భూముల సర్వే, రికార్డులు, సరిహద్దులు తదితర సమస్యలు మరింతగా పెరుగుతున్నాయన్నారు.

చిన్నచిన్న పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం పుట్లూరు మండల గౌరవ అధ్యక్షులు బుస గాని చిన్ని కృష్ణుడు యాదవ్, అధ్యక్షులు ఎన్. గోపాలకృష్ణ, కార్యదర్శి సత్తార్ గోపాల్ యాదవ్, రైతు సంఘం మండల కమిటీ నాయకులు బి.ఓబుల్ రెడ్డి, సత్తార్ రమణయ్య యాదవ్, రైతులు చిన్నఓబులపతి, మారుతి, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శివాలయాలలో ప్రత్యేక పూజలు



**యాడికి, ఆగష్టు 24 , అనంత జనశక్తి న్యూస్ :**

మండల కేంద్రంలోని భైరవ కొండపై ఉన్న భైరవ లింగేశ్వర శివాలయంలోను, అయ్యప్ప స్వామి దేవాలయంలో ను ఉన్న కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలోను, భోగలింగేశ్వర స్వామి దేవాలయంలోను, ఉన్నత పాఠశాల వెనుక ఉన్నశ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలోను, కోనలో ఉన్న రామలింగేశ్వరస్వామి దేవాలయంలోను, పలు శివాలయాలలోను సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. శివునికి అభిషేకాలు చేసి, వివిధ పూలమాలతో అలంకరించారు. అర్చనలు చేసి, హారతులను సమర్పిం చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివున్ని దర్శించి, టెంకాయలను సమర్పించారు.కరుణించవయ్యా.........భోలా శంకర అని వేడుకోన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటి సభ్యులు, భక్తులు పాల్గోన్నారు.

# అంగన్వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి శిక్షణ..



**గాండ్లపెంట, ఆగస్ట్,24, అనంత జనశక్తి న్యూస్,**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఐదవ రోజు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని సీడీపీవో ఆదేశాల మేరకు సూపర్వైజర్ మౌలాబి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లకు లింగ సమానత్వం బాలల రక్షణ పోషకాహారం తదితర అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.

చిన్నారుల పట్ల లింగ వివక్షకు తావులేకుండా సమాన అవకాశాలు కల్పించడం, బాలల హక్కులను పరిరక్షించడం, వారికి రక్షణ కల్పించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను శిక్షణలో వివరించారు. అదేవిధంగా పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అవసరమైన పోషకాహారంసమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన అలవాట్లపై అవగాహన కల్పించారు.

టీచర్లు షంషీర్, సూర్య శేఖర్, జయరాం ప్రసాద్, సూపర్వైజర్ మౌలాబి శిక్షణ అందించారు. శిక్షణలో అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందిస్తున్న సేవలు, వారి ఆరోగ్యం, పోషణ, రక్షణకు సంబంధించిన అంశాలను వివరించారు

ఈ కార్యక్రమాన్ని సీడీపీవో నీహారిక సందర్శించి పరిశీలించారు. శిక్షణలో అంగన్వాడీ టీచర్లు చురుకుగా పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

**యాడికి, ఆగష్టు 24, అనంత జనశక్తి న్యూస్ :**

మండల కేంద్రంలోని పాత పోలీస్ స్టేషన్ దగ్గర అమీనా ఆప్టికల్స్ లో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. అమీనా కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నంద్యాల శాంతి రామ్ కంటి ఆసుపత్రి చే ఉచిత కంటి వైద్య శిబిరం ను నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి వివిధ కంటి జబ్బులు ఉన్న 45 మందికి కంటి వైద్య నిపుణులు తిప్పేస్వామి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 18మందికి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఆపరేషన్ల కొరకు వెళ్లే వారికి ఉచిత బస్సు, భోజన వసతి సౌకర్యము ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అమీనా ఆప్టికల్స్ యజమాని సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.



## ఖాద్రి వాకర్ అసోసియేషన్ తొలి కార్యవర్గం ఎన్నిక



**కదిరి ఆగస్టు24 (అనంత జనశక్తి న్యూస్):-**

కదిరిలో పది సంవత్సరాలనుండి నిర్వహిస్తున్న ఖాద్రి వాకర్స్ అసోసియేషన్ కు 11826 తేదీన 129/2026నంబరతో హిందూపూర్ సబ్ రిజిస్టర్ ఖాద్రి వాకర్స్ అసోసియేషన్ ను రిజిస్టర్ సొసైటీగా సర్టిఫై చెయ్యడమైంది.అందులో భాగంగా ఈరోజు కదిరి పట్టణము ఎంజి రోడ్ లోని కన్యాకాపరమేశ్వరి ధ్యాన మందిరంలో ఖాద్రి వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గము ప్రామాణ స్వీకరం చెయ్యడం జరిగినది.

గౌరవఅధ్యక్షులుగా డాక్టర్ ప్రసాద్,ప్రసిడెంట్ డాక్టర్ శ్రీనివాసులు. వైస్ ప్రసిడెంట్ గా డాక్టర్ విద్యా సాగర్. సెక్రటరీగా హెడ్మాస్టర్ భాస్కర్, జాయింట్ సెక్రటరీగా లాయర్ పిడిగు రవీంద్రబాబు ప్రమాణ స్వీకారం చెయ్యడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ప్రముఖ డాక్టర్ శంకరయ్య, డాక్టర్ మదన్ కుమార్ , డాక్టర్ మధుసూదన్ రెడ్డి తో పాటు టీచర్స్ పాల్గొని విజయవంతం చేసారు.

## జ్ఞానజ్యోతి తర్డ్ ఫేస్ అవగాహన సదస్సు



**ప్రభుత్వ జడ్పీహెచ్ ఉన్నత పాఠశాలలో**

**ఆమడగూరు ఆగస్టు 24: ( అనంత జనశక్తి న్యూస్)**

అమడగూరు మండల కేంద్రంలోని స్థానిక జడ్పీ హెచ్ఎస్ స్కూల్ లో,నందు జరిగినటువంటి,విధ్యా శాఖ మరియు శిశు సంక్షేమ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమడగూరు మండల అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి 3 రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా ఐసీడ్స్ ప్రాజెక్ట్ పుట్టపర్తి సీడీపీఓ రెడ్డి రమణమ్మ హాజరు అయినారు. ఈ సందర్భంగా సీడీపీఓ గారు మాట్లాడుతూ ఫ్లన్ ఫండేషనల్ లీటరసీ అండ్ నూమెరేసీ 120 డేస్ లో భాగంగా ఈ 3 రోజుల శిక్షణ అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహించడం జరుగుతుంది అని, ఈ శిక్షణ లో అంగన్వాడీ కార్యకర్తలు ప్రారంభ తరగతులలో ఆటల ఆధారిత అభ్యసన,పిల్లల అభ్యసన లో తల్లిదండ్రులు మరియు సమాజ భాగస్వామ్యం,ప్రారంభ సంవత్సరాలలో అంచనాలు,అంగన్వాడీ కేంద్రాలలో సమ్మిళిత పద్ధతులు మరియు సంరక్షణ అనే అంశాల గురించి నేర్చుకుంటారు అని తెలిపారు. ఐసీడీస్ కార్యకర్తలు మాట్లాడుతూ అంగన్వాడీ స్థాయి నుండే పిల్లలకు మంచి పునాది వేసినట్టు అయితే భవిష్యత్తులో బడికి రాకుండా ఉండడాన్ని తగ్గించవచ్చు అని, పిల్లలు మంచి తెలివితేటలు కలిగి చదువులో రాణిస్తారు అని తెలిపారు. ఈ ట్రైనింగ్ ని ఉపయోగించుకుని అంగన్వాడీ కార్యకర్తలు తమ యొక్క నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని పిల్లలు సమగ్ర అభివృద్ధి కి పునాది వేయాలని కోరినారు. ఈ కార్యక్రమం లో ఐసిడిఎస్, సూపర్వైజర్,గంగాదేవి , డిఆర్పి, ట్రైనింగ్,ఉపాధ్యాయులు ధనుంజయ, చంద్రమోహన్ శ్రీనివాసులు, మండల స్థాయి అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ రమాదేవికి గజమాలతో సత్కారం



**అనంతపురం, ఆగస్టు 24 :అనంత జనశక్తి న్యూస్**

గవర్నర్ కోటాలో నూతనంగా ఎమ్మెల్సీగా ఎంపికైన దలవాయి రమాదేవి, ఆమె భర్త దలవాయి వెంకటనారాయణలను 9వ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ కృష్ణం రఘు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరోసారి బీసీల పక్షపాతి తెలుగుదేశం పార్టీ అని నిరూపించిందన్నారు. మొదటి నుంచి మహిళలను పార్టీ రాజకీయంగా ప్రోత్సహిస్తోందన్నారు. ముఖ్యంగా సీఎం చంద్రబాబు మహిళల ప్రాతినిథ్యం ఎక్కువగా ఉండేలా చూస్తున్నారన్నారు. అలాగే బీసీలకు అత్యధిక అవకాశాలు కల్పించింది కూడా చంద్రబాబేనన్నారు. సామాన్య క్లస్టర్ ఇన్‌ఛార్జిగా ఉన్న మహిళకు, అట్టడుగు వర్గానికి చెందిన వడ్డెర కులానికి ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వడం పట్ల ప్రతి ఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో 5వ డివిజన్ నాయకులు, బూత్ కన్వీనర్లు, య□నిట్ ఇన్‌ఛార్జ్ మారుతీప్రసాద్, కో క్లస్టర్ చంద్రమౌళి, ఆటో య□నియన్ నాయకులు లక్ష్మీనారాయణ, గంపాల్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు కార్పొరేట్ వైద్యమే లక్ష్యం

- 44వ డివిజన్‌లో ఘనంగా నారాయణ ఉచిత వైద్య శిబిరం
- 3 కోట్ల ఆన్ వీల్స్ వాహనంతో ఉచిత సేవలు
- మహబూబ్ ఖాన్ పార్కు వద్ద ఉచిత వైద్య శిబిరం ప్రారంభం
- నెల్లూరు ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయిలో కంటి, దంత వైద్య సేవలు

**నెల్లూరు ఆగస్ట్ 24, అనంత జనశక్తి న్యూస్**



నెల్లూరు ప్రజలకు కార్పొరేట్ ఉచిత వైద్యాన్ని దరి చేరుస్తూ 44వ డివిజన్‌లో బృహత్తర వైద్య శిబిరం సోమవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది.. కలెక్టర్ ఆఫీస్ సమీపంలోని మహబూబ్ ఖాన్ పార్కు వద్ద మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు నారాయణ నేత్రజ్యోతి, నారాయణ దంత సురక్ష ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.నారాయణ ఆసుపత్రి కంటి విభాగపు ప్రొఫెసర్ డాక్టర్ సుధ, స్థానిక నాయకురాలు పార్టీ కార్యకర్తలు పాల్గొని ప్రజలకు వైద్య సేవలను అందించారు.. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి నగర మహిళా అధ్యక్షురాలు కప్పిర రేవతి పాల్గొన్నారు..నెల్లూరు నగరంతో పాటు రూరల్ ప్రాంతాల్లోని పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా ఈ శిబిరాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు కప్పిర రేవతి, డాక్టర్ సుధ తెలిపారు. 44వ డివిజన్‌లో ఈ తరహా శిబిరాన్ని నిర్వహించడం ఇది మూడోసారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ వైద్యం అందుతుందన్నారు. దీనికి తోడు నారాయణ మాతృసేవ పథకం ద్వారా గర్భిణులకు ఉచిత సురక్షిత ప్రసవాలు అందించి చీరసారెలతో కూడిన ప్రత్యేక కిట్లను కూడా అందజేస్తున్నట్లు వివరించారు... ఇప్పటివరకు ఈ పథకాల ద్వారా 11,900మందికి పైగా ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, 7,000 మందికి పైగా నాణ్యమైన కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు, గ్లాకోమా, డయాబెటిక్ రెటినోపతి మరియు తీవ్రమైన దంత సమస్యలు ఉన్నవారిని నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి రిఫర్ చేసి ఉచితంగా చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఈ రోజువారీ శిబిరాల కోసం అన్ని రకాల అధునాతన వైద్య పరికరాలు కలిగిన 3 కోట్ల విలువైన నారాయణ ఆన్ వీల్స్ అందుబాటులో ఉంచామని, స్థానిక ప్రజలందరూ ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు .ఈ కార్యాలయంలో క్లస్టర్ ఇంచార్జ్ పిట్టి నాగేశ్వర రావు ,డివిజన్ ప్రెసిడెంట్ ఏడుకొండలు, ఆర్గనైజింగ్ సెక్రటరీ అశోక్, పార్లమెంట్ అధికార ప్రతినిధి దర్శి హరికృష్ణ, జనరల్ సెక్రెటరీ పాలూరు బ్రహ్మం,కారంశెట్టి మహేష్, వెంకటరమణ,రమేష్ బాబు, స్థానిక టిడిపి నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు .

# సిఏ కోర్స్ పై అవగాహన సదస్సు..

**- చైర్మన్ అరవింద్ రామ.**

**ధర్మవరం ఫిబ్రవరి 24, అనంత జనశక్తి న్యూస్:**



పట్టణంలోని బత్తలపల్లి రోడ్డు పోలా ఫంక్షన్ హాల్ లో మెగా కెరియర్ కౌన్సిలింగ్ ప్రోగ్రాం.. సిఏ కోర్స్ లపై అవగాహన సదస్సును చైర్మన్ అరవింద్ రామ, కార్యదర్శి రశ్మి ఐనాపూర్, కోశాధికారి రాకేష్ గుప్తా, మరొక చైర్మన్ వినోద్, ఈసీ మెంబర్ అండ్ ఇమీడియట్ ఫాస్ట్ చైర్మన్ పని కుమార్ తో పాటు చార్టెడ్ అకౌంటెంట్స్ పోలా రామకృష్ణ, పోష లోకేష్ కుమార్, లక్ష్మి చెన్నకేశవ, ప్రభాకర్ రెడ్డి పాల్గొని ఈ అవగాహన సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశమును ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేశారు. ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి గోపాల్ నాయక్ కూడా పాల్గొన్నారు. అనంతరం ప్రముఖులు, ఎంఈఓ గోపాల్ నాయక్ మాట్లాడుతూ.... వివిధ ప్రాంతాల నుండి 12 ప్రభుత్వ పాఠశాలలు, మూడు ప్రైవేట్ పాఠశాలలు, ఆరు కళాశాలలకు చెందిన సుమారు 1,200 మంది విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా పాల్గొని మంచి స్ఫూర్తిని పొందడం జరిగిందని తెలిపారు. ఈ సదస్సులో సిఏ కోర్స్ యొక్క ప్రాముఖ్యత విద్యార్థులు తమ పదవ తరగతి ఇంటర్మీడియట్ తర్వాత ఈ కోర్సులు ఎందుకు ఎంచుకోవాలి అన్న విషయాన్ని తెలియజేయడం జరిగిందన్నారు. పరీక్షా విధానం ఫీజుల వివరాలు స్కాలర్షిప్లు, భవిష్యత్తులో లభించే అద్భుతమైన ఉపాధి అవకాశాలు గూర్చి నిపుణులుగా సమగ్రంగా వివరించడం జరిగిందని తెలిపారు. దేశంలోనే అత్యున్నతమైన మరియు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ వృత్తి విద్య ద్వారా విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తును ఎలా తీర్చుకోవచ్చో అన్న వాటిపై కూడా పూర్తి వివరణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ అవగాహన సదస్సులో కోర్సు నిర్మాణం, ప్రవేశ మార్గాలు, అద్భుతమైన ఉపాధి అవకాశాలు, ఫీజులు, స్కాలర్షిప్లు, ఎర్న్ వైల్డ్ యు లెర్న్ అన్న వాటిపై వివరణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం కావడానికి అనంతపురం బ్రాంచ్ చైర్మన్ పాలకవర్గ సభ్యులు ప్రత్యేక కృషి చేయడం జరిగిందని తెలిపారు. ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని దేశ ఆర్థిక రక్షకులుగా ఎదగాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం పాల్గొన్న విద్యార్థులందరికీ కూడా పదేపదే కృతజ్ఞతలు తెలియజేశారు.

# మద్యం సేవించి వాహనం నడిపిన ముగ్గురికి రూ.30 వేల జరిమానా



**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 24**

**అనంత జన శక్తి న్యూస్.**

**మద్యం సేవించి వాహనం నడిపిన ముగ్గురు వ్యక్తులకు 30, వేల జరిమానా విధించినట్లు పుట్టపర్తి పోలీసులు తెలిపారు.**

**జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పుట్టపర్తి టౌన్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపడుతున్నారు.**

**మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడిపిన ముగ్గురు వ్యక్తులను పుట్టపర్తి టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని, కేసులు నమోదు చేసి సోమవారం పుట్టపర్తి మెజిస్ట్రేట్ న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. నిందితులు తమ తప్పును అంగీకరించడంతో, గౌరవ న్యాయస్థానం ముగ్గురికీ ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పన మొత్తం రూ.30,000 జరిమానా విధించిందనీ,**

**ఈ సందర్భంగా పుట్టపర్తి టౌన్ సీఐ యువరాజు మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. మద్యం సేవించిన అనంతరం వాహనాలు నడపకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడే వారిపై పోలీస్ శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ యువరాజు హెచ్చరించారు.**

# 50డివిజన్లు, 4పంచాయతీల్లో మా అభివృద్ధి కనిపిస్తోంది

- గత ఐదేళ్లలో మీరేం చేశారో చెప్పండి ఎమ్మెల్యే దగ్గుపాటి
- కమలానగర్ లో ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమం
- నగరాభివృద్ధిపై హర్షం వ్యక్తం చేసిన వ్యాపారులు
- త్వరలో 160 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్న ఎమ్మెల్యే

**అనంతపురం ఆగస్ట్ 24, అనంత జనశక్తి న్యూస్**



రెండేళ్లలో మేము చేసిన అభివృద్ధి 50 డివిజన్లు, 4 పంచాయతీల్లో కనిపిస్తోందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. గత ఐదేళ్లలో వైసిపి నాయకులు ఏం చేశారో సమాధానం చెప్పాలన్నారు. నగరంలోని కమలా నగర్ లో ఆయన ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. డీసీఎంఎస్ కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన కూటమి నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి రెండేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కమలా నగర్ లోని డిసిఎంఎస్ కొట్టాలు నందు ప్రజలతో మాట్లాడారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా రెండేళ్లలో నగరం అభివృద్ధి చెందుతోందని ప్రజలు, కమలానగర్ లోని వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ రెండేళ్లలో అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 1296 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. 250 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతులు కల్పించమన్నారు. మరో 160 కోట్లతో త్వరలోనే పనులు ప్రారంభిస్తున్నట్లు వివరించారు. అనంతపురం నియోజకవర్గంలో ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమం 85 శాతం పూర్తయిందన్నారు. మరోవైపు అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ హామీలను అమలు చేసినట్టు వివరించారు. మొదటి ఐదు సంతకాల్లో పింఛన్లు పెంచమన్నారు. గతంలో వెయ్యి రూపాయలు పెంచేందుకు జగన్మోహన్ రెడ్డికి ఐదేళ్లు పట్టిందన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్క సంతకంతోనే పింఛన్లు పెంచి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. తల్లికి వందనం గతంలో ఇంట్లో ఎంతమంది ఉన్న అందరికీ ఇస్తామని చెప్పి జగన్ రెడ్డి మోసం చేశారన్నారు. ఇప్పుడు రికార్డు స్థాయిలో తల్లికి వందనం కింద సాయం చేస్తున్నట్లు వివరించారు. విద్యాశాఖలో మంత్రి లోకేష్ అనేక మార్పులు తీసుకు రావడం వల్ల ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు చేరుతున్నారన్నారు. కేవలం ఎన్టీఆర్, చంద్రబాబుకు మంచి పేరు వస్తుం [illegible] [illegible]గి ముఖ్యమంత్రి చంద్రబాబు వాటిని తిరిగి తెరిపించి కేవలం ఐదు రూపాయలకే మూడు పూటలా భోజనం అందిస్తున్నారని ఎమ్మెల్యే వివరించారు. రాయలసీమలో కూడా గతంలో ఎప్పుడు లేని విధంగా పారిశ్రామికాభివృద్ధి జరుగుతోందన్నారు. హార్టికల్చర్ హబ్ కోసం 40 వేల కోట్లు కేటాయించారని... పిపిపి మోడల్ లో మరో 60 వేల కోట్ల రూపాయలు తీసుకొస్తున్నారని చెప్పారు. ఒక అనంతపురం జిల్లాలోని లక్ష కోట్ల వరకు పెట్టుబడులు వచ్చాయన్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కియా పరిశ్రమ తీసుకొచ్చారని గత ఐదేళ్లలో ఏ ఒక్క పరిశ్రమ కూడా అనంతపురం జిల్లాకు రాలేదని ఎమ్మెల్యే అన్నారు. పుట్టపర్తిలో 5వ జనరేషన్ కు చెందిన యుద్ధ విమానాలు తయారు చేసే పరిశ్రమలు కూడా వచ్చిందన్నారు. సిబిఎన్ బ్రాండ్ తో మంత్రి నారా లోకేష్ కృషి వలన ఇన్ని పెట్టుబడులు వస్తున్నాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వివరించారు.

# బాలల బీమా చెక్కులు పంపిణీ చేసిన జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్



**అనంతపురం, ఆగస్టు 24,**

**అనంత జనశక్తి న్యూస్**

**అనంతపురం జిల్లా సమగ్ర శిక్ష, విద్యాశాఖఆధ్వర్యంలో బాలల భీమా పథకం ద్వారా మంజూరైన నగదును చెక్కు రూపంలో ఆయా విద్యార్థుల బాధిత కుటుంబాలకు జిల్లా జాయింట్ కలెక్టర్ సి .విష్ణు చరణ్ స్థానిక జిల్లా కలెక్టరేట్ లో సోమవారం ఉదయం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ బాలల బీమా పథకం ద్వారా ఒక్కొక్క కుటుంబానికి రూ. 25000 చొప్పన అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు ఒక ఏడాదికి కేవలం రూ. 5 లు విద్యార్థి పేరు మీద బాలల బీమా పథకం చేయిస్తే వివిధ ప్రమాదాలు, పాముకాటు తదితర సంఘటనల్లో మృతి చెందిన విద్యార్థులకు ఈ ఇన్సూరెన్స్ పథకం వర్తిస్తుందని అందువల్ల 1 నుండి 10 తరగతి వరకు చదివే విద్యార్థులకు బాలల బీమా పథకం లో నమోదు చేయించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూచించారు. ప్రత్యేకంగా మన జిల్లాలో పేద ప్రజల కుటుంబాలకు ఈ పథకం ఉపయోగపడుతున్నట్లు తెలిపారు.**

**విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి....**

**అరుణ్ తేజ (8వ తరగతి) కొత్తకోట గ్రామం వజ్రకరూర్ మండలం, మణికంఠ చౌదరి (8 తరగతి) రాయలప్ప దొడ్డి బ్రహ్మసముద్రం మండలం, ప్రణయ్ (2 తరగతి ) శ్రీరంగాపురం బెలుగుప్ప మండలం .**

**ఈ కార్యక్రమంలో సర్వ శిక్ష ఏపీసి శైలజ, డిఈ జయరాం సీఎమ్ఓ చంద్రశేఖర్, జి సి డి ఓ కవిత, ఎస్ ఏ ఉమ్మి సల్మా తదితరులు పాల్గొన్నారు.**

# విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అందుకునేలా ప్రోత్సహించాలి



- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

అనంతపురం, ఆగస్టు 24 : అనంత జనశక్తి న్యూస్

ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు తమ వంతు బాధ్యతగా విద్యార్థులను విలువలతో కూడిన విద్యను అందుకునేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో 8 లీప్ (LEAP) పాఠశాలలకు చెందిన హెడ్మాస్టర్లు, మండల విద్యాశాఖ అధికారులు, ఉన్న ఎక్స్పర్ట్ టీచర్లకు బెంగళూరు నుంచి వచ్చిన ILP ప్రతినిధులు, విలువల బడి ప్రతినిధి లెనిన్ బాబు అవగాహన కల్పించారు. లీప్ పాఠశాలలకు ఎలాంటి ఇన్ఫ్రా సౌకర్యాలు కావాలి, ల్యాబ్ లు, సాంకేతిక పరికరాలు, ఆధునిక సౌకర్యాలు, క్రీడా సౌకర్యాలు, సాంకేతిక విద్యను బోధించడానికి కావలసిన పరికరాలు వంటి వివరాలు హెడ్మాస్టర్లను అడిగి తెలుసుకోవడం జరిగింది. విద్యార్థుల్లో చదువుపట్ల అవగాహన పెంపొందించడం, సాంకేతిక అంశాలను విద్యార్థులకు పరిచయం చేయడం, సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించడం, మినిమం లెవెల్స్ విద్యార్థుల్లో పెంపొందించడం ఎలా వంటి అంశాల మీద అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హెడ్మాస్టర్లు మరియు మండల విద్యాశాఖ అధికారులు తమ పాఠశాలగా భావించి విద్యార్థులను తీర్చిదిద్దాలని, లీప్ పాఠశాలలు అంతర్జాతీయ ప్రమాణాలతో మంగళగిరి నియోజకవర్గంలోని నిడమానూరులో తయారుచేసిన విధంగా మన జిల్లాలో 8 లీప్ స్కూల్స్ అత్యుత్తమంగా తయారు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని తెలియజేశారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు తమ వంతు బాధ్యతగా విద్యార్థులను విలువలతో కూడిన విద్యను అందుకునేలా ప్రోత్సహించాలని ఆదేశించారు.

**అనంతపురం జిల్లాలో LEAP పాఠశాలలు :**

అనంతపురం నియోజకవర్గం గవర్నమెంట్ హై స్కూల్ న్యూ టౌన్ బాయ్స్, అనంతపురం.రాప్తాడు నియోజకవర్గం జిల్లా పరిషత్ హై స్కూల్, ఆత్మకూరు. ఉరవకొండ నియోజకవర్గం S.K గవర్నమెంట్ హై స్కూల్, ఉరవకొండ.కళ్యాణదుర్గం నియోజకవర్గం జిల్లా పరిషత్ హై స్కూల్ గర్ల్స్, కళ్యాణదుర్గం.రాయదుర్గం నియోజకవర్గం జిల్లా పరిషత్ హై స్కూల్, డి. హీరేహాల్.సింగనమల నియోజకవర్గం గవర్నమెంట్ హై స్కూల్ బాయ్స్, నార్పల.తాడిపత్రి నియోజకవర్గం జిల్లా పరిషత్ హై స్కూల్, యాడికి.గుంతకల్లు నియోజకవర్గం SJP గవర్నమెంట్ హై స్కూల్, గుంతకల్లు. మంగళగిరి నియోజకవర్గంలోని నిడమానూరు లీప్ పాఠశాలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దిన విధంగా మన అనంతపురం జిల్లాల్లో పైన పేర్కొన్న ఎనిమిది లీప్ పాఠశాలలను తీర్చిదిద్దుతామని డీఈఓ ఆయుబ్ హుస్సేన్, ఏపిసి శైలజ తెలియజేశారు. అంతర్జాతీయ పాఠశాలల్లో ఉన్న అన్ని అంశాలను ఈ పాఠశాలల్లో తీసుకువస్తున్నామని తెలిపారు. ఆస్ట్రో ల్యాబ్స్ కోసం ఆర్కిటెక్ట్ డిజైన్లు కంప్లీట్ అయ్యాయని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో అదనపు తరగతి గదుల నిర్మాణం, ల్యాబ్స్, వాకింగ్ పాత్ లు మరియు రన్నింగ్ పాత్ లు, క్రీడా మైదానాలు వంటివి నిర్మించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డివైఈఓలు శ్రీనివాసరావు, లక్ష్మన్న, సమగ్ర శిక్ష సీఎంవో చంద్రశేఖర్, అలెస్కో రామచంద్ర, ఏపీవో నారాయణస్వామి, 8 మండలాల 1, 2 ఎంఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

## హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న జనసైనికుడికి మంత్రి పరామర్శ - మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం



రాజమహేంద్రవరం ఆగస్టు 24, అనంత జనశక్తి న్యూస్

ఇటీవల హార్ట్ స్ట్రోక్ కు గురై రాజమహేంద్రవరంలోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిడదవోలు నియోజకవర్గం నిడదవోలు రూరల్ మండలం తాడిమళ్ళ గ్రామానికి చెందిన జనసైనికుడు తిరుమల్ల కరుణాకర్ ను మంత్రి కందుల దుర్గేష్ సోమవారం ఆస్పత్రికి వెళ్లి స్వయంగా పరామర్శించారు.ఆస్పత్రిలోని చికిత్స పొందుతున్న కరుణాకర్ వద్దకు వెళ్లిన మంత్రి దుర్గేష్ ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి అందించాల్సిన వైద్యసేవల గురించి ఆరా తీశారు. కరుణాకర్‌కు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.పేద కుటుంబానికి చెందిన జనసైనికుడికి ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా అవసరమైన పూర్తి వైద్య సాయాన్ని తక్షణమే అందించేలా చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి వర్గాలను ఆదేశించారు. కరుణాకర్ త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. తమ కష్టకాలంలో మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా వచ్చి పరామర్శించి, మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవడం పట్ల కరుణాకర్ కుటుంబ సభ్యులు మరియు స్థానిక జనసైనికులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# పిజిఆర్ఎస్ అర్జీలను ప్రత్యేక దృష్టి పెట్టి గడువులోగా పరిష్కరించాలి

- నిర్లక్ష్యం ఉండరాదు..
- ఐవిఆర్ఎస్ ఫీడ్బ్యాక్ కు సంబంధించి సానుకూల ప్రజా దృక్పథాన్ని మరింత మెరుగుపరచాలి..
- : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

అనంతపురం, ఆగస్టు 24 :అనంత జనశక్తి న్యూస్



అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించగా.. ఇందులో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అర్జీలను స్వీకరించారు.జిల్లా కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డిఆర్ఓ ఏ.మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, మల్లికార్జున రెడ్డి, కిరణ్మయి, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 500 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించడం జరిగింది. అందులో రెవెన్యూ క్లినిక్ కు సంబంధించి 236 అర్జీలు, ఇతర అర్జీలు 264 రావడం జరిగింది. ఇందులో అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలకు వెంటనే పరిష్కారం చూపించాలని అధికారులకు అక్కడికక్కడే జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ లో వచ్చిన అర్జీలను ప్రత్యేక దృష్టి పెట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. అర్జీలను అత్యంత నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు ప్రతిరోజు అర్జీలపై శ్రద్ధ పెట్టి అర్జీల పరిష్కారంపై ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని ఆదేశించారు. అర్జీలను ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా పరిష్కరించడం చేయాలని, క్షుణ్ణంగా పరిశీలించి వాటికి సత్వరమే పరిష్కారం చూపించాలని, ఇందులో ఎలాంటి అలసత్వం చూపించరాదని ఆదేశించారు.ఐవిఆర్ఎస్ ఫీడ్బ్యాక్ కు సంబంధించి పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని, వ్యతిరేకతను తగ్గించాలని ఆదేశించారు. ఏపీఎస్ఆర్టీసీ పరిధిలో ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ లో మరింత పురోగతి తీసుకురావాలన్నారు. ఉరవకొండ, బుక్కరాయసముద్రం, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్లను ప్రతిరోజు ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటలలోపు ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు తనిఖీ చేసేలా వారికి తెలియజేయాలని డిపిఓని ఆదేశించారు.డ్వామా పరిధిలో విబిజి రామ్ జీ కింద గుంతలేని రహదారులను ఏర్పాటు చేసేందుకు పైలట్ గ్రామాలుగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున గ్రామాలను ఎంపిక చేసి అక్కడ గుంతలను పూడ్చే పనుల కోసం ప్రతిపాదనలు పంపి మంజూరులు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఆయా పీహెచ్సీలు, సిహెచ్‌లలో డాక్టర్లు సమయానికి అందుబాటులో ఉండడం లేదని, ఆయాచోట్ల ఏ సమయంలో డాక్టర్లు అందుబాటులో ఉంటారనే సమయాలను తెలిపేలా బోర్డులు ఉండాలన్నారు. ప్రతిరోజు స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాలలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని, ఈ విషయమై గ్రామాల్లో టామ్ టామ్ వేయించాలని, ప్రజలకు తెలియజేయాలని జి.ఎస్.డబ్ల్యూ.ఎస్ జిల్లా అధికారిని ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులు సచివాలయానికి వచ్చే ప్రజలతో మర్యాదగా మాట్లాడాలని, మధ్యాహ్న సమయంలో సచివాలయాలను మండల స్థాయి అధికారులు తనిఖీలు చేయాలని, అక్కడ ఉద్యోగుల అందుబాటులో లేకపోతే చర్యలు తీసుకోవాలన్నారు. పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ మరింత పెంచేలా ఆయా శాఖల జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీఎస్పిడిసిఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, డిటిసి వీర్రాజు, జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, డ్వామా పిడి సలీమ్ భాష, జడ్పి సిఈఓ విజయలక్ష్మి, డిపిఓ నాగరాజునాయుడు, డిఆర్డీఏ పిడి శైలజ, బిసి వెల్ఫేర్ డిడి ఖుష్బూకొఠారి, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్చంద్, ఏపిఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీలక్ష్మి, ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ గంగాధర్ రెడ్డి, ఎల్డిఎం మారుతి శ్రీనివాసులు, జిఎస్డబ్ల్యూఎస్ జిల్లా అధికారి నాసరరెడ్డి, ఏపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, డిటిడబ్ల్యుఓ శ్రీనివాసరావు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆర్ఐఓ వెంకటరమణ నాయక్, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, సెక్షన్ సూపరింటెండెంట్లు, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ స్పోర్ట్స్‌లో పీవీకేకేఐటీ ఎన్‌సీసీ క్యాడెట్ ప్రతిభ



అనంతపురం ఆగస్టు 24, అనంత జనశక్తి న్యూస్

పీవీకేకే ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ఎన్సీసీ క్యాడెట్ పి. సింధు ప్రతిష్ఠాత్మక వాటర్ స్పోర్ట్స్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లా పొంగ్ డ్యామ్ ప్రాంతీయ వాటర్ స్పోర్ట్స్ శిక్షణ కేంద్రంలో ఆగస్టు 11 నుంచి 20 వరకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.అటల్ బిహారీ వాజ్‌పేయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అలైడ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో, న్యూఢిల్లీలోని ఎన్సీసీ డైరెక్టరేట్ జనరల్ ప్రాయోజకత్వంతో శిక్షణ కొనసాగింది. ఇందులో ఈత, కయాకింగ్, కానోయింగ్, సెయిలింగ్, నది దాటడం, ట్రెక్కింగ్ తదితర జల, సాహస క్రీడల్లో క్యాడెట్ సింధు శిక్షణ పొందారు.ఈ సందర్భంగా పి. సింధును కళాశాల చైర్మన్ డా. పల్లె కిషోర్, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. బండి రమేష్ బాబు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. కె. మనోహర్ రెడ్డి, అనురాగ్, ఎన్సీసీ సీటీఓ బి. సురేష్ తదితరులు అభినందించారు. ఎన్సీసీ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సాహస స్ఫూర్తి, దేశ సేవా భావన పెంపొందించేందుకు కళాశాల యాజమాన్యం నిరంతరం ప్రోత్సహిస్తోందని వారు తెలిపారు. ప్రతిష్ఠాత్మక శిక్షణ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించిన కళాశాల యాజమాన్యానికి క్యాడెట్ సింధు కృతజ్ఞతలు తెలిపారు.

# కడప బేసిన్‌లో లక్షల కోట్ల విలువైన ఖనిజ నిక్షేపాలు

- కీలక ఖనిజాల అన్వేషణకు సీఎస్ఐఆర్–ఎన్జీఆర్ఐతో ఏపీ ప్రభుత్వం చారిత్రాత్మక ఒప్పందం

హైదరాబాద్, ఆగస్టు 24:అనంత జనశక్తి న్యూస్



కడప బేసిన్‌ను దేశంలోని కీలక ఖనిజాల ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణ కోసం గనులు, భూగర్భ వనరుల శాఖ హైదరాబాద్‌కు చెందిన సీఎస్ఐఆర్-నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం చారిత్రాత్మకమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.హైదరాబాద్‌లో నిర్వహించిన కీలక ఖనిజాల పరిశోధన, అభివృద్ధి సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం పరిశోధనా కేంద్రంలోని భూకంప శాస్త్రం, ఆధునిక ఖనిజ విశ్లేషణ, భూతాప పరిశోధన ప్రయోగశాలలను పరిశీలించారు.మంత్రి వివరాల ప్రకారం.. కడప జిల్లా వెంపల్లె పరిధిలోని తుమ్మలపల్లె ప్రాంతంలో లిథియం, గాలియం వంటి వ్యూహాత్మక ఖనిజాల నిక్షేపాలు ఉన్నట్లు శాస్త్రీయ పరిశోధనల్లో వెల్లడైంది. వెంపల్లె భూగర్భ నిర్మాణంలో సుమారు రూ.13 లక్షల కోట్లకు పైగా విలువైన నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించగా, ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు రూ.2 లక్షల కోట్ల విలువైన లోహాలు ఉండే అవకాశం ఉందని తెలిపారు. భూగర్భంలో లిథియం సాంద్రత 1000 పీపీఎం వరకు, గాలియం 250 పీపీఎం వరకు ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు.ఈ నిక్షేపాల పూర్తి స్థాయి అన్వేషణ, వెలికితీతకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక సిద్ధం చేస్తోందని మంత్రి తెలిపారు. 2027లో ప్రారంభమయ్యే అన్వేషణ కార్యక్రమాన్ని 2032 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఐదేళ్ల ప్రాజెక్టుకు అయ్యే వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్ భరించనుందని, దీంతో రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం ఉండదని వివరించారు.ఖనిజ నిక్షేపాల విస్తరణ, లోతు, పరిమాణాన్ని గుర్తించేందుకు వైమానిక భూభౌతిక సర్వేలు, ఉపగ్రహ ఆధారిత పరిశీలనలు, కృత్రిమ మేధ, యంత్ర అభ్యసనం, త్రీడీ భూగర్భ నమూనాల రూపకల్పన వంటి ఆధునిక సాంకేతికతలను వినియోగించనున్నట్లు తెలిపారు.విద్యుత్ వాహనాలు, అర్ధవాహకాలు, అధునాతన ఎలక్ట్రానిక్స్, అంతరిక్ష, రక్షణ రంగాల్లో లిథియం, గాలియం వంటి కీలక ఖనిజాలకు ప్రపంచవ్యాప్తంగా భారీ డిమాండ్ ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం వీటి కోసం భారత్ దిగుమతులపై ఆధారపడుతున్న నేపథ్యంలో కడపలోని నిక్షేపాల అభివృద్ధి దేశానికి వ్యూహాత్మకంగా ఎంతో కీలకమన్నారు.ఖనిజాల వెలికితీతతో పాటు రాష్ట్రంలోని తీరప్రాంతం, ఓడరేవులు, అనుకూల పారిశ్రామిక విధానాలను వినియోగించుకుని ఖనిజ శుద్ధి, శుద్ధీకరణ, బ్యాటరీల తయారీ వంటి అనుబంధ పరిశ్రమలను రాష్ట్రంలోనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. తద్వారా స్థానికంగా భారీగా ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికంగా మరింత బలోపేతం అవుతుందని అన్నారు.కార్యక్రమంలో సీఎస్ఐఆర్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ కుమార్, శాస్త్రవేత్త డాక్టర్ బి. శ్రీనివాస్‌తో పాటు గనులు, భూగర్భ శాస్త్ర నిపుణులు, అధికారులు పాల్గొన్నారు.

## ముగ్గురు నవజాత శిశువులు మృతి!

- వెంటిలేటర్ పేలి అగ్నిప్రమాదం
- మహారాష్ట్రలోని ఆసుపత్రిలో ఘటన
- ఆరుగురి పరిస్థితి అత్యంత విషమం

న్యూఢిల్లీ, అనంత జనశక్తి న్యూస్

మహారాష్ట్రలోని అమరావతి జిల్లా ప్రభుత్వ మహిళా ఆసుపత్రిలో సోమవారం 3.30 గంటల ప్రాంతంలో ఓ ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. మూడో అంతస్తులోని ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగం (ఎస్ఎన్సీయూ)లోని వెంటిలేటర్ ఒక్కసారిగా పేలిపోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో వెంటిలేటర్‌లో ఉంచిన నవజాత శిశువలకు తీవ్ర గాయాలు కాగా.. అక్కడ అలుముకున్న దట్టమైన పొగను పీల్చడం వల్ల ముగ్గురు నవజాత శిశువులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

**తెల్లవారుజామునే అగ్నిప్రమాదం..**

సోమవారం 3.30 గంటల ప్రాంతంలో ఆసుపత్రి మూడో అంతస్తులోని వార్డులో ఉన్న వెంటిలేటర్ పేలిపోవడంతో ఒక్కసారిగా అగ్నికీలలు ఎగసిపడ్డాయి. ప్రమాదం జరిగే సమయానికి ఆ విభాగంలో దాదాపు 39 మంది నవజాత శిశువులు చికిత్స పొందుతున్నారు. మంటలు వ్యాపించడాన్ని గమనించిన ఆసుపత్రి వైద్యులు, నర్సులు, ఇతర సహాయక సిబ్బంది తక్షణమే స్పందించి తీవ్రంగా శ్రమించారు. పసిపాపలకు అమర్చిన వైద్య పరికరాలను వెంటనే తొలగించి.. ప్రమాద స్థలం నుంచి వారిని సురక్షిత ప్రాంతాలకు ఖాళీ చేయించారు. ఈ ప్రమాదంలో ముగ్గురు నవజాత శిశువులు దట్టమైన పొగను పీల్చుకుని ప్రాణాలు కోల్పోగా.. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. అయితే వీరి పరిస్థితి అత్యంత విషమంగా ఉండడంతో.. వెంటనే వారిని మెరుగైన వైద్యం కోసం సమీపంలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి త అత్యవసరంగా తరలించారు.

**ఉన్నత స్థాయి విచారణకు ఆదేశం**

ఈ పేలుడు గురించి తెలిసిన వెంటనే డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) సహా ఉన్నతాధికారులు ఆసుపత్రి వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ దారుణ ఘటనకు దారితీసిన పరిపాలనాపరమైన లోపాలపై పూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు స్థానిక యంత్రాంగం ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. ఈ విషాదంపై అమరావతి జిల్లా ఇన్చార్జ్ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి చంద్రశేఖర్ బావన్కులే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన పసిపాపల కుటుంబాలకు తన గాఢ సానుభూతిని తెలిపారు. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ఈ తీరని లోటును తట్టుకునే శక్తిని ఆ దేవుడు తల్లిదండ్రులకు ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు.



# యువ వాలంటీర్ దరఖాస్తుల గడువు ఆగస్టు 27 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ, ఆగస్టు 24:అనంత జనశక్తి న్యూస్

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మేరా యువ భారత్ (మై భారత్) సంస్థ యువ వాలంటీర్ల ఎంపికకు దరఖాస్తుల గడువును ఆగస్టు 27, 2026 వరకు పొడిగించినట్లు ప్రకటించింది.నేషనల్ యూత్ కార్ప్స్ పరిధిలో చేపడుతున్న ఈ దేశవ్యాప్త నమోదు కార్యక్రమం ద్వారా జాతీయ అభివృద్ధి, సామాజిక సంక్షేమ కార్యక్రమాల్లో యువతను భాగస్వామ్యం చేయనున్నారు.

**అర్హతలు ఇవే..**

18 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పూర్తికాల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు కారు. గతంలో జాతీయ యువ వాలంటీర్లుగా పనిచేసి పదవీకాలం పూర్తికాకముందే మధ్యలో వైదొలిగినవారు, ఇప్పటికే తమ పదవీకాలాన్ని పూర్తిచేసినవారు తిరిగి మై భారత్ యువ వాలంటీర్లుగా ఎంపిక కావడానికి అర్హులు కాదని అధికారులు తెలిపారు.

**ఎంపిక విధానం**

సంబంధిత జిల్లా యువ అధికారి అధ్యక్షతన ఇద్దరు స్థానిక ప్రముఖ రంగ నిపుణులతో కూడిన జిల్లా స్థాయి ఎంపిక కమిటీ ద్వారా వాలంటీర్ల ఎంపిక జరుగుతుంది. నిర్దేశిత మై భారత్ కేంద్ర జిల్లాల్లో ప్రతి మండలానికి ఇద్దరు యువ వాలంటీర్లను నియమిస్తారు. ప్రస్తుతం మై భారత్ కేంద్రాలు లేని కొత్త జిల్లాలకు ముగ్గురు వాలంటీర్లను కేటాయిస్తారు. కంప్యూటర్, పత్రాల నిర్వహణలో నైపుణ్యం ఉన్న మరో ఇద్దరు వాలంటీర్లను ప్రతి మై భారత్ కేంద్ర స్థాయిలో నియమించనున్నారు.ఎంపికైన వారికి 2026-27 సంవత్సరానికి పదవీకాలం ఉంటుంది. పనితీరు ఆధారంగా మరో ఏడాది పొడిగించే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ విధానాలు, యువజన కార్యక్రమాలు, సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే సామర్థ్యం అభ్యర్థులకు ఉండాలి.ఎంపికైన ప్రతి వాలంటీర్‌కు నెలకు రూ.5,000 గౌరవ వేతనం అందజేస్తారు. వయోపరిమితిని ప్రాథమిక నియామక ప్రకటనలో పేర్కొన్న నిర్ణీత తేదీ ఆధారంగా లెక్కిస్తారు.అర్హత కలిగిన యువత ఆగస్టు 27, 2026లోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.



దరఖాస్తు కోసం: https://nyks.nic.in/nycapp/strmainnycapp.asp
మరిన్ని వివరాలు, సందేహాల నివృత్తి కోసం అభిరామ్‌ను 6304283460 నంబర్‌లో సంప్రదించవచ్చు. mybharatandhrapradesh@gmail.comకు ఈమెయిల్ ద్వారా కూడా సమాచారం పొందవచ్చు.

అనంత జనశక్తి
మంగళవారం | అనంతపురం
25.08.2026



# ఆత్మకథగా రజనీకాంత్ జీవిత ప్రయాణం.. అధికారికంగా ప్రకటించిన కుమార్తె



అగ్ర కథానాయకుడు రజనీకాంత్ తన జీవిత ప్రయాణాన్ని ఆత్మకథ రూపంలో అభిమానులతో పంచుకోనున్నారు. తాజాగా ఈ విషయాన్ని ఆయన కుమార్తె, దర్శకురాలు సౌందర్య వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె.. తాను కూడా ఆ పుస్తకం రాసే పనిలో పాల్గొన్నట్లు తెలిపారు. "నాన్నగారు తన ఆత్మకథ రాస్తున్నారు. ఆ పుస్తకాన్ని ఎలా రూపుదిద్దుతున్నారో నేను దగ్గర ఉండి చూశా. ఇది చాలా ఏళ్ల పాటు పాఠకులు మళ్లీ మళ్లీ చదివే పుస్తకంగా నిలుస్తుందని నమ్ముతున్నా. యోగి పరమహంస యోగానంద గారు రాసిన 'ఒక యోగి ఆత్మకథ' పుస్తకం తరతరాలకు ఎంత స్ఫూర్తినిస్తుందో మా నాన్నగారి కథ కూడా అలాగే ఉంటుంది. భారతీయ చిత్ర పరిశ్రమలో అతిపెద్ద నటులలో ఒకరిగా ఎదిగిన ఆయన ప్రయాణం సామాన్యమైంది కాదు. ఐదు దశాబ్దాలుగా ఆయన వ్యక్తిగత అనుభవాలు, వృత్తిపరమైన విజయాలు, అగ్రస్థానానికి చేరుకునేందుకు ఎదుర్కొన్న సవాళ్లు తదితర వివరాలన్నీ ఇందులో ఉండనున్నాయి" అని ఆమె పేర్కొన్నారు.

తన తండ్రి జీవితాన్ని తెరపైకి తీసుకువస్తే ఎలా ఉంటుందన్న ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. "ఒకవేళ నాన్నగారి జీవితాన్ని సినిమాగా తీస్తే, అది నాకు వ్యక్తిగతంగా, వృత్తిపరంగా అత్యంత ప్రత్యేకమైందిగా ఉంటుంది. ఒక చిత్ర దర్శకుడు తనలోని ప్రతి ఆలోచనను ఒకే కథలో పెట్టలేడు. ఏ కథకు ఏది అవసరమో తెలుసుకోవాలి. మిగిలిన ఆలోచనలను భవిష్యత్తు కథల కోసం దాచుకోవాలి. సృజనకు స్పష్టత, క్రమశిక్షణ అవసరమని నాన్నగారు నాకు నేర్పారు. రజనీకాంత్ కుమార్తెగా పుట్టడం గొప్ప వరం. ఆయన కూతురునైనందుకు పోలికలు, అంచనాలు కూడా ఉంటాయి. నేను ఇష్టంతోనే చిత్రరంగంలోకి వచ్చాను. దాని గురించి నాకు ఎలాంటి పశ్చాత్తాపం లేదు" అని చెప్పారు.

ప్రస్తుతం ఆమె నిర్మాణంలో నెట్‌ఫ్లిక్స్ కోసం '#లవ్' అనే తమిళ వెబ్‌సిరీస్ రూపొందుతోంది. ఈ రొమాంటిక్ సిరీస్‌కు బాలాజీ మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. అర్జున్ దాస్, ఐశ్వర్య లక్ష్మి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. అక్టోబరులో నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదల కానుంది.

# వివాహబంధంలోకి టాలీవుడ్ హీరో..



టాలీవుడ్ హీరో ప్రిన్స్ ఓ ఇంటివాడయ్యారు. తన ప్రియురాలు సాయి మాచిరాజు ) మెడలో మూడుముళ్లు వేశారు. పెద్దల అంగీకారంతో ఆగస్టు 24న న్యూజిలాండ్ వేదికగా వీరి వివాహం జరిగింది. ఈ ఫొటోలను ఇన్‌స్టాలో పంచుకున్న ప్రిన్స్.. జీవితకాలపు బంధానికి స్వాగతమంటూ లవ్ ఎమోజీలను జోడించారు.

ఒక కామన్ ఫ్రెండ్ పెళ్లిలో న్యూజిలాండ్‌కు చెందిన ఎన్నారై సాయి మాచిరాజుతో ప్రిన్స్‌కు పరిచయం ఏర్పడింది. కొద్దిరోజుల్లోనే వీరిమధ్య ప్రేమ చిగురించింది. ఈ ఏడాది జూన్‌లో అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో వీరి నిశ్చితార్థం జరిగింది. ఇప్పుడు వివాహబంధంతో ఒక్కటయ్యారు. తేజ దర్శకత్వంలో వచ్చిన 'నీకు నాకు డాష్ డాష్' సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమయ్యారు ప్రిన్స్. మారుతి దర్శకత్వం వహించిన 'బస్ స్టాప్'తో గుర్తింపు తెచ్చుకున్నారు. హీరోగానే కాకుండా సహాయ నటుడిగా ప్రాధాన్యత ఉన్న పాత్రల్లోనూ నటిస్తున్నారు.

# సంక్రాంతికి 'కాకా' వస్తుండు..

"మన టార్గెట్ పండగ రా. అప్పటి దాకా ఎవరికీ సెలవుల్లేవు" అంటున్నారు కథానాయకుడు చిరంజీవి. ఇప్పుడాయన బాబీ దర్శకత్వంలో తన 158వ సినిమాని చేస్తున్న సంగతి తెలిసిందే. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మిస్తున్నారు. అనస్వర రాజన్, నివేదా పేతురాజ్, సునీల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి 'కాకా' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ఈ మేరకు శనివారం చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్‌ని బయటకు వదిలారు. ఇక ఈ ప్రచార చిత్రం విషయానికొస్తే.. దీంట్లో చిరు పాత్రలోని భిన్న కోణాల్ని పరిచయం చేసే ప్రయత్నం చేశారు. ఇందులో ఆయన ఆక్వా సంస్థలో పని చేసే ఉద్యోగిగా కె.సత్యం అనే పాత్రలో కనిపించనున్నారు.

"ఇది సత్యం మాట.. ఇంకా డౌటా" అనే డైలాగ్‌తో తన పాత్ర స్వభావాన్ని తెలియజేశారు. ఇక నీళ్లలో పడిన బైక్ తాళాన్ని ఆయన బయటకు తీసిన తీరు.. దానికి ఉన్న 'ఐ లవ్ డాడీ' అనే కీ చైన్.. దానితో పాటు బయటకొచ్చిన మిషన్ గన్స్.. ఈ కథలోని ముఖ్య పార్శ్వాల్ని తెలియజెప్పాయి. ఓవైపు ఫాదర్ ఎమోషన్.. మరోవైపు స్టైలిష్ యాక్షన్ ఈ సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నట్లు గ్లింప్స్‌లో కనిపించిన సన్నివేశాల్ని బట్టి అర్థమవుతోంది. ఇందులో చిరు తన వయసుకు తగ్గట్లుగా కొత్త లుక్స్‌లో కనిపించిన తీరు.. వీడియోలో వినిపించిన 'గ్యాంగ్ లీడర్'లోని "పాప రీటా.." బ్యాగ్రౌండ్ మ్యూజిక్ హైలైట్‌గా నిలిచాయి. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సంక్రాంతి సందర్భంగా వచ్చే ఏడాది జనవరి 13న విడుదల కానుంది. ఈ సినిమాకి సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: విజయ్ కార్తీక్ కన్నన్.

చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా 'విశ్వంభర' నుంచి ఓ కొత్త పోస్టర్‌తో పాటు ఒరిజినల్ సౌండ్ ట్రాక్ విడుదలైంది. ఆ ప్రచార చిత్రంలో త్రిశూలం పట్టుకుని సీరియస్ లుక్‌లో చిరు కనిపించిన తీరు.. సౌండ్ ట్రాక్‌లో గౌర హరి సంగీతం అలరించాయి. వశిష్ఠ దర్శకత్వంలో ముస్తాబైన ఈ సోషియో ఫాంటసీ అడ్వెంచర్ థ్రిల్లర్ ప్రస్తుతం ముగింపు దశలో ఉంది. త్వరలోనే విడుదల తేదీపై స్పష్టత ఇవ్వనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. యూవీ క్రియేషన్స్ నిర్మించిన ఈ సినిమాకి ఎంఎం కీరవాణి, భీమ్స్ సంగీతమందిస్తున్నారు.




# రెండో రోజూ భారత్‌దే.. ముగిసిన ఆట.. శ్రీలంక 8/2



శ్రీలంక, భారత్ మధ్య జరుగుతున్న రెండో టెస్టులో రెండో రోజు ఆట ముగిసింది. ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 8/2తో ఉంది. ప్రభాత్ జయసూర్య (2) రెండో వికెట్‌గా ఔటైన తర్వాత ఆట ముగిసినట్లు ప్రకటించారు. ప్రస్తుతం కమిల్ మిశ్రా (5*) క్రీజులో ఉన్నాడు. లంక ఇంకా 495 పరుగుల వెనుకంజలో ఉంది. అంతకుముందు 300/5తో రెండో రోజు ఆటను కొనసాగించిన భారత్ 503/9 వద్ద డిక్లేర్ చేసింది. ప్రసిద్ధ్ కృష్ణ, మానవ్ సుతార్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

తొలి ఇన్నింగ్స్ ఆరంభంలోనే శ్రీలంకకు షాక్ తగిలింది. ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో లహిరు ఉదార (1) పెవిలియన్ చేరాడు. ఔట్‌సైడ్ ఎడ్జ్ అయిన బంతి నేరుగా థర్డ్ స్లిప్‌లో ఉన్న జైస్వాల్ చేతిలో పడింది. 2 ఓవర్లకు శ్రీలంక స్కోరు 2/1.

శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా భారీ స్కోరు చేసింది. 300/5తో రెండో రోజు ఆటను కొనసాగించిన భారత్ 503/9 వద్ద డిక్లేర్ చేసింది. ఏడు పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బ్యాటింగ్‌కు వచ్చిన ధ్రువ్ జురెల్ (115*; 177 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఆదివారం మూడు పరుగులు చేసి రిటైర్డ్ హర్ట్ అయిన రిషభ్ పంత్ (63; 89 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) తిరిగి బ్యాటింగ్‌కు వచ్చి అర్ధ శతకం బాదాడు. మానవ్ సుతార్ (18) పరుగులు చేసి వెనుదిరిగాడు. శ్రీలంక బౌలర్లలో అసిత ఫెర్నాండో 4, ప్రభాత్ జయసూర్య 2, కేశర నువాంతు 2, లాహిరు కుమార ఒక వికెట్ పడగొట్టారు. తర్వాత శ్రీలంక బ్యాటింగ్‌కు దిగగా.. రెండు బంతులు పడగానే ఆకాశం మేఘావృతం కావడంతో ముందు జాగ్రత్తగా ఆటను నిలిపి వేసి మైదానాన్ని కవర్లతో కప్పి ఉంచారు.

ఆట తిరిగి ప్రారంభం కాగా.. భారత బ్యాటర్ ధ్రువ్ జురెల్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 171 బంతుల్లో అతను మూడంకెల స్కోరు అందుకున్నాడు. జురెల్ 99 పరుగులకు చేరిన తర్వాత సెంచరీ అందుకోవడానికి 13 బంతులు తీసుకున్నాడు. అయితే, శతకం పూర్తి చేసుకున్న తర్వాత ఎదుర్కొన్న తొలి బంతినే జురెల్ సిక్సర్‌గా మలిచాడు. అనంతరం ప్రభాత్ జయసూర్య బౌలింగ్‌లో సిరాజ్ (3) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరగడంతో భారత్ తొమ్మిదో వికెట్ కోల్పోయింది. 137 ఓవర్లకు భారత్ స్కోరు 489/9. జురెల్ (106) తోపాటు ప్రసిద్ధ్ కృష్ణ క్రీజులో ఉన్నారు.

వర్షం తగ్గిపోవడంతో మ్యాచ్‌ను కొనసాగించేందుకు మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు. 4:25 గంటలకు ఆట తిరిగి ప్రారంభంకానుంది. సరైన వెలుతురు ఉండి వాతావరణం అనుకూలిస్తే సాయంత్రం 6 గంటల వరకు ఆట నిర్వహించనున్నారు.

కొలంబోలో వర్షం కురవడం ఆగిపోయింది. ప్రస్తుతం ఎండ కూడా కాస్తోంది. దీంతో మ్యాచ్ నిర్వహణకు వీలుగా సిబ్బంది మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు.

రెండో టెస్టుకూ వరుణుడు అంతరాయం కలిగించాడు. దీంతో ఆటను అంపైర్లు నిలిపివేశారు. మైదానాన్ని సిబ్బంది కవర్లతో కప్పేశారు. ప్రస్తుతం భారత్ స్కోరు 131.2 ఓవర్లకు 475/8. ధ్రువ్ జురెల్ (95*) సెంచరీకి చేరువగా వచ్చాడు. అతడితోపాటు క్రీజ్‌లో మహ్మద్ సిరాజ్ ఉన్నాడు. వర్షం రావడంతో టీ బ్రేక్‌ను ముందే ప్రకటించారు.

భారత్ ఎనిమిదో వికెట్‌ను నష్టపోయింది. ఇక ప్రభాత్ జయసూర్యకు ఎట్టకేలకు వికెట్ దక్కింది. జయసూర్య వేసిన (124.4వ ఓవర్) బంతిని ఆడే క్రమంలో మానవ్ సుతార్ (18) వికెట్ కీపర్ డిక్వెల్లాకు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. ప్రభాత్‌కు ఇది 36వ ఓవర్ కావడం గమనార్హం. ప్రస్తుతం భారత్ స్కోరు 458/8.

భారత్ ఇన్నింగ్స్ సాఫీగా సాగుతోంది. రిషభ్ పంత్ ఔటైన తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన మానవ్ సుతార్ (13*) కూడా క్రీజ్‌లో పాతుకుపోయాడు. మరోవైపు ధ్రువ్ జురెల్ (76*) కీలక ఇన్నింగ్స్ ఆడుతున్నాడు. అనవసమైన షాట్లకు పోకుండా పరుగులు రాబట్టడంపైనే భారత బ్యాటర్లు దృష్టి పెట్టారు. ప్రస్తుతం భారత్ స్కోరు 122 ఓవర్లకు 450/7.

రిషభ్ పంత్ (63) ఔటయ్యాడు. లంచ్ బ్రేక్ తర్వాత ఆడిన తొలి బంతికే పెవిలియన్‌కు చేరడం గమనార్హం. కేశర నువాంత వేసిన (112.1వ ఓవర్) తొలి బంతిని పంత్ భారీ షాట్ కొట్టాడు. కానీ, డీప్ మిడాఫ్‌లో లాహిరు ఉదారా చేతికి చిక్కాడు. దీంతో ధ్రువ్ జురెల్‌తో ఏడో వికెట్‌కు 112 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అనంతరం బ్యాటింగ్‌కు మానవ్ సుతార్ వచ్చాడు. ప్రస్తుతం భారత్ స్కోరు 113 ఓవర్లకు 419/7. క్రీజ్‌లో సుతార్, ధ్రువ్ జురెల్ (59*) ఉన్నారు.

శ్రీలంకతో రెండో టెస్టు రెండో రోజు ఆటలో తొలి సెషన్ ముగిసింది. లంచ్ బ్రేక్ సమయానికి భారత్ స్కోరు 419/6. క్రీజ్‌లో రిషభ్ పంత్ (63*), ధ్రువ్ జురెల్ (59*) ఉన్నారు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు ఇప్పటి వరకు 112 పరుగులు జోడించారు. ఇక ఈ సెషన్‌లో భారత్ 119 పరుగులను రాబట్టింది.

భారత బ్యాటర్లు రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్ అర్ధశతకాలు సాధించారు. తొలుత 81 బంతుల్లో పంత్ హాఫ్ సెంచరీని పూర్తి చేశాడు. కెరీర్‌లో ఇది అతడికి 21వది. తర్వాత ధ్రువ్ జురెల్ 99 బంతుల్లో తన మూడో హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకొన్నాడు. వీరిద్దరి భాగస్వామ్యం కూడా సెంచరీకి చేరువగా ఉంది. ప్రస్తుతం భారత్ స్కోరు 110 ఓవర్లకు 403/6. క్రీజ్‌లో పంత్ (51*), ధ్రువ్ జురెల్ (55*) ఉన్నారు.

భారత ఆటగాడు రిషభ్ పంత్ అద్భుతమైన ఘనత సాధించాడు. ఈ క్రమంలో మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనిని అధిగమించాడు. విదేశీ గడ్డపై టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన భారత వికెట్ కీపర్‌గా పంత్ రికార్డు నమోదు చేశాడు. ధోని 2,496 పరుగులు చేయగా.. పంత్ 2500 పరుగుల మైలురాయిని దాటేశాడు. శ్రీలంకతో రెండో టెస్టులో పంత్ దూకుడుగా ఆడేందుకు ప్రయత్నిస్తున్నాడు. ప్రస్తుతం భారత్ స్కోరు 103 ఓవర్లకు 376/6. క్రీజ్‌లో పంత్ (39*), ధ్రువ్ జురెల్ (40*) ఉన్నారు.

గాయం కావడంతో నిన్న రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన రిషభ్ పంత్ (18*) ఇవాళ బరిలోకి దిగాడు. అయితే, 94వ ఓవర్‌లో అసిత వేసిన బంతిని ఆడే క్రమంలో.. పంత్ భుజం కింది భాగంలో బలంగా తాకింది. అయితే, ఆ బంతి స్టంప్స్‌కు కాస్త పక్కగా వెళ్లింది. ఒకవేళ స్టంప్స్‌ను తాకి ఉండుంటే కచ్చితంగా పంత్ పెవిలియన్‌కు చేరేవాడు. అయితే, అదృష్టం మాత్రం పంత్ వైపు నిలిచింది. షార్ట్ పిచ్ బంతులతో ఇబ్బంది పెట్టేందుకు ఇవాళ కూడా లంక పేసర్లు ప్రయత్నిస్తున్నారు. కానీ, పంత్ కొట్టిన ఓ బంతి 95 మీటర్ల సిక్స్‌గా వెళ్లింది. ప్రస్తుతం భారత్ స్కోరు 94 ఓవర్లకు 335/6. క్రీజ్‌లో పంత్‌తోపాటు ధ్రువ్ జురెల్ (24*) ఉన్నాడు.

కొలంబో వేదికగా శ్రీలంకతో భారత్ రెండో టెస్టు మ్యాచ్ ఆడుతోంది. రెండో రోజు ఆట కొనసాగుతోంది. అయితే, ఆట ప్రారంభమైన కాసేపటికే టీమ్‌ఇండియా వికెట్ కోల్పోయింది. ఇవాళ రెండో ఓవర్‌లో అసిత ఫెర్నాండో (86.5వ ఓవర్) వేసిన షార్ట్ పిచ్ బంతిని ఆడే క్రమంలో సారాంశ్ జైన్ (6) ఔటయ్యాడు. అతడు ఇచ్చిన క్యాచ్‌ను కమిల్ మిషారా అద్భుతంగా ఒడిసిపట్టాడు. అనంతరం రిషభ్ పంత్ బ్యాటింగ్‌కు వచ్చాడు. నిన్న గాయంతో ఇబ్బంది పడిన పంత్ ఎట్టకేలకు క్రీజ్‌లోకి రావడంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం టీమ్‌ఇండియా స్కోరు 88 ఓవర్లకు 309/6. క్రీజ్‌లో రిషభ్ పంత్ (4*), ధ్రువ్ జురెల్ (12*) ఉన్నారు.

## అసిత ఫెర్నాండోతో గొడవ.. యశస్వి జైస్వాల్‌కు జరిమానా

శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో తొలి రోజు భారత ఆటగాడు యశస్వి జైస్వాల్ - అసిత ఫెర్నాండో మధ్య వాగ్వాదం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనపై స్పందించిన ఐసీసీ క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని లెవెల్ -1ను ఉల్లంఘించినట్లు తేలడంతో యశస్వితోపాటు ఫెర్నాండోకు మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించింది. అంతేకాకుండా ఇద్దరికీ చెరో డీమెరిట్ పాయింట్ ఇచ్చింది. తొలి రోజు ఆటలో యశస్వి జైస్వాల్ ఔట్ చేసిన తర్వాత ఫెర్నాండో అత్యుత్సాహం ప్రదర్శించాడు. దీంతో జైస్వాల్ అతడితో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో జైస్వాల్ హెల్మెట్ ఫెర్నాండో నుదుటికి తాకింది. పరిస్థితి చేయిదాటిపోయేలా ఉండటంతో లంక కెప్టెన్ ధనంజయ డిసిల్వా, వైస్ కెప్టెన్ కమిందు మెండిస్‌తో పాటు ఇతర ఆటగాళ్లు, అంపైర్లు జోక్యం చేసుకుని ఇద్దరినీ దూరం తీసుకెళ్లడం తో ఈ గొడవ సద్దుమణిగింది.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314